సత్యమేవ జయతే

# సాక్షి

సోమవారం 2-3-2020

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 341



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



**డిజిటల్ పాలసీ ఎంతో చౌక**

ఆన్‌లైన్‌లో వాహన బీమా తో ఆదా. అకో, గో డిజిట్ నుంచి ఆఫర్లు -ప్రాఫిట్‌ప్లస్‌లో



**ఆలౌట్ చేసి... అదే దారిలో..**

భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టులో రెండో రోజు వికెట్ల జాతర -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

● వెనకడుగు వేసేదే లేదు..

### పౌరసత్వమిచ్చి తీరుతాం



సీఏఏ కింద దేశంలోని శరణార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం పౌరసత్వం ఇచ్చి తీరుతుందని.. అప్పటివరకు వెనకడుగు వేసేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. సీఏఏ శరణార్థులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించింది మాత్రమేనని.. దీనివల్ల ఏ ఒక్క వ్యక్తి తన పౌరసత్వాన్ని కోల్పోడని ఉద్ఘాటించారు.

- 5లో

● స్వదేశీ హెలికాప్టర్లు

### అపాచీకి దీటుగా..



అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు చెందిన అపాచీ హెలికాప్టర్లకు దీటుగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో మధ్య తరహా మిలటరీ హెలికాప్టర్లను తయారు చేయడానికి హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) సన్నాహాలు చేస్తోంది. 2027 కల్లా వీటిని తయారు చేయనుంది.

- 5లో

● పలు దేశాల్లో మరణాలు..

### చైనా వెలుపల కోవిడ్



శరవేగంగా విస్తరిస్తున్న కోవిడ్ మహమ్మారి చైనా వెలుపల కూడా ప్రాణాలను మింగేస్తోంది. అమెరికా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్‌లో తొలిసారిగా కరోనా మరణాలు నమోదయ్యాయి. అమెరికా గడ్డపై 50 ఏళ్ల పైబడిన ఒక వ్యక్తి మరణించినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

- 5లో

● రక్షణ దళానికి

### త్రీస్టార్ డాక్టర్..



డాక్టర్ మాధురీ కణిట్కర్.. రక్షణ దళాల వైద్య సిబ్బందికి కొత్త డిప్యూటీ చీఫ్. భారత రక్షణ దళాల చరిత్రలో ఇంత వరకు ఇద్దరే మహిళా లెఫ్టినెంట్ జనరల్స్. మాధురి ఇప్పుడు మూడో జనరల్ కాగా.. మాధురి, ఆమె భర్త త్రీస్టార్ ఉన్న తొలి దంపతులుగా ఇక నుంచీ గుర్తింపు పొందుతారు.

- ఫ్యామిలీలో

## ఇంటర్ విద్యకు

# చైనా వైరస్



- విద్యార్థుల జీవితాలతో ఆ రెండు కార్పొరేట్ కాలేజీల చెలగాటం
- అనుమతుల్లేని హాస్టళ్లలో అత్యధికం ఆ కాలేజీలవే
- ఫైర్ సేఫ్టీ నిబంధనలను పట్టించుకోని యాజమాన్యాలు
- లక్షల్లో ఫీజులు గుంజుతూ అరకొర సౌకర్యాలు

**సాక్షి, హైదరాబాద్:** అవన్నీ ఐదారు అంతస్తుల భవనాలు.. వాటిల్లో ఒకట్రెండు లిఫ్టులున్నా అవి విద్యార్థులు వినియోగించడానికి వీల్లేదు! భవనాల చుట్టూ ఫైర్ ఇంజిన్ తిరగడం కాదు కదా కనీసం ఆయా భవనాల్లో ఉండాల్సినన్ని అగ్నిమాపక పరికరాలకూ దిక్కులేదు!! ఒకవేళ ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ఇక అంతే సంగతులు. ప్రమాదం అంచున వేల మంది విద్యార్థుల జీవితాలు. ఇదీ శ్రీచైతన్య, నారాయణ కాలేజీల్లో పరిస్థితి. ఫైర్ సేఫ్టీ కచ్చితంగా ఉండాల్సిందేనని ఇంటర్మీడియెట్ బోర్డు ఏటా నోటీసులు ఇవ్వడం.. అందినకాడికి ముడుపులు పుచ్చుకోవడం.. ఆ తరువాత మిన్నకుండిపోవడం పరిపాటిగా మారింది. విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందనే సాకుతో ఏళ్ల తరబడి షరతులతోనే ఆ కాలేజీలను యాజమాన్యాలు కొనసాగిస్తున్నాయి. ఈసారి కూడా అదే ఆయుధాన్ని ఉపయోగించాయి. అయితే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు కావడంతో 2020–21 విద్యా సంవత్సరంలో ఆయా కాలేజీలపై పక్కా చర్యలు చేపడతామని ఇంటర్ బోర్డు చెబుతున్నా ఎంతవరకు ఆచరిస్తుందనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాదు అనుమతుల్లేకుండా కొనసాగుతున్న ఆయా కాలేజీల హాస్టళ్లు నరకానికి నకళ్లుగా ఉన్నా అధికారులకు కనీస పట్టింపు లేకుండాపోయిందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి.

**ఆ రెండింటివే 44 కాలేజీలు...**

ఫైర్ సేఫ్టీ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కాలేజీలు రాష్ట్రంలో 79 ఉండగా అందులో 44 కాలేజీలు ఆ రెండు విద్యాసంస్థలకు సంబంధించినవే ఉన్నట్లు ఇంటర్ బోర్డు తేల్చింది. అందులో శ్రీచైతన్య విద్యా సంస్థలకు చెందిన జూనియర్ కాలేజీలు 18 ఉండగా, నారాయణ విద్యా సంస్థలకు చెందిన

మిగతా 3వ పేజీలో ▶

**అదుపులేని ఫీజులు..**

కాలేజీల్లో ఫీజుల నియంత్రణ ఇంటర్ బోర్డుకు పట్టడం లేదు. రకరకాల పేర్లతో రూ. లక్ష నుంచి మొదలుకొని రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టడం లేదు. 10–20 మంది టాప్ ర్యాంకర్లను ఎరగా చూపి విద్యా వ్యాపారం చేస్తున్నాయి. ఫీజు చెల్లించడంలో ఆలస్యమైతే విద్యార్థులను టీసీ ఇచ్చి పంపేస్తున్నాయి. ఇటీవల అవినాష్ కాలేజీలో ఫీజు చెల్లించలేదన్న సాకుతో వేధిస్తున్నారంటూ దీపక్ అనే విద్యార్థి సూసైడ్ నోట్ రాయడం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది.

# వలలే ఉరితాళ్లు!

### చేపల వలలకు చిక్కి మరణిస్తున్న విదేశీ పక్షులు

- జాలరులకు అవగాహన లేకపోవడమే కారణం..
- 'యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్' పరిశీలనలో వెల్లడి
- అటవీ శాఖ దృష్టికి తీసుకెళ్లిన వైనం
- పక్షులను రక్షించేందుకు అవగాహన కార్యక్రమాలు

**సాక్షి, హైదరాబాద్:** వేసవి విడిది కోసం వచ్చిన విదేశీ అతిథులు వలలకు చిక్కి అల్లాడుతున్నాయి. జాలరులు చేపల కోసం వేసుకున్న వలలు తెలియకుండానే విదేశీ విహంగాలకు ఉరితాళ్లుగా మారుతున్నాయి. గుడ్లు పెట్టి పిల్లలను పొదిగి కొత్తగా ఏర్పడ్డ కుటుంబంతో తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్లాలని సంబరపడే విదేశీ వలస పక్షులు వేటలో భాగంగా అనుకోకుండా వలలకు చిక్కి మృతి చెందుతున్నాయి. హైదరాబాద్‌లోని ప్రధాన జలాశయం గండిపేటలో ఓ స్వచ్ఛంద సంస్థ కొద్ది రోజుల పాటు పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించింది. జాలరుల అవగాహన లేమితోనే ఇదంతా జరుగుతోందని కనుగొంది. అక్కడి పరిస్థితులు వలస పక్షులకు మృత్యుకౌగిలిగా మారుతున్న తీరును అటవీశాఖ అధికారుల దృష్టికి తెచ్చింది. వలస పక్షులను రక్షించేందుకు జాలరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమైంది.

**ఇదీ సంగతి..:** వేసవి సమీపించిందంటే చాలు సైబీరియా మొదలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి పక్షులు మన దగ్గరకు వలస రావడం తెలిసిందే. నీటి వనరులు ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఆవాసాలుగా చేసుకుని గూళ్లు ఏర్పాటు చేసుకుని గుడ్లు పెట్టి పొదిగి, ఆ పిల్లలు ఎగిరే నేర్పును పొందే వరకు ఎదురు చూసి ఆ తర్వాత సొంత

మిగతా 2వ పేజీలో ▶



హైదరాబాద్ గండిపేట చెరువులో వల కాళ్లకు చిక్కుకోవడంతో విడిపించుకునేందుకు ప్రయత్నిస్తున్న కామన్ కెస్ట్రెల్ పక్షి

### పీఎఫ్‌పై 8.65% వడ్డీ రేటు

## కొనసాగింపు!

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–20)లో ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై 8.65 శాతం వడ్డీ రేటునే కొనసాగించాలని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) భావిస్తున్నట్లు తెలుస్తోంది. మార్చి 5న జరిగే ట్రస్టీల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి.

- వివరాలు 13లో

# 'ఉపాధి'లో వేతన విభజన

### పనితీరు ఆధారంగానే ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాల చెల్లింపు

- గ్రామ పంచాయతీలోని ప్రతి జాబ్ కార్డుదారునికి 30 పనిదినాలు కల్పిస్తేనే రూ. 10వేల వేతనం
- 20కి పైగా కల్పిస్తే రూ.9 వేలు, 10 నుంచి ఆ పైన రూ.7,500
- అంతకన్నా తక్కువ పనిదినాలు కల్పించిన వారి తొలగింపునకు ఉత్తర్వులు
- 14లోగా ప్రక్రియ పూర్తికి డీవోఆర్‌డీ ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయంపై ఫీల్డ్ అసిస్టెంట్ల అసంతృప్తి



**సాక్షి, హైదరాబాద్:** గ్రామీణ పేదలకు ఏడాదికి 100 రోజుల పని కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి హామీ పథకం అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లను దారిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్దేశించిన నెలకు రూ.10 వేల వేతనాన్ని పనితీరు ఆధారంగా విభజించనుంది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రఘునందన్‌రావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కేటాయించిన పంచాయతీల్లోని జాబ్‌కార్డుదారులకు కల్పించే పనిదినాల ఆధారంగా వారిని విభజించాలని, మరీ తక్కువ పనిదినాలు కల్పించిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే తొలగించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల కేటగిరైజేషన్‌తో పాటు తొలగింపు ప్రక్రియను ఈనెల 14కల్లా పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

**మూడు కేటగిరీలుగా విభజన..**

ఇప్పటివరకు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి నెలకు రూ.10 వేల వేతనం ఇస్తున్నారు. ప్రతి యేటా జూలై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు వారిని రెన్యువల్ చేస్తుంటారు. వీరు ఈ పథకం కింద వారికి కేటాయించిన పంచాయతీల్లోని

మిగతా 2వ పేజీలో ▶

# 31లోగా 100% పన్ను వసూలు చేయాల్సిందే

### మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సర్కారు ఆదేశం

- ఇప్పటివరకు ఆస్తి పన్ను వసూలు 62 శాతమే ఉండటంపై తీవ్ర అసంతృప్తి
- మున్సిపల్ కమిషనర్లపై మండిపడ్డ పురపాలక శాఖ
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు, ఆపై లీగల్ నోటీసులు.. వారి జాబితాలు మున్సిపాలిటీ వెబ్‌సైట్లలో ప్రదర్శనకు ఆదేశాలు




సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ప్రకటనల పన్ను, షాపుల అద్దెల వసూళ్ల తీరుపై పురపాలక శాఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 2019–20 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియబోతుండగా, ఇప్పటివరకు నివాస గృహాల యజమానుల నుంచి కేవలం 62 శాతం ఆస్తి పన్ను మాత్రమే వసూలు చేశారని మున్సిపల్ కమిషనర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొన్ని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుల వసూళ్లు 30 శాతం కూడా జరగలేదని తెలిపింది. నివాస గృహాల నుంచి రూ.672.30 కోట్ల ఆస్తి పన్నులు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.416.85 కోట్లు మాత్రమే వసూలయ్యాయని, మరో రూ.255.44 కోట్లు రాబట్టాల్సి ఉందని తెలిపింది. ఎట్టి పరిస్థితిలోనైనా మార్చి 31లోగా 100 శాతం ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ప్రకటనల పన్ను, దుకాణాల అద్దెలను వసూలు చేయాల్సిందేనని ఆదేశిస్తూ పురపాలక శాఖ డైరెక్టర్ డి.సత్యనారాయణరెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు ఆస్తి పన్నులు, ఇతర పన్నులు, ఫీజుల వసూళ్ల పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్లు అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని ఉత్తర్వుల్లో కోరారు.

**వెబ్‌సైట్, నోటీసు బోర్డుల్లో వారి జాబితా..**

సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించడంలో విఫలమైన వారికి రెడ్ నోటీసులు

మిగతా 2వ పేజీలో ▶






# రేవంత్ భూఆక్రమణలు నిజమే!

**నిర్ధారించిన రెవెన్యూ శాఖ**

- మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డిలపై వచ్చిన భూఆక్రమణ ఆరోపణలను రెవెన్యూ వర్గాలు నిర్ధారించినట్టు తెలుస్తోంది. ఈ ఆరోపణలపై మరింత లోతుగా విచారించేందుకు ప్రత్యేక అధికారిని కూడా ప్రభుత్వం నియమించనున్నట్టు సమాచారం.

- వివరాలు 2లో




## ఇదంజగత్



అలా ఇక్కడ కూడా పెడితే బావుండు.. నీతో షాపు పెట్టించి రోజూ ఫ్రీగా తాగేవాడిని!

# ఖరీఫ్‌ను మించి యాసంగిలో...

### ఏకంగా 59 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం అంచనా

- ఖరీఫ్‌కన్నా ఏకంగా 12 లక్షలు, గత యాసంగికన్నా 22 లక్షల టన్నులు ఎక్కువ
- నీటి లభ్యత పెరిగి, సాగు విస్తీర్ణం 10 లక్షల ఎకరాల మేర పెరగడమే కారణం
- నేడు యాసంగి ధాన్యం సేకరణపై సన్నాహక సమావేశం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి ధాన్యం మార్కెట్లను ముంచెత్తనుంది. విస్తారంగా కురిసిన వర్షాలతో నిండిన ప్రాజెక్టుల ద్వారా పుష్కలంగా నీటి సరఫరా జరగడం, చెరువుల కింద సాగు విస్తీర్ణం పెరగడంతో ధాన్యం దిగుబడి గత ఖరీఫ్ కంటే అధికంగా ఉండనుంది. ఈ యాసంగిలో 59 లక్షల టన్నుల మేర ధాన్యం సేకరించే అవకాశం ఉంటుందని పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖలు అంచనా వేస్తున్నాయి. ఇది గత ఖరీఫ్‌లో సేకరించిన దానికన్నా 12 లక్షల టన్నులు అధికంగా వచ్చే అవకాశం ఉండటం విశేషం.

**అనుకున్నంతా వస్తే చరిత్రే...**

రాష్ట్రంలో ఈ ఏడాది యాసంగిలో విస్తృతంగా వరి సాగు జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు జరిగి ఎస్సారెస్పీ పూర్తి ఆయకట్టుకు నీరు అందడం, నాగార్జునసాగర్, ఇతర మధ్య తరహా ప్రాజెక్టుల కింద నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో సాగునీటి ప్రాజెక్టుల కింద వరిసాగు పెరిగింది. గతేడాది యాసంగిలో మొత్తంగా 18.57 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరగ్గా ఈ ఏడాది అది ఏకంగా 28.55 లక్షల ఎకరాలకు పెరిగింది. 10 లక్షల ఎకరాల మేర సాగు పెరగడంతో ఈ సీజన్‌లో వరి ధాన్యం భారీగా మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. గతేడాది యాసంగిలో పౌరసరఫరాల శాఖ 37 లక్షల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మొన్నటి ఖరీఫ్‌లో 47.11 లక్షల టన్నులు సేకరించింది. అయితే ఈ యాసంగిలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఏకంగా 59 లక్షల టన్నులు సేకరించాల్సి ఉంటుందని పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖలు అంచనా వేశాయి. ఖరీఫ్‌కన్నా ఏకంగా 12 లక్షలు, గతేడాది యాసంగికన్నా 22 లక్షల టన్నుల మేర అధికంగా వచ్చే అవకాశాల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లకు సిద్ధమయ్యాయి. ఖరీఫ్‌లోనే 3,670 కొనుగోలు కేంద్రాలు, 12 కోట్ల గోనెసంచులు అందుబాటులో ఉంచగా ఈ ఏడాది అంతకుమించి ఏర్పాటు చేయాల్సి ఉంటుందని శాఖలు తేల్చాయి. కొనుగోలు కేంద్రాల సంఖ్యను 4 వేలకు పెంచే అవకాశాలున్నాయి. ఇక ఖరీఫ్‌లో రూ. 8,626 కోట్లు సేకరణకు వెచ్చించగా ఈ సీజన్‌లో రూ. 10 వేల కోట్లు అవసరం ఉంటుందని లెక్కిస్తున్నారు. ఈ సీజన్‌లో సైతం క్వింటాలు గ్రేడ్–ఏ వరి ధాన్యానికి రూ. 1,835, కామన్ వెరైటీకి రూ. 1,815 చొప్పున అందించనున్నారు.



**ధాన్యం విక్రయంపై రైతులకు అవగాహన..**

ఇక యాసంగి ధాన్యం సేకరణపై సన్నాహక సమావేశాన్ని సోమవారం వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖలు నిర్వహించనున్నాయి. ఈ భేటీకి మంత్రులు గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డితో పాటు ఇరు శాఖల అధికారులు హాజరు కానున్నారు. ధాన్యం విక్రయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ నాణ్యత, పరిమాణం విషయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించేలా వ్యవసాయ శాఖను ధాన్యం సేకరణలో భాగస్వామిని చేయనున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఏఈఓను ఇన్‌చార్జిగా నియమించడం, పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం మార్కెట్‌లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

## నేడు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** నైరుతి మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల నుంచి మధ్య మహారాష్ట్ర మీదుగా కోస్తా కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. మరో వైపు రాష్ట్రంలో ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో సోమవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఇదిలావుండగా ఆదివారం పలు చోట్ల వర్షాలు కురిశాయి. కూకట్‌పల్లిలోని సుమిత్రానగర్ కాలనీలో 1.6 సెంటీమీటర్లు, హెచ్ఎంటీ హిల్స్ హైదర్‌నగర్‌లో 1.5 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. హైదరాబాద్‌లో పగటిపూట ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. సాధారణ సగటుకు భిన్నంగా రెండు డిగ్రీల మైనస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాస్తవానికి పగటి పూట 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు, రాత్రి వేళల్లో 18 డిగ్రీలుగా నమోదు కావాల్సింది. కానీ హైదరాబాద్‌లో అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ పేర్కొంది.

## ‘పీఆర్సీని వెంటనే ప్రకటించాలి’

**సాక్షి, హైదరాబాద్:** పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) డిమాండ్ చేసింది. ఆదివారం సంఘం రాష్ట్ర కార్యనిర్వాహకవర్గ సమావేశం జరిగింది. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని సంఘం విమర్శించింది. గత ఆరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క సమస్యను పరిష్కరించలేక పోయిందని వాపోయింది. ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన హామీలకు కూడా దిక్కులేకుండా పోయిందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేశ్ ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సూరం విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు తెల్కలపల్లి పెంటయ్య, బెండి ఉష, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పాలీసెట్ దరఖాస్తులు

**సాక్షి, హైదరాబాద్:** పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలీసెట్-2020 కోసం సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) చర్యలు చేపట్టింది. పదో తరగతి పాసైన విద్యార్థులు, ఈనెలలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు కూడా పాలీసెట్ కోసం దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనుంది. కాగా, పాలీసెట్ పరీక్షను ఏప్రిల్ 17వ తేదీన నిర్వహించనుంది.

## ‘స్టాటిస్టికల్ ఆఫీసర్’ పరీక్షకు 54.31% హాజరు

**సాక్షి, హైదరాబాద్:** కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన పరీక్షకు 54.31 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించినట్లు పేర్కొంది.

## కేలండర్ ఆవిష్కరణ

**సాక్షి, హైదరాబాద్:** సమాచార హక్కు ప్రజా పరిరక్షణ సంక్షేమ సమితి నూతన కేలండర్‌ను తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆదివారం ఆవిష్కరించారు. నూతన కేలండర్‌ను అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రతీ ఆఫీసులో సమాచారం అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో సమాచార హక్కు ప్రజా పరిరక్షణ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## అరబ్‌షేక్‌కు గృహిణిని విక్రయించిన దళారీ

**హైదరాబాద్:** దళారీలను అడ్డుపెట్టుకుని అరబ్ షేక్‌లు పేద మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్న ఘటన మరొకటి వెలుగు చూసింది. అంబర్‌పేటకు చెందిన వివాహిత ఫాతిమా ఉన్నీసా.. బార్కాస్ కొత్తపేట నబీల్ కాలనీలో ఉన్న ఇంటిని అమ్మాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని మహ్మద్ సాబెర్ అలియాస్ వోల్టా సాబెర్ అనే దళారీకి చెప్పింది. ఇల్లు కొనేందుకు ఓ వ్యక్తి సిద్ధంగా ఉన్నాడని సాబెర్ ఫిబ్రవరి 25న ఫాతిమాకు ఫోన్ చేశాడు. ఇల్లు చూపించేందుకని ఆమె తన చెల్లెలు వివాహిత రఫత్ ఉన్నీసా (25)తో కలిసి వెళ్లింది. అక్కడికి వెళ్లగానే అరబ్ షేక్ ఇబ్రహీం షుక్రుల్లా (60) ఫాతిమాను పెళ్లి చేసుకుంటానని అడిగాడు. దానికామె అంగీకరించకపోవటంతో ఆమె చెల్లి రఫత్‌ను కూడా అడిగాడు. ఆమె కూడా తిరస్కరించి ఇంటికి వెళ్లిపోయారు. దీంతో సాబెర్ తన భార్య సమీనా ద్వారా రఫత్‌ను తన ఇంటికి వచ్చేలా ఒప్పించాడు. ఆమె రాగానే, నేరుగా షేక్ వద్దకు తీసుకెళ్లి ఇంట్లోకి నెట్టి బయటికి వచ్చేశారు. అప్పట్నుంచి ఆ షేక్ ఆమె పట్ల క్రూరంగా లైంగిక దాడికి దిగాడు. సిగరెట్లతో కాల్చుతూ చిత్రహింసలకు గురి చేశాడు. తన చెల్లెలు జాడ కోసం ఫాతిమా సాబెర్‌ను గట్టిగా అడగడంతో అసలు విషయం వెల్లడించాడు. ఆ చిరునామాకు వెళ్లేసరికి షేక్ తన పాస్‌పోర్టును వదిలి పారిపోయాడు.



## పట్టాలపై రైలు.. రోడ్లపై లారీ

### కంటెయినర్లతో సరకు రవాణా

**డోర్నకల్:** రైల్వే శాఖ సమయంతో పాటు ఖర్చును ఆదా చేసేందుకు చెన్నై–ఢిల్లీ మార్గంలో రోడ్ రెయిలర్ బోగీలతో సరుకులను రవాణా చేస్తోంది. దీనిని రైల్వే శాఖ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక కంటెయినర్లకు రైలు చక్రాలతో పాటు రోడ్లపై నడిచే విధంగా టైర్లను అమర్చారు. పరిశ్రమల నుంచి టైర్లను అమర్చిన కంటెయినర్‌లో సరుకును లోడ్ చేసి రైల్వే స్టేషన్లకు తరలిస్తారు. అక్కడ జాకీల సహాయంతో కంటెయినర్లను రైలు చక్రాలతో కూడిన బోగీ బెడ్‌పైకి చేరుస్తారు. గమ్యస్థానానికి చేరిన తర్వాత అక్కడ లారీ క్యాబిన్‌కు కంటెయినర్‌ను అమర్చి రోడ్డు మార్గం ద్వారా నేరుగా సరుకును గమ్యస్థానాలకు చేరవేస్తారు. ఢిల్లీ–చెన్నై మార్గంలో నడుస్తున్న కంటెయినర్లతో కూడిన బోగీల రైలు ఆదివారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ స్టేషన్‌లో నిలువగా.. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

## ‘గాంధీ’లో ఇద్దరు కోవిడ్ అనుమానితులు

**హైదరాబాద్:** ప్రపంచ దేశాలను వణికిస్తోన్న కోవిడ్ వైరస్ లక్షణాలతో ఇద్దరు అనుమానితులు ఆదివారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చేరారు. వారి నుంచి నమూనాలు సేకరించి.. నిర్ధారణ కోసం గాంధీ మెడికల్ కాలేజీ మైక్రోబయోలజీ విభాగంలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించామని గాంధీ ఆస్పత్రి నోడల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన నివేదిక సోమవారం వస్తుందని తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో ఇప్పటివరకు 81 మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 79 మందికి కోవిడ్ నెగిటివ్ వచ్చిందని పేర్కొన్నారు.

# రేవంత్ భూఆక్రమణలు నిజమే!

**నిర్ధారించిన రెవెన్యూ శాఖ.. విచారణకు రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం**

- విచారణలో వందల కోట్ల విలువైన వ్యవహారాలు బయటకు వస్తున్నాయంటున్న ప్రభుత్వ వర్గాలు
- సుప్రీం మార్గదర్శకాలు, వాల్టా చట్టాన్ని కూడా ఉల్లంఘించారని ఆరోపణలు

**సాక్షి, హైదరాబాద్:** మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డిలపై వచ్చిన భూఆక్రమణ ఆరోపణలను రెవెన్యూ వర్గాలు నిర్ధారించినట్టు తెలుస్తోంది. ఈ ఆరోపణలపై మరింత లోతుగా విచారించేందుకుగాను ప్రత్యేక అధికారిని కూడా ప్రభుత్వం నియమించనున్నట్టు సమాచారం. ఇప్పటికే ఆయనపై వచ్చిన ఆరోపణలపై జరుగుతున్న రెవెన్యూ విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోనికి వస్తుండడం, స్థానికుల నుంచి సాక్ష్యాధారాలు కూడా లభిస్తుండడంతో ప్రత్యేకంగా విచారణ చేయించడం ద్వారా రేవంత్ అక్రమాలను పూర్తిస్థాయిలో వెలికితీయనున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే జరుగుతున్న విచారణలో రేవంత్ సోదరులిద్దరూ ప్రభుత్వ భూములు, చెరువులు, ప్రైవేటు భూములతోపాటు రోడ్లను కూడా వదల్లేదని వెల్లడయినట్టు తెలుస్తోంది. వీటి విలువ రూ.వందల కోట్లలో ఉంటుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అధికార వర్గాలందించిన సమాచారం ప్రకారం... గోపనపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 34లో ఎకరా 11 గుంటలు, సర్వే నెం 126, కోమటికుంటలో ఎఫ్‌టీఎఫ్ బఫర్‌జోన్‌లో ఎకరా 14 గుంటల భూమిని రేవంత్ సోదరులు కబ్జా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ భూముల ఆక్రమణలతో చెరువులోకి నీళ్లు రాకుండా రేవంత్ అడ్డుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను, వాల్టా చట్టాన్ని, తెలంగాణ రెవెన్యూ ఫస్లీ చట్టాన్ని ఉల్లంఘించారనేందుకు తగిన ఆధారాలు కూడా రెవెన్యూ విచారణలో వెలుగులోకి వస్తున్నట్టు సమాచారం. గోపనపల్లి సర్వే నెంబర్ 127లో ఐదెకరాల 21 గుంటల భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ చేయించుకున్నారని, సర్వే నెంబర్ 128, 160లలో 10 గుంటల ప్రైవేటు స్థలాన్ని కబ్జా చేశారని, సర్వే నెంబర్ 127లో వందేళ్ల నుంచి ఉన్న బండ్ల బాటను కూడా వదలకుండా కబ్జా చేశారనే ఆరోపణలు రేవంత్ ఎదుర్కొంటున్నారు. ఈ వ్యవహారాల్లో ఇప్పటికే డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి డి.శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో మరో ఇద్దరు అధికారుల పాత్ర కూడా ఉందని, అందులో ఒకరు మృతి చెందగా, మరొకరు రిటైర్ అయినట్టు తెలుస్తోంది. ఇప్పుడు మరింత లోతుగా విచారణ జరిపించడం ద్వారా జరిగిన అక్రమాలన్నింటినీ బయటకు తీయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం.



రేవంత్‌రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్న గోపనపల్లి భూమికి సంబంధించిన గూగుల్ చిత్రం

### స్థానికుల ఆరోపణల ఆధారంగా..

గోపనపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 127లో ఉన్న భూమిలో కొంత భాగాన్ని రేవంత్‌రెడ్డి ఆక్రమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భూమిని ఓ వ్యక్తి నుంచి కొన్నట్టుగా నకిలీ పత్రాలు సృష్టించారని కొందరు, తమ పేరిట మ్యుటేషన్ చేసినందుకు డబ్బులిస్తామని చెప్పి ఇవ్వలేదని కొందరు ఆరోపిస్తున్నారు. స్థానికులు కొందరు ఈ విషయంలో కోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో ఉత్తర్వులు వచ్చాయని అంటున్నారు. అయితే, ఈ విషయంపై విచారణ జరిపిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్.. తప్పుడు డాక్యుమెంట్ల ద్వారా ఈ భూమి మ్యుటేషన్ జరిగిందని నిర్ధారించి సీఎస్‌కు నివేదిక ఇచ్చారు. తప్పుగా రికార్డుల్లో నమోదు చేశారని, తప్పుడు మ్యుటేషన్లు చేశారని ఆ నివేదికలో కలెక్టర్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ భూమితో పాటు ఇతర ఆరోపణలపై కూడా ప్రత్యేక అధికారి చేత విచారణ జరిపించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండడం గమనార్హం.

# 31లోగా 100% పన్ను వసూలు చేయాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేయాలని పురపాలక శాఖ ఆదేశించింది. ఒక్కో బిల్ కలెక్టర్ పరిధిలో టాప్ 500 బకాయిదారులను గుర్తించి వారి నుంచి బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది. దీర్ఘకాలంగా ఆస్తి పన్నులు చెల్లించక భారీగా బకాయిపడిన వారిని వ్యక్తిగతంగా సంప్రదించి, బకాయిలు వసూలు చేయాలని కోరింది. బకాయిలు చెల్లించకుండా మొండికేస్తే కొత్త మున్సిపల్ చట్టంలోని నిబంధనల ప్రకారం వారికి లీగల్ నోటీసులు పంపాలని తెలిపింది. ఆస్తి పన్ను బకాయిలకు ఎగనామం పెట్టిన ప్రభుత్వ, ప్రైవేటు భవనాల యజమానుల జాబితాను మున్సిపాలిటీ వెబ్‌సైట్, కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శనకు ఉంచాలని స్పష్టం చేసింది.

**వసూళ్ల లక్ష్యాలు..**

85 శాతం ఆస్తి పన్నులను బిల్ కలెక్టర్లు వసూలు చేయాలని, మిగిలిన 10 శాతం బకాయిలను మేనేజర్లు, మున్సిపల్ ఇంజనీర్లు, ప్లానింగ్ ఆఫీసర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు వ్యక్తిగతంగా శ్రద్ధపెట్టి వసూలు చేయాలని, మిగిలిన 5 శాతం బకాయిలను మున్సిపల్ కమిషనర్ చొరవ చూపి వసూలు చేయాలని పురపాలక శాఖ లక్ష్యాలను నిర్దేశించింది. వసూళ్లపై రోజువారీగా కమిషనర్లు, జిల్లా అదనపు కలెక్టర్లు తమ స్థాయిల్లో సమీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.

**జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రంలోని మిగిలిన పురపాలికల్లో వివిధ పన్నుల వసూళ్లు.. (రూ.కోట్లలో)**




# ‘ఉపాధి’లో వేతన విభజన

▶ మొదటి పేజీ తరువాయి

జాబ్‌కార్డుదారులందరికీ పనిదినాలు కల్పించాల్సి ఉంటుంది. అయితే, ఈ పనిదినాల కల్పన ఆధారంగానే ఫీల్డ్ అసిస్టెంట్లను ఇప్పుడు ప్రభుత్వం విభజిస్తోంది. పంచాయతీలోని జాబ్‌కార్డు ఉన్న వారికి కనీసం 30 అంతకన్నా ఎక్కువ పనిదినాలు కల్పించిన వారిని కేటగిరీ–1లో పెట్టి వారికి గతంలో ఇస్తున్న విధంగానే నెలకు రూ.8,900 వేతనం, రూ.1,100 అలవెన్సులు కలిపి రూ.10 వేలు చెల్లించనుంది. వీరి కాంట్రాక్టును గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది జూన్ వరకు రెన్యువల్ కూడా చేయనుంది. ఇక, 29–20 రోజుల పనిదినాలు కల్పించగలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లను కేటగిరీ–2ఏలో ఉంచి వారి రెన్యువల్‌ను పెండింగ్‌లో పెట్టి, వారి వేతనాన్ని నెలకు రూ.9వేలకు పరిమితం చేయనున్నారు. అలాగే నెలకు 19–10 పనిదినాలు కల్పించగలిగిన వారిని కేటగిరీ–2బీలో పెట్టి వారి కాంట్రాక్టును కూడా రెన్యువల్ చేయవద్దని, వారి వేతనాన్ని రూ.7,500గా నిర్ధారించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక, సగటున కనీసం 10 పనిదినాలు కూడా కల్పించలేని వారిని వెంటనే తొలగించాలని, ఈ మేరకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ పనిదినాల కల్పన పనితీరును 2018, జూలై 1 నుంచి 2019 జూన్ 30 మధ్య పరిగణనలోకి తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్ల అసంతృప్తి..

ప్రభుత్వ నిర్ణయంపై ఫీల్డ్ అసిస్టెంట్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనుల కల్పన విషయంలో పంచాయతీల వారీగా వ్యత్యాసం ఉంటుందని అంటున్నారు. చిన్న పంచాయతీల్లో 50–100 కార్డులు మాత్రమే ఉంటాయని, ఆయా కుటుంబాలకు సగటున ఏటా 30 పనిదినాల కల్పన అంత కష్టమేమీ కాదంటున్నారు. అలాగే 1000 జాబ్‌కార్డులున్న గ్రామాలు, వాటి హ్యామ్లెట్లలోని అన్ని కుటుంబాలకు సగటున 30 పనిదినాలు కల్పించడం అంత సులభం కాదని చెబుతున్నారు. గత 14ఏళ్లుగా గ్రామాల్లో చాలా చేశామని, ఇప్పుడు కొత్తగా చేయడానికి పనులు కూడా లేవని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో 30 పనిదినాల ప్రాతిపదికన తమను విభజించడం సరైంది కాదని తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముదిగొండ శ్యామలయ్య వ్యాఖ్యానించారు. ఈ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇప్పటికే సమ్మెకు నోటీసు ఇచ్చామని, సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ల ముట్టడి ఉందని, 11న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం ఈ ఉత్తర్వులను రద్దు చేయకపోతే ఈనెల 12 నుంచి విధులు బహిష్కరించి పూర్తిస్థాయి సమ్మెకు దిగిపోతామని హెచ్చరించారు.




### ఫీల్డ్ అసిస్టెంట్లపై వస్తున్న విమర్శలివే...

గత 14 ఏళ్లుగా గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు విమర్శలకు కారణమవుతోంది. ప్రభుత్వం ఇచ్చే వేతనానికి తోడు కొన్ని నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా సంపాదిస్తున్నారని, పని దినాల కల్పనలో పేదలను తమ ఇళ్ల చుట్టూ తిప్పించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సొంత పనులు చక్కబెట్టుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, తమకు అనుకూలంగా ఉన్న వారికి, సన్నిహితులు, బంధువులకు పని కల్పించేలా వారి పేర్లను మస్టర్లలో రాస్తున్నారని, కొన్ని చోట్ల పని చేయకుండానే మస్టర్లను రాస్తున్నారని ప్రభుత్వం నిర్ధారించింది. ముఖ్యంగా గ్రామాల్లోని పేదలను, రాజకీయ నాయకులను తమ గుప్పిట్లో పెట్టుకుని ఆయా గ్రామాలను ఓ రకంగా శాసించే స్థాయికి కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు చేరిపోయారనే తీవ్ర ఆరోపణలు కూడా వారిపై ఉన్నాయి.

# వలలే ఉరితాళ్లు!



▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంతాలకు ఎగిరిపోతాయి. ఇలా తెలంగాణలోని వివిధ ప్రాంతాలు విదేశీ పక్షులకు విడిదిగా ఉంటున్నాయి. అందులో నగరంలోని గండిపేట (ఉస్మాన్ సాగర్) కూడా ఒకటి. ప్రస్తుతం గండిపేట జలాశయం విదేశీ విహంగాలతో సందడిగా ఉంది. కానీ కొన్నిరోజులుగా క్రమం తప్పకుండా ఇక్కడ ఆ పక్షులు చనిపోతున్నాయి. విషయం తెలిసి ‘యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ’ ప్రతినిధులు జలాశయం వద్ద కొద్ది రోజులుగా పరిశీలిస్తుండటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. గండిపేట జలాశయం ఆది నుంచి జాలరులకు ప్రధాన కేంద్రంగా ఉంది. ఇందులో చేప విత్తనాలు వేసి అవి పెరిగాక వాటిని పట్టి విక్రయించి ఆదాయం పొందుతున్నారు. చేపలు పట్టేందుకు వీలుగా వలలను జలాశయంలోని ముళ్ల పొదలను ఆసరాగా చేసుకుని ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటికి చిక్కే చేపలను తీసి అమ్ముకుంటారు. ఈ క్రమంలో గాలి ఉధృతి పెరిగినప్పుడు కొన్ని వలలు ఆ ముళ్లపొదలకు చిక్కుకుపోతున్నాయి. వాటిని తీయటం సాధ్యం కాక అలాగే వదిలేసి కొత్త వలలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తేలిందని యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధులు గుర్తించారు. అలా ఇరుక్కుపోయిన వలలు నీటిలో ఉండిపోతున్నాయి. వాటిని గుర్తించని పక్షులు ముళ్లపొదలపై వాలే సమయంలో వాటిల్లో చిక్కుకుపోతున్నాయి. కొన్ని పక్షులు చేపలను ముక్కుతో వేటాడే సమయంలో వాటి ముక్కు వలలకు ఇరుక్కుపోతోంది. పెనుగులాడితే వలల వైరు భాగం ముక్కుకు గట్టిగా చుట్టుకుపోతోంది. దీంతో ముక్కు తెరుచుకునే పరిస్థితి లేక ఆహారం తీసుకోలేక నీరసించి పక్షులు చనిపోతున్నాయని తేలింది. చేపలు పట్టే ప్రక్రియతో పక్షులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు, కానీ వదిలేసిన పాత వలలే ప్రమాదంగా మారాయి. ఆదివారం హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ అనే మరో సంస్థ ప్రతినిధులు కొందరు పక్షి ప్రేమికులు కలిసి దాదాపు 60 మంది ఉదయం నుంచి సాయంత్రం వరకు జలాశయంలోని తుప్పలకు ఇరుక్కుని ఉన్న వలల భాగాలను పెద్ద మొత్తంలో వెలికి తీశారు. జలాశయానికి చిలుకూరు వైపు వలస పక్షులు ఎక్కువగా ఉండటంతో అటువైపు ఈ ఆపరేషన్ నిర్వహించారు. కొన్ని టన్నుల బరువున్న వ్యర్థాలను వెలికి తీశారు. ఇంకా అంతకు కొన్ని రెట్ల మేర వ్యర్థాలు నీటిలో ఉన్నాయని, వాటన్నింటినీ తొలగిస్తేనే పక్షులకు సురక్షిత వాతావరణం ఏర్పడుతుందని వారు పేర్కొంటున్నారు.

గండిపేట చెరువులో వలతాడుతో ఇబ్బంది పడుతున్న కొంగ



చెరువులో వలలను తొలగిస్తున్న యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు



### జాలరులకు అవగాహన కల్పిస్తాం

నీటిలో వదిలేసిన పాత వలలు వలస పక్షులకు ప్రమాదంగా మారాయి. వాటిని తొలగించి భవిష్యత్తులో మళ్లీ అవి రాకుండా ఉండాలి. అందుకోసం ఈ జలాశయంలో చేపలు పట్టే జాలరులకు అవగాహన కల్పించాల్సి ఉంది. వలలు ఏర్పాటు చేయటంలో అంతర్జాతీయ పద్ధతులేంటో గుర్తిస్తున్నాం. వాటిని జాలరుల దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తులో అలా వలలు తుప్పలకు ఇరుక్కుపోకుండా చేస్తాం. దానివల్ల జాలరులు వలలు కోల్పోయి నష్టపోకుండా ఉండటమే కాకుండా పక్షులకు ప్రమాదం లేకుండా ఉంటుంది. ఇప్పటికే ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారితో కలిసి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. ముందు జలాశయంలో పెద్ద మొత్తంలో ఉన్న వలల భాగాలను అధికారులు వెలికి తీయించాల్సి ఉంది. మాతో కలిసి వచ్చిన హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ సభ్యులు, ఇతర పక్షి ప్రేమికులకు ధన్యవాదాలు. – ప్రదీప్ నాయర్, సంజీవ్ వర్మ, ‘యానిమల్ వారియర్స్’ సభ్యులు

## నేడు టెస్కాబ్ ఎన్నికల నోటిఫికేషన్

**5న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక**

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఈ నెల 5న జరుగనుంది. అదేరోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ఉంటాయి. ఎవరైనా ఆ పదవులకు పోటీలో ఉంటే అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఉపసంహరణలో ఒకరే మిగిలితే ఆయా పదవులను ఏకగ్రీవం అయినట్లుగా ప్రకటిస్తామని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ వెల్లడించింది. ఇదిలా వుంటే డీసీసీబీ చైర్మన్లంతా టెస్కాబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉంటారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత న్యాయం

**డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ఎన్నికలపై మంత్రి తలసాని**



సాక్షి, హైదరాబాద్: డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత న్యాయం లభించిందని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అన్ని పదవుల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో కొనియాడారు. గత ప్రభుత్వాలు మెజార్టీ వర్గాల ఓట్ల కోసం అనేక వాగ్దానాలు చేసి తర్వాత వారిని మోసం చేశాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాతే కేసీఆర్ నేతృత్వంలో ఆయా వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా న్యాయం జరుగుతోందని తెలిపారు. అందుకే రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా ప్రజలు టీఆర్‌ఎస్ పార్టీని గెలిపించడమే కాకుండా బ్రహ్మరథం పడుతున్నారని, రోజురోజుకూ టీఆర్‌ఎస్‌పై రాష్ట్ర ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని అన్నారు. కొత్తగా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లుగా బాధ్యతలు స్వీకరించిన వారికి తలసాని అభినందనలు తెలిపారు.

## తెలంగాణ జ్యోతిబా ఫూలే కేసీఆర్

**ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో అణచివేతకు గురైన బలహీన వర్గాల జీవితాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ వెలుగులు నింపుతున్నారని, ఆయన తెలంగాణ జ్యోతిబా ఫూలే అని ఎక్సైజ్ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. డీసీసీబీలు, డీసీఎంఎస్‌లలో బీసీల ప్రాధాన్యతను పెంచి కొత్త చరిత్రను లిఖించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పదవులకు దూరంగా ఉన్న సామాజిక వర్గాలను తలెత్తుకుని జీవించేలా కేసీఆర్ భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. అందుకే ఎన్నికలు ఏవైనా కులం, మతం, ప్రాంతం తేడాలేకుండా రాష్ట్ర ప్రజలంతా తమ ప్రేమను చాటి కేసీఆర్‌ను, టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తున్నారని, కేసీఆరే శ్రీరామరక్ష అని బ్రహ్మరథం పడుతున్నారని ఆనందం వ్యక్తంచేశారు. పాలన, పథకాల అమలు, అన్ని వర్గాల సంక్షేమంలో రోల్‌మోడల్‌గా నిలబెట్టిన తెలంగాణ రాష్ట్రాన్ని ఇప్పుడు సామాజిక న్యాయంలో కూడా రోల్‌మోడల్‌గా తయారు చేశారని ప్రశంసించిన శ్రీనివాస్‌గౌడ్.. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## డీసీసీబీ ఎన్నికల్లో చరిత్ర సృష్టించాం

**ప్రభుత్వ విప్ బాల్క సుమన్**



సాక్షి, హైదరాబాద్: సహకార ఎన్నికలు జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ చరిత్ర సృష్టించిందని, తొమ్మిది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)ల చైర్మన్ పదవులనూ పార్టీ కైవసం చేసుకుందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పేర్కొన్నారు. ఏడాదికాలంగా ఎన్నిక ఏదైనా తీర్పు టీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వస్తోందన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలు, పార్టీలకు టీఆర్‌ఎస్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సహకార ఎన్నికల ఫలితాలపై ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్దపీట వేశామన్నారు. 95% ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకోవడం కేసీఆర్, కేటీఆర్ కృషికి దక్కిన ఫలితమన్నారు. భూకబ్జాలకు పాల్పడి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి తప్పు చేశారని, ఆయన క్షమాపణలు చెప్పి బాధితులకు తిరిగి భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు.

# అమ్మ.. హ్యాపీ!

| రాష్ట్రంలో తగ్గిన శిశు మరణాలు.. | 2018-19లో 3,675 కాగా, 2019-20లో 2,408 | దాదాపు సగానికి తగ్గిన ఇన్ఫెక్షన్ మరణాలు | గంటలోపు తల్లిపాలు తాగే శిశువులు 74.3 శాతం | కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక వెల్లడి |
|---|---|---|---|---|



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శిశు మరణాలు తగ్గాయి. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) తాజా నివేదికలో వెల్లడించింది. ఆ లెక్కల ప్రకారం 2018–19 ఆర్థిక సంవత్సరంలో 3,675 మంది శిశువులు చనిపోగా, 2019–20 సంవత్సరంలో 2,408 మృతి చెందినట్లు నివేదిక తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం శిశు మరణాల తగ్గుదలపై అనేక కార్యక్రమాలు తీసుకుంటున్నందువల్లే మరణాలు తగ్గుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో 1,040 శిశు మరణాలు సంభవించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ ఏడాది జనవరి (10 నెలల్లో) వరకు 498 మంది చనిపోయినట్లు తెలిపింది. అంటే సగం పైగా మరణాలు తగ్గడం గమనార్హం. నల్లగొండ జిల్లాలోనూ గత ఆర్థిక సంవత్సరంలో 207 మంది శిశువులు మరణించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 138 మంది చనిపోయారు. ఇక వరంగల్ అర్బన్‌లోనూ గత ఆర్థిక సంవత్సరంలో 726 మంది చనిపోగా, ఈ సారి ఆ సంఖ్య 99కు తగ్గింది. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 245 మంది శిశువులు చనిపోగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 66కు పడిపోవడం గమనార్హం. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ గతంలో 248 మంది చనిపోగా, ఈసారి ఆ సంఖ్య 53కు పడిపోయింది. అయితే కొన్ని జిల్లాల్లో శిశు మరణాలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో 34 మంది శిశువులు చనిపోగా, ఈసారి ఏకంగా 139 మంది మృతి చెందారు. జగిత్యాల జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో నలుగురు చనిపోగా, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికే 32 మంది శిశువులు చనిపోయారు. అలాగే భూపాలపల్లి జిల్లాలో గతంలో ఇద్దరు చనిపోగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 27 మంది శిశువులు కన్నుమూశారు. సంగారెడ్డి జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 79 మంది చనిపోగా, ఇప్పుడు 139 మంది శిశువులు చనిపోయారు.

**దాదాపు సగం తగ్గిన ఇన్ఫెక్షన్ మరణాలు..**

శిశు మరణాలు వివిధ కారణాల వల్ల సంభవిస్తాయి. ఇన్ఫెక్షన్లు, న్యుమోనియా సహా ఇతరత్రా కారణాలుంటాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో మరణించిన శిశువుల్లో తీవ్రమైన ఇన్ఫెక్షన్ల కారణంగా చనిపోయిన వారి శాతం గణనీయంగా తగ్గింది. దాదాపు సగం మేరకు తగ్గినట్లు నివేదిక తెలిపింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో మరణించిన శిశువుల్లో ఇన్ఫెక్షన్లతో 6.9 శాతం మంది చనిపోగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 3.6 శాతానికి తగ్గినట్లు నివేదిక తెలిపింది. ఇక పుట్టిన తర్వాత శ్వాస ఆడకపోవడం, ఉక్కిరిబిక్కిరి కావడం తదితర కారణాలతో గత ఆర్థిక సంవత్సరంలో 14.4 శాతం మంది చనిపోగా, ఈసారి 6.4 శాతం తగ్గడం విశేషం. ఇక శిశు మరణాల్లో న్యుమోనియాతో చనిపోయే వారి శాతం రెండింతలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో మరణించిన శిశువుల్లో న్యుమోనియాతో 2.4 శాతం మంది మరణిస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ ఏడాది జనవరి నాటికి 5.4 శాతానికి చేరింది.

**'రూరల్'లో అత్యధికం.. 'అర్బన్'లో అత్యల్పం**

ఇటు రాష్ట్రంలో పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగే శిశువుల శాతం గతం కంటే తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో పుట్టిన శిశువుల్లో గంటలోపే తల్లిపాలు తాగినవారు 79.2 శాతం మంది ఉంటే, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి 74.3 శాతానికి తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 99.2 శాతం, సూర్యాపేట జిల్లాలో 99 శాతం, వరంగల్ రూరల్ జిల్లాలో 99.3 శాతం శిశువులు పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగటం విశేషం. అత్యంత తక్కువగా వరంగల్ అర్బన్ జిల్లాలో 33.9 శాతం శిశువులు మాత్రమే పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగుతున్నారు. తల్లిపాలు గంటలోపు తాగితేనే రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుందని, భవిష్యత్తులో పిల్లలు ఇతరత్రా అనారోగ్య సమస్యలకు గురికాకుండా ఉంటారని వైద్య నిపుణులు అంటున్నారు. అయితే అనేక సందర్భాల్లో సిజేరియన్ ఆపరేషన్ల ద్వారా ప్రసవాలు జరుగుతుండటం వంటి కారణాల వల్ల తల్లులు గంటలోగా శిశువులకు పాలిచ్చే పరిస్థితి ఉండటం లేదంటున్నారు. ఇక రెండున్నర కేజీల బరువు కంటే తక్కువ బరువుతో పుడుతున్న వారి సంఖ్య గత ఆర్థిక సంవత్సరం కంటే ఈసారి పెరగడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో 32,586 మంది రెండున్నర కేజీల కంటే తక్కువ బరువుతో పుట్టగా, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి అంటే 10 నెలల కాలంలోనే 34,696 మంది అలా తక్కువ బరువుతో పుట్టడం గమనార్హం.

## ప్రపంచం భారత్ వైపు చూస్తోంది

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి**



రాయదుర్గం: ప్రపంచ దేశాలన్నీ ప్రస్తుతం భారత దేశం వైపు చూస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో 'ఐడియాస్ ఫర్ ఇండియా–2020'పాలసీ కాంక్లేవ్ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ఉదయం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ దూసుకుపోతోందని, అందుకు ప్రధాని నరేంద్రమోదీ విధానాలే కారణమన్నారు. ప్రపంచంలోనే బలమైన ఆర్థికశక్తిగా భారత్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వచ్చే రోజుల్లో భారత్ 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమన్నారు. జీఎస్టీ, నోట్ల రద్దు, ఆర్టికల్ 370 రద్దు, నీతిఆయోగ్ ఏర్పాటు వంటి సాహసోపేత నిర్ణయాల అమలు ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశంలో పేదరికాన్ని రూపుమాపేందుకు, అన్ని రంగాల్లో ముందంజ వేసేందుకు యువకులు, విద్యార్థులు, మేధావులు సూచనలు చేయాలన్నారు. దేశంలోకి పాక్, బంగ్లాదేశ్ నుంచి వలసలు పెరిగిపోయాయని, అందుకోసమే సీఏఏ చట్టాన్ని రూపొందించారని, కొందరు దీన్ని వక్రీకరిస్తూ అపోహలు సృష్టిస్తున్నారన్నారు.

**సోషల్ మీడియా బాధ్యతగా ఉండాలి**

సోషల్ మీడియా బాధ్యతతో వ్యవహరించాలని కిషన్‌రెడ్డి సూచించారు. తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, కొన్ని రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ధోరణే ఢిల్లీ అల్లర్లకు కారణమన్నారు. అల్లర్లకు కారణమైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పోలీసు అధికారిని కిరాతకంగా చంపడం కలచి వేస్తుందన్నారు. అనంతరం సస్టెయినబుల్ పాలసీ మేకింగ్ ఫర్ ది కంట్రీస్ గ్రోత్, రెస్పాన్సిబుల్ మీ డియా, ఫిల్మ్ మేకింగ్ అండ్ సెన్సార్‌షిప్, యూత్ ఇన్ పాలిటిక్స్, మోటివేటింగ్ దెమ్ టు కాంటెస్ట్ ఎలక్షన్స్, సివిల్ సర్వీస్ పాలసీ రిఫార్మ్స్ ఫర్ ది 21 ఫస్ట్ సెంచరీ అనే అంశాలపై నిర్వహించిన ప్యానల్ డిస్కషన్స్‌లో ఎంపీలు, పోలీసు ఉన్నతాధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలను వెలిబుచ్చారు. అంతకుముందు ఐఎస్‌బీ ప్రాంగణంలో కిషన్‌రెడ్డి మొక్కను నాటారు.

## ముస్లింలకు ఎక్కడా లేని స్వేచ్ఛ భారత్‌లోనే..: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: దేశంలోని కొన్ని రాజకీయ పార్టీలు పౌరసత్వ సవరణ చట్టాని (సీఏఏ)కి వక్రభాష్యం చెబుతూ అస్థిరత్వాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ కార్యాలయంలో సీఏఏ అనుకూల సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనూ కొన్ని రాజకీయ పార్టీల నేతలు ముస్లింల పౌరసత్వం తొలగిస్తారని ముస్లింలలో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీలుగా దుర్భర జీవితం గడుపుతున్న వారికి పౌరసత్వం ఇచ్చేందుకు చర్యలు చేపడితే దానిని తప్పుగా అన్వయిస్తూ దేశంలోని ముస్లింలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. 52 ముస్లిం దేశాల్లో లేని స్వేచ్ఛ.. భారత్‌లో ముస్లింలకు ఉందన్నారు. సీఏఏకు అనుకూలంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 15న బహిరంగ సభ నిర్వహిస్తున్నామని లక్ష్మణ్ చెప్పారు.

## ఢిల్లీ హింసపై నోరు మెదపరేం?

**ప్రధాని, ఎన్డీయే పక్షాలపై ఎంపీ అసదుద్దీన్ విమర్శలు**



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ 'మారణహోమం'పై ప్రధాని నరేంద్ర మోదీతోపాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఎందుకు నోరు మెదపడం లేదని ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. హింసాకాండలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారంతా భారతీయులేనని, ఇప్పటికైనా బాధిత కుటుంబాలను పరామర్శించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు చేసిన ప్రకటన వల్లే ఇదంతా జరిగిందని ఆరోపించారు. ఆదివారం దారుస్సలాంలో జరిగిన పార్టీ 62వ ఆవిర్భావ దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ హింసాకాండపై ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు మౌనం వహిస్తున్నాయని.. నితీశ్‌కుమార్, రామ్‌విలాస్ పాశ్వాన్, అకాలీదళ్ హింసపై ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారని ప్రశ్నించారు. ఢిల్లీ అల్లర్ల బాధితులకు మజ్లిస్ పార్టీకి చెందిన పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపల్ ప్రజాప్రతినిధుల ఒక నెల జీతం విరాళంగా ఇస్తున్నట్లు అసదుద్దీన్ ప్రకటించారు. అల్లర్లలో చనిపోయిన, గాయపడిన వారంతా భారతీయులేనని, వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలో శాంతి భద్రతల పరిస్థితికి కేంద్రమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**ఎన్‌పీఆర్‌పై స్టే విధించాలి...**

అసెంబ్లీ సమావేశాల్లో ఎన్‌పీఆర్‌పై స్టే విధించేలా ఒత్తిడి తెస్తామని అసదుద్దీన్ వెల్లడించారు. సీఏఏకు వ్యతిరేక తీర్మానం మాదిరిగా ఎన్‌పీఆర్‌పై స్టే విధించాలని ఆయన సీఎం కేసీఆర్‌ను విజ్ఞప్తి చేశారు. అప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్‌ఆర్‌సీ అమలుచేస్తే హైదరాబాద్‌లో సుమారు 11 లక్షల మంది పేర్లు ఉండవని ఒక మీడియా ప్రతినిధి తన సర్వే ద్వారా వెల్లడించారని గుర్తు చేస్తూ అందులో మెజార్టీ శాతం ముస్లిం సామాజిక వర్గం ఉంటుందన్నారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌కు వ్యతిరేకంగా గట్టిగా గళం విప్పాలని సూచించారు. సభలో పార్టీ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## టీఆర్‌ఎస్ ఒక్క ఇల్లూ ఇవ్వలేదు

**మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి వచ్చిన ఇండ్లకు రంగులు వేసి సికింద్రాబాద్‌లో కొందరికి ఇళ్లు ఇచ్చారే తప్ప.. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన ఆరేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లలోకి కూడా పేదలు వెళ్లే పరిస్థితి లేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను పేదల దేవుడు అని టీఆర్‌ఎస్ నేతలు అంటున్నారని, మరి ఆయన అధికారంలోకి వచ్చినా రాష్ట్రంలోని పేదల కష్టాలు ఎందుకు తీర్చడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆదివారం తన పార్లమెంటరీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో కేవలం మాటలే తప్ప అమలుకు నోచుకోవడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో 26 లక్షల మంది, హైదరాబాద్‌లో 10 లక్షలు, మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో 6లక్షల మంది ఇండ్లు లేనివారు ఉన్నారని, వారికి ఇండ్ల నిర్మాణం కోసం మార్చిలోపు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎక్కడ నివసించే వారికి అక్కడే డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని, సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించి ఏప్రిల్‌లోపు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తి చేసి పేదలకు ఇండ్లు కేటాయించాలని కోరారు. లేదంటే ప్రజాపోరాటానికి దిగుతామని రేవంత్ హెచ్చరించారు. తాను ప్రభుత్వాన్ని ఎప్పుడు విమర్శించినా వ్యక్తిగత ద్వేషంతో మాట్లాడుతున్నానని టీఆర్‌ఎస్ నేతలు విమర్శిస్తారని, తాను కేవలం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని మాత్రమే ప్రశ్నిస్తున్నానని చెప్పారు.

## ఇంటర్ విద్యకు చైనా వైరస్

▶ మొదటి పేజీ తరువాయి

కాలేజీలు 26 ఉన్నాయి. ఇక శ్రీగాయత్రి విద్యాసంస్థలకు చెందిన కాలేజీలు 8 ఉండగా ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థలకు చెందిన కాలేజీలు 5 ఉన్నాయి. ఇవే కాకుండా తపస్యా జూనియర్ కాలేజీ, క్వీన్ మేరీ, లియో, క్షత్రియ, క్వీన్ మేరీ, గౌతమి తదితర కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో ఎప్పుడైనా ప్రమాదం జరిగితే ఆ విద్యార్థుల కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లనుంది.

**సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే...**

తమిళనాడు కుంభకోణంలోని ఓ పాఠశాలలో 2004లో జరిగిన అగ్నిప్రమాదంలో 94 మంది విద్యార్థులు సజీవదహనమయ్యారు. ఆ తరువాత సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఫైర్ సేఫ్టీ, అగ్నిమాపక శాఖ అనుమతి లేకుండా బహుళ అంతస్తుల భవనాల్లో ఎలాంటి విద్యాసంస్థలను కొనసాగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అయినా రాష్ట్రంలో ఆ నిబంధనలను అమలు చేయడంలో ఇంటర్ బోర్డు, పాఠశాల విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. 15 మీటర్లకు మించిన భవనాల చుట్టూ అగ్నిమాపక వాహనం తిరిగేలా సెట్ బ్యాక్స్ ఉండాలన్న నిబంధనను కార్పొరేట్ విద్యాసంస్థలు అమలు చేయడం లేదు. కనీసం భవనాల్లో సరిపడా అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయడంలోనూ అలసత్వం ప్రదర్శిస్తూ విద్యార్థుల జీవితాలను ప్రమాదం అంచుకు నెట్టేస్తున్నాయి.

**హాస్టళ్లలో పరిస్థితి మరీ దుర్భరం..**

అగ్నిమాపక శాఖ అనుమతి లేకుండా కొనసాగుతున్న కాలేజీలను కొనసాగిస్తున్న విద్యా సంస్థలే హాస్టళ్లను సైతం నిర్వహిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే రాష్ట్రంలో దాదాపు 500 హాస్టళ్లను జూనియర్ కాలేజీలకు అనుబంధంగా కొనసాగిస్తున్నాయి. మూడేళ్ల కిందట హాస్టళ్ల నియంత్రణను ఇంటర్ బోర్డు పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించినా అది అచరణకు నోచుకోలేదు. పైగా అందులో అత్యధికంగా ఉన్నవన్నీ బహుళ అంతస్తుల భవనాల్లో కొనసాగుతున్నవే. వాటికి అగ్నిమాపక శాఖ అనుమతి లేదు. ఇక ఆయా హాస్టళ్లలో ఉండే విద్యార్థుల పరిస్థితి మరీ దుర్భరం. ఒక్కో గదిలో నలుగురు విద్యార్థుల చొప్పున ఉండాల్సి ఉన్నప్పటికీ 8 మందిని కుక్కుతున్నట్లు ఇంటర్ బోర్డు తనిఖీల్లో తేల్చింది. అంతేకాదు సరిపడా టాయిలెట్లు లేని దుస్థితి నెలకొందని గుర్తించింది. ఏసీ గదుల పేరుతో ఫీజులు వసూలు చేస్తూ కనీసం ఫ్యాన్లకు దిక్కులేని పరిస్థితిని యాజమాన్యాలు కల్పిస్తున్నాయని కనుగొంది. ఒకట్రెండు లిఫ్టులు మాత్రమే పెట్టి, అవీ విద్యార్థులను వాడనీయకుండా చేస్తున్నాయి. విద్యార్థులు రోజూ నాలుగైదు అంతస్తులు ఎక్కి దిగేందుకు ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యాలు లేదా అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

# పోలీసులపై ఫెల్ట్ భారం

- గ్రామాల్లో ప్రజలకు చేరువయ్యేందుకు చేపట్టిన కార్యక్రమంతో ఖాకీలకు చిక్కులు
- బస్సులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై పోలీసులకు నిత్యం వందల్లో ఫిర్యాదులు
- ఇవేం కంప్లయింట్లంటూ తలలు పట్టుకుంటున్న కానిస్టేబుళ్లు, ఎస్సైలు

"హలో పోలీస్ స్టేషనా..? కరెంటు పోయి చాలా సేపవుతోంది సార్. కొంచెం లైన్‌మెన్‌కు చెప్పి వేయించండి."

"సార్.. ఊళ్లోని వైన్‌షాపులో క్వార్టర్‌పై రూ.5అధికంగా విక్రయిస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం సార్.. వెంటనే వారిపై చర్యలు తీసుకోండి"



**ఇవీ రాష్ట్రంలోని పోలీసులు గత కొన్ని రోజులుగా నిత్యం వందల్లో అందుకుంటున్న ఫిర్యాదులు. రోజుకు దాదాపు 16 గంటలు పనిచేస్తున్న పోలీసులు... డ్రైనేజీ, తాగునీరు, బస్సు సౌకర్యాల వంటి వాటి కోసం ప్రజల నుంచి వస్తున్న ఫోన్లు అందుకోలేక, వారికి జవాబు చెప్పలేక నానా అగచాట్లు పడుతున్నారు. ఇంతకీ ఈ తరహా ఫిర్యాదులు పోలీసులకు ఎందుకు వస్తున్నాయి అనే కదా మీ సందేహం. అందుకు కారణం 'ఫెల్ట్ నీడ్స్'పేరుతో ఇటీవల పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమమే. కేవలం పహారా విధుల నిర్వహణే కాకుండా ప్రజలకు దగ్గరయ్యేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ఇప్పుడు పోలీసులను ముప్పతిప్పలు పెట్టడమే కాదు... పోలీసు శాఖలో అసంతృప్తికి కారణమవుతోంది. అసలే తగిన సిబ్బంది లేక నానా ఇబ్బందులు పడుతున్న పోలీసు శాఖను ప్రజల నుంచి వస్తున్న ఇలాంటి ఫిర్యాదులు మరింత చికాకుపెడుతున్నాయి.** -సాక్షి, హైదరాబాద్

**ఫెల్ట్ నీడ్స్‌పై అసంతృప్తి..!**

ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు పోలీసుశాఖ జిల్లాల్లో 'ఫెల్ట్ నీడ్స్'పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తమ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో భద్రతను పటిష్ట పరిచేలా పోలీసులు సీసీ కెమెరాల వ్యవస్థను పరిశీలించి పెట్రోలింగ్, గస్తీ అవసరమా? పోకిరీలు, మందుబాబుల బెడద ఉందా? తదితర అంశాలపై గ్రామ పెద్దలతో చర్చించాలి. ఇంతవరకూ బాగానే ఉంది. కానీ ఇందులో అదనంగా చేర్చిన కొన్ని అంశాలపై పోలీసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు బస్సులు వస్తున్నాయా? పారిశుద్ధ్యం పరిస్థితి ఎలా ఉంది? డ్రైనేజీ ఇబ్బందులు ఉన్నాయా? కరెంటు సమస్య ఎలా ఉంది? తాగునీరు సరిగా సరఫరా అవుతోందా? వంటి విషయాలను కానిస్టేబుళ్లు, ఎస్సైలు తెలుసుకొని వాటిని సంబంధిత గ్రామాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కార్యక్రమ ఎజెండాలో చేర్చారు. ఇక్కడే పోలీసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శాంతిభద్రతల సమస్యలైతే ఫర్వాలేదుగానీ మరీ డ్రైనేజీ, బస్సు సౌకర్యం, పారిశుద్ధ్యం, రోడ్డు సమస్యలపై కొందరు ఫిర్యాదులు చేస్తుండటంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. చేసేదిలేక అన్యమనస్కంగానే సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించాలని సూచిస్తున్నారు.

**శాఖలో సిబ్బంది కొరత ఇలా..**

రాష్ట్రంలో క్షేత్రస్థాయి పోలీసు సిబ్బందిపై విపరీతమైన పని ఒత్తిడి పడుతోంది. 2019 జనవరి 1 వరకు అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం కేంద్ర హోంశాఖ పరిధిలో పనిచేసే డేటా ఆన్ పోలీస్ ఆర్గనైజేషన్ (డీవోపీఓ) విడుదల చేసిన గణాంకాల్లో ప్రతి లక్ష మందికి 428 మంది పోలీసులు ఉండాలి. కానీ ప్రస్తుతం 233 మందే ఉన్నారు. రాష్ట్ర జనాభా ఆధారంగా తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంటుకు సివిల్, ఏఆర్, టీఎస్‌ఎస్‌పీ విభాగాల్లో 81,647 పోస్టులు మంజూరయ్యాయి. కానీ వాస్తవానికి ఇక్కడ 53,115 మంది పోలీసులు మాత్రమే ఉన్నారు. అలాగే కేవలం 815 పోలీసు స్టేషన్లే అందుబాటులో ఉన్నాయి. అంటే మంజూరైన పోస్టుల కంటే 35 శాతం పోస్టులు తక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి 100 చదరపు కిలోమీటర్లకు 72.93 మంది పోలీసులు ఉండాల్సి ఉండగా కేవలం 47.44 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. ఉన్నతాధికారుల పోస్టులైన డీజీపీ, ఏడీజీ పోస్టుల్లో మంజూరైన పోస్టుల కంటే అధికారులు అధికంగా ఉండగా డీఐజీ, ఎస్పీ, అదనపు ఎస్పీ, నుంచి దిగువకు వెళ్లే కొద్దీ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఎస్సై, కానిస్టేబుళ్లలో ఈ కొరత అధికంగా ఉండటం గమనార్హం. ఇటీవల చేపట్టిన రిక్రూట్‌మెంట్‌లో దాదాపు 1,200 మంది ఎస్సై, 14 వేల మంది కానిస్టేబుళ్ల విధుల్లో చేరితేగానీ మిగతా పోలీసులపై పనిభారం తగ్గే పరిస్థితి కనిపించడం లేదు.

**ఎంత ఒత్తిడి ఉన్నా..**

తెలంగాణ ఆవిర్భావం తరువాత పోలీసు శాఖ నేర నియంత్రణ, నేర దర్యాప్తులో దేశంలోనే ఆదర్శంగా ఎదిగింది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పలు కార్యక్రమాలతో ప్రజలకు దగ్గరైంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, ఈచ్ వన్ టీచ్ వన్ తదితర కార్యక్రమాలను సైతం శాఖాపరంగా స్వచ్ఛందంగా అమలు చేస్తోంది. సిబ్బంది తక్కువగా ఉన్నా, ఎంత పని ఒత్తిడి ఉన్నా.. పోలీసుశాఖ ఈ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తోంది. కానీ ఫెల్ట్ నీడ్స్ విషయంలో మాత్రం ఇబ్బందులు పడుతోంది.

**రాష్ట్రంలో పోలీసు శాఖ పోస్టుల వివరాలివి**

| పోస్టు | మంజూరైనవి | కొనసాగుతున్నది | అదనం/కొరత |
|---|---|---|---|
| డీజీపీ | 2 | ఆరుగురు | 4 అదనం |
| ఏడీజీ | 6 | 12 మంది | 6 అదనం |
| ఐజీ | 16 | 27 మంది | 11 అదనం |
| డీఐజీ | 14 | 9 మంది | 5 కొరత |
| ఎస్పీ | 83 | 66 | 17 కొరత |
| అదనపు ఎస్పీ | 92 | 86 | 6 కొరత |
| ఏఎస్పీ | 312 | 305 | 7 కొరత |
| ఇన్‌స్పెక్టర్ | 2,419 | 2,411 | 8 కొరత |
| ఎస్సై | 3084 | 2,314 | 770 కొరత |
| ఏఎస్సై | 2,663 | 2,437 | 196 కొరత |
| హెడ్‌పీసీ | 6,525 | 4,695 | 1,830 కొరత |
| కానిస్టేబుల్ | 31,219 | 21,416 | 9,803 కొరత |

# యాదాద్రి దేవస్థానం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన గీతారెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న గీతారెడ్డి

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓగా ఎన్.గీతారెడ్డి మరోసారి బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీన డిప్యూటీ కలెక్టర్‌గా ఆమె పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే యాదాద్రి ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో గీతారెడ్డి ఉండటంతో ఆమె పదవీ కాలాన్ని పొడిగిస్తూ శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గీతారెడ్డి యాదాద్రి దేవస్థానం కార్య నిర్వహణ అధికారిగా మరో ఏడాది కాలం పాటు కొనసాగనున్నారు. ఆదివారం ఆమె మరోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గీతారెడ్డికి ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు.



# బాబ్లీ నుంచి నీటి విడుదల

**బాల్కొండ/బాసర (ముథోల్):** గోదావరి నదిపై మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేశారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాలుగు గేట్లు ఎత్తారు. ఏటా మార్చి 1న బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి 0.6 టీఎంసీల నీటిని విడుదల చేయాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులు 14 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున ఎస్సారెస్పీ ఈఈ రామారావు, మహారాష్ట్ర తరఫున నాందేడ్ ఈఈ ఎన్‌పీ గవానే, సీడబ్ల్యూసీ ఈఈ గంగాధర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున కూడా అధికారులు పాల్గొనాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల రాలేదని కమిటీ సభ్యులు తెలిపారు.

# బీజేపీ ఎత్తులను తిప్పికొట్టాలి : తమ్మినేని

**నర్సంపేట:** దేశంలో హిందూ రాజ్యస్థాపన, మతవాద రాజ్యం కోసం బీజేపీ వేస్తున్న ఎత్తులను తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం రాత్రి వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రజా చైతన్య గర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం ప్రజా వ్యతిరేకమైందని, అలాగే ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లు దేశ ప్రజల పౌరసత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంసీపీఐ (యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి మాట్లాడుతూ నేపాల్ తరహాలో కమ్యూనిస్టులు, సామాజిక బహుజనులు ఐక్యంగా ఉంటే దేశంలో మతోన్మాదాన్ని పారదోలవచ్చన్నారు.

# పొంగులేటి హర్షారెడ్డి, సోమరెడ్డిని ఆశీర్వదించిన మంత్రులు



మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుమారుడు హర్షారెడ్డి వివాహ రిసెప్షన్ ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై నూతన వధూవరులు హర్షారెడ్డి, సోమరెడ్డిలను ఆశీర్వదించారు.

–సాక్షి ప్రతినిధి, ఖమ్మం

# సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా..

## టీఎన్‌జీఓస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

**మహబూబాబాద్:** జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్‌జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు బాలాజీ గార్డెన్స్‌లో ఆదివారం జిల్లా పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన టీఎన్‌జీఓస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం 8,000 పైగా ఏఈఓ పోస్టులను భర్తీ చేసిందని.. ఇది సంఘం కృషి వల్లనేనని పేర్కొన్నారు.

# వెండి బైక్ అదుర్స్



**ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన స్వర్ణకారుడు చిటన్నోజు జగదీశ్ తన ప్రతిభతో 3 అంగుళాల పొడవున్న వెండి బైక్‌ను తయారు చేశాడు. ఓ భక్తుడు బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామికి వెండి బైక్ సమర్పిస్తానని మొక్కుకోవడంతో తయారు చేసినట్లు జగదీశ్ తెలిపారు.

# ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి..

**మొగుళ్లపల్లి:** మద్యం మత్తులో ఓ కామాంధుడు అభం శుభం తెలియని ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పర్లపల్లికి చెందిన జోరుక రమేశ్ (38) మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో ఇతడి భార్య ఎనిమిదేళ్ల క్రితమే వదిలి వెళ్లింది. ఆదివారం గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారి కిరాణం షాపు వద్ద ఆడుకుంటుండగా.. ఫోన్‌లో పాటలు వినిపిస్తానంటూ నమ్మించిన రమేశ్, పాపను తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో ఇంటి పక్కన ఉన్న పాప చిన్న నానమ్మ, రమేశ్ ఇంటికి చేరుకునే సరికి బాలిక తీవ్ర రక్తస్రావంతో ఏడుస్తూ బయటకు వచ్చింది. విషయం గ్రహించిన చుట్టుపక్కల వారు రమేశ్‌ను నిలదీయడంతో తనకేం తెలియదంటూ బుకాయించి పారిపోయాడు. బాలిక నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి డీఎస్పీ సంజీవరావు, చిట్యాల సీఐ సాయిరమణ పరిశీలించి వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా రమేశ్‌ను కొందరు గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ కార్యాలయం: PIU నిజామాబాద్
T.N. No.DB/T1/Tender/16/2019-20 ఇ-టెండరు ప్రకటన తేది: 20.02.2020
పనుల సంఖ్య: 13, పనుల పేర్లు: కొత్త దహనవాటికల నిర్మాణం, మోడ్రన్ బస్ షెల్టర్ల నిర్మాణం, ఇ-పంచాయతీ భవనం స్థాపన, కొత్త సబ్‌సెంటర్ మరియు టాయిలెట్ల నిర్మాణం మరియు ఇతర సివిల్ పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. ECV: రూ.97.5 లక్షలు. అప్లికేషన్ తేది: 28.02.2020. టెండరు జారీ తేది: 29.02.2020. టెండర్ల స్వీకరణ తేది: 02.03.2020 మ.3.00 గం. వరకు. టెండర్లు తెరుచు తేది: 02.03.2020 మ.3.30 గం. తదుపరి వివరాలకు దిగువ సంతకందారును సంప్రదించగలరు.
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, PIU నిజామాబాద్
DIPR RO.No.2558-DP/CL/Advt/1/2019-20, Dt:29.02.2020






## వటపత్రశాయి అలంకారంలో నృసింహుడు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆదివారం ఉదయం స్వామి వారు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. రాత్రి పొన్న వాహన సేవపై బాలాలయంలో ఊరేగించారు. ఆలయంలో ఉదయం 4.30 నుంచి 5.30 గంటల వరకు మూలమంత్ర హవనం, పంచసూక్త పఠనం అనంతరం నిత్యారాధనలు జరిపించారు. ఉదయం, సాయంత్రం జరిగిన అలంకార సేవల్లో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి ఆలయంలో ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి అలంకార సేవలను వీక్షించి తరించారు. 20 వేలకు పైగా భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

– యాదగిరిగుట్ట

# మున్సిపాలిటీలకు నిధుల కొరత లేదు

## ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్

- నిర్లక్ష్యంగా ఉండే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పదవి కోల్పోతారు
- బయ్యారంలో ఉక్కు కర్మాగారం సాధిస్తాం
- సంక్షేమ ఫలాలు పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఖమ్మం, ఇల్లెందు పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి


ఇల్లెందులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, అజయ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**సాక్షిప్రతినిధి, ఖమ్మం/సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలకు నిధుల కొరత ఉండబోదని, ప్రభుత్వం నుంచి ప్రతి నెలా దామాషా ప్రకారం నిధులు విడుదల చేస్తామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. ఆదివారం ఖమ్మం, భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణాల్లో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, పురపాలక చట్టం ప్రజలకు ఉపయోగపడడంతో పాటు తప్పు జరిగితే అదేరీతిలో శిక్షించే విధంగా ఉందని, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రతినిధులు నిరంతరం శ్రమించాలని కోరారు. హరితహారం, పారిశుధ్యంపై కౌన్సిలర్లు, కార్పొరేటర్లు నిర్లక్ష్యం వహిస్తే పదవులు కోల్పోవడం ఖాయమని, ఇది తాను బెదిరించడానికి చెప్పడం లేదని, చట్టం గురించి వివరిస్తున్నానని మంత్రి స్పష్టం చేశారు. ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దాలని, బహిరంగ మలమూత్ర విసర్జనను పూర్తిగా నియంత్రించేందుకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజల అవసరాల కోసం మరుగుదొడ్లను నిర్మించాలని అన్నారు. జిల్లాలో టీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఇందుకు ఇటీవల జరిగిన అన్ని ఎన్నికలే నిదర్శనమన్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాజకీయంగా జిల్లాలో 'సైకిల్'ని పూర్తిగా తొక్కేసి ప్రజల కోసం నగరంలో సైకిల్ సవారి చేస్తున్నారని ప్రశంసించారు.

**బయ్యారం ఉక్కు కోసం కేంద్రంపై ఒత్తిడి**

రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారంలో ఉక్కు కర్మాగారం నిర్మించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని, ఎలాగైనా దాన్ని సాధిస్తామని కేటీఆర్ చెప్పారు. గత ఏడాది కాలంలో అన్ని రకాల ఎన్నికలు పూర్తయ్యాయని, వచ్చే నాలుగేళ్లు అభివృద్ధిపైనే దృష్టి పెడతామని చెప్పారు. సంక్షేమ ఫలాలు పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి పేదవాడి మనసు గెలుచుకున్నారని చెప్పారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా అభివృద్ధికి బాటలు వేస్తూ అన్ని స్థాయిల అధికారులు, ప్రజాప్రతినిధులను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారని తెలిపారు. ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో, వీధిని, వాడను, గ్రామాన్ని, పట్టణాన్ని అలాగే ఉంచాలని కోరారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినవారికి భారీగా జరిమానాలు విధించాలన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినంత మాత్రాన లీడర్లు కారని, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నవారే అసలైన నాయకులని అన్నారు. తన పర్యటన సందర్భంగా ఇల్లెందులో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినందున మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు మంత్రి కేటీఆర్ రూ.లక్ష జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్‌కు జరిమానా మొత్తం చెల్లించకపోతే వసూలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్‌దేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ, సండ్ర వెంకటవీరయ్య, రాములునాయక్, భద్రాద్రి కలెక్టర్ ఎం.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మా గోడు వినండి!**

'సింగరేణి సంస్థ వల్ల భూమి కోల్పోయాం.. ఉపాధి లేక, నష్టపరిహారం అందక కుటుంబం రోడ్డున పడింది. మాకు చనిపోయేందుకు అనుమతివ్వండి..'అంటూ కొందరు బాధితులు మంత్రి కేటీఆర్ సభలో గోడు వెళ్లబోసుకున్నారు. విషయం తెలుసుకున్న కొత్తగూడెం డీఎస్పీ ఎస్.ఎం.అలీ వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఇల్లెందులో సింగరేణి ఓపెన్‌కాస్టు గని విస్తరణలో సుందర్‌లాల్ లోద్ కుటుంబం భూమి కోల్పోయింది. దీంతో ఆదివారం ఇల్లెందులో జరిగిన పట్టణ ప్రగతి బహిరంగ సభకు హాజరైన మంత్రి కేటీఆర్ ఎదుట నిరసన తెలిపేందుకు పలువురు రైతులు వచ్చారు. అనంతరం మంత్రి కేటీఆర్‌ను కలిసిన బాధితులు సమస్యను విన్నవించగా, వారి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వి.రెడ్డిని మంత్రి ఆదేశించారు.

# ఈ చట్టం ప్రజల చేతుల్లో బ్రహ్మాస్త్రం

- కొత్త మున్సిపాలిటీ చట్టంపై అవగాహన పెంచుకోవాలి
- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**సాక్షి, మెదక్:** కొత్త మున్సిపల్ చట్టం ప్రజల చేతుల్లో బ్రహ్మాస్త్రమని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దీనిపై అందరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఆయన పర్యటించారు. అనంతరం స్థానిక పిల్లల పార్కులో ఏర్పాటు చేసిన సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ప్రజలకు పారదర్శక పాలన అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ కొత్త మున్సిపల్ చట్టంతోపాటు పంచాయతీ రాజ్ చట్టాన్ని తెచ్చారన్నారు. ప్రస్తుతం కొత్త చట్టం అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. పట్టణాల్లో 75 గజాల లోపు స్థలంలో ఇల్లు నిర్మించేందుకు ఒక రూపాయి చెల్లించి అనుమతి తీసుకోవాలన్నారు. ఇంటికి నల్లా కనెక్షన్ కావాలన్నా ఒక్క రూపాయి చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. 75 గజాల నుంచి 250 గజాల స్థలంలో ఇల్లు నిర్మించే వారు సొంత డిక్లరేషన్ ఇస్తే అనుమతి ఇస్తారన్నారు. ఎవరికీ లంచం ఇవ్వొద్దని ప్రజలకు సూచించారు. కొత్త చట్టంతో ప్రజాప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. మున్సిపాలిటీల్లోని వార్డుల్లో హరితహారం కింద నాటిన మొక్కల్లో 85 శాతం బతికే విధంగా కౌన్సిలర్లు కృషి చేయాలని, అలా అయితేనే వారి పదవులు ఉంటాయని, లేకపోతే ఊడుతాయని హెచ్చరించారు. దేశంలో మన రాష్ట్రం అక్షరాస్యతలో కింది నుంచి మూడో స్థానంలో ఉందని, దానిని పైనుంచి మూడో స్థానానికి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వంద శాతం అక్షరాస్యత సాధిస్తే అందరి ఎదుట గర్వంగా.. గౌరవంగా ఉండొచ్చని మంత్రి అన్నారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, కలెక్టర్ ధర్మారెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, మాజీ మంత్రి సునీతా రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 90 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం.. హత్య

- గుడిసెలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై కామాంధుడి ఘాతుకం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

**హాలియా:** మానవత్వం మంట కలిసింది. సభ్యసమాజం తలదించుకునే విధంగా ఓ కామాంధుడు 90 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం చేసి ఆపై హత్య చేశాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా అనుముల మండలం మారేపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మారేపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు (90)కి నలుగురు కుమారులు. వారికి వివాహాలై వేరుగా ఉంటున్నారు. కాగా భర్త చనిపోవడంతో వృద్ధురాలు గ్రామ శివారులోని ఓ గుడిసెలో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు వృద్ధురాలి గుడిసె వద్దకు వెళ్లి చూడగా ఆమె విగతజీవిగా కనిపించింది. దీంతో ఆమె పెద్ద కుమారుడికి సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని తన ఇంటికి తీసుకెళ్లేందుకు పెద్ద కుమారుడు ప్రయత్నించగా నేలపై రక్తపు మరకలు కనిపించాయి. మృతదేహంపై గాయాలు ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వరరావు, హాలియా సీఐ చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శనివారం రాత్రి గ్రామానికి చెందిన సత్రశాల శంకర్ మద్యం సేవించి వృద్ధురాలు నివాసం ఉంటున్న గుడిసె చుట్టూ పలుమార్లు తిరిగాడని, అతడే తన తల్లిపై లైంగికదాడికి పాల్పడి హత్య చేసినట్లు పెద్ద కుమారుడు లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థుల మధ్య ఘర్షణ

రాళ్ల దాడిలో నలుగురికి గాయాలు • నర్సంపేట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఘటన

**నర్సంపేట రూరల్:** రెండు తరగతుల విద్యార్థుల మధ్య జరిగిన గొడవ రాళ్ల దాడికి దారితీసిన సంఘటన వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహించే ఈ విద్యాసంస్థలో శనివారం రాత్రి 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులు భోజనశాలకు వెళ్లారు. ఈ క్రమంలో విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగిపోవడంతో రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగారు. అక్కడే ఉన్న ఉపాధ్యాయులు వారికి నచ్చజెప్పి పంపించారు. అయితే ఒక వర్గం విద్యార్థులు భోజనశాల నుంచి బయటకు వస్తూ మరోవర్గం వారిని దుర్భాషలాడడంతో రాత్రి మళ్లీ గొడవకు దిగారు. దీంతో ఉపాధ్యాయులు ఇంటర్మీడియట్ విద్యార్థులందరినీ క్యాంపస్‌లోకి పంపించి తాళాలు వేశారు. కాగా, బయటనే ఉన్న 9, 10 తరగతి విద్యార్థులు ఇంటర్ విద్యార్థుల గదులపై రాళ్ల వర్షం కురిపించారు. దీంతో రాళ్లు తగిలి నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ఉపాధ్యాయులు, బాధిత విద్యార్థులు 100 నంబర్‌కు డయల్ చేయడంతో పోలీసులు చేరుకుని రాళ్లు రువ్విన విద్యార్థులను చెదరగొట్టారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, గాయపడిన విద్యార్థులను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, ఇక్కడ ఉదయమే రాళ్ల దాడి జరిగినట్లు ప్రచారం జరిగింది. అయితే ఆదివారం సోషల్ వెల్ఫేర్ కళాశాలలో కామన్ ఇంటర్ ఎంట్రెన్స్ నిర్వహించడంతో సమాచారం బయటకు రాకుండాపోయింది. పిల్లలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులను సైతం పరీక్ష పేరుతో లోనికి రాకుండా చేయడంతో పాఠశాల, కళాశాలలో జరిగిన సంఘట బయటకు రాకుండా పోయింది. నర్సంపేట ఎస్సై నవీన్‌కుమార్ ఈ ఘటనపై మాట్లాడుతూ, ఘర్షణ జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవే ఘర్షణకు కారణం**

ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన చిన్న గొడవే ఘర్షణకు దారి తీసింది. ఈ దాడిలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. దీనిపై విద్యార్థులను, ఉపాధ్యాయులను వేర్వేరుగా అడిగి తెలుసుకున్నాం. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నాం.

– ఉమామహేశ్వరీ, రీజనల్ కోఆర్డినేటర్

# 'పట్టణ ప్రగతి'లో అపశ్రుతి

- గోడ కూలి చిన్నారి మృతి
- గాయాలతో బయటపడిన బాలిక సోదరుడు
- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్


ప్రిన్సి


ప్రమాద స్థలం వద్ద విరిగిపడ్డ గోడ

**నయీంనగర్:** వరంగల్ అర్బన్ జిల్లాలో 'పట్టణ ప్రగతి'కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ కొత్తూర్ కేయూసీ మెయిన్‌రోడ్‌లో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలిక ప్రిన్సి మృతి చెందగా.. బాలిక సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన బొడ్డు సాంబశివరావు, ధనలక్ష్మి దంపతులు కొంతకాలంగా హన్మకొండలో వడ్రంగి పనిచేసుకుంటూ తమ ఇద్దరు పిల్లలు ప్రిన్సి(8), స్వరూప్‌తో కలసి జీవిస్తున్నారు. ఆదివారం పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా కొత్తూరు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పొక్లెయినర్‌తో డ్రైవర్ డ్రైనేజీ శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి ప్రిన్సి, అమె సోదరుడు స్వరూప్‌పై పడడంతో ప్రిన్సి అక్కడికక్కడే మృతిచెందింది. స్వరూప్‌ను ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రిన్సి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం గోవిందరావుపేటకు తరలించారు. ఎంజీఎంలో చిన్నారి మృతదేహాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, అర్బన్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ చిన్నారి మృతి ఘటన పట్ల సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం చిన్నారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, తల్లి ధనలక్ష్మికి ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించి వారికి నివాస వసతి సైతం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్ర గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రమాద విషయం తెలుసుకుని ములుగు జెడ్పీచైర్మన్ జగదీశ్‌తో కలసి గోవిందరావుపేటకు చేరుకుని బాలిక తల్లిదండ్రులను ఓదార్చారు. వారి కుటుంబానికి జెడ్పీచైర్మన్ తక్షణ సహాయంగా రూ.10వేలు అందజేశారు

# ఎలుగుబంటి కలకలం



**రఘునాథపల్లి:** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఎలుగుబంటి కలకలం సృష్టించింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో సమీపంలో ఉన్న పత్తి చేను నుంచి రాములవారి గుడి వద్దకు ఎలుగుబంటి చేరుకుంది. దీంతో స్థానికులు కంగారుపడ్డారు. విషయం తెలుసుకొని గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రజలను చూసిన ఎలుగుబంటి గోపాలస్వామి గుట్ట వైపు వెళ్లిపోయింది. ఇటీవలి కాలంలో రాత్రి సమయంలో ఎలుగుబంటి గ్రామం సమీపంలోకి వస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. కాగా, అది ఎప్పుడు తమపై దాడి చేస్తుందో అని భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటి సమస్యను గట్టెక్కించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# కొత్త సారథి కావలెను

**అధ్యక్ష ఎన్నికలు జరపాలంటున్న నేతలు**

- రాహుల్ తీరుతో విసిగిపోతున్న శ్రేణులు
- సోనియానే పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టాలని డిమాండ్లు

న్యూఢిల్లీ

కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ నిర్లిప్త ధోరణి, పార్ట్ టైమ్ పాలిటిక్స్‌పై పార్టీ నేతలు విసిగిపోతున్నట్టే కనిపిస్తోంది. అత్యంత కీలకమైన సవాళ్లు ఎదురైన సమయంలో కూడా ఆయన పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండడం, ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తూ ఉండడంతో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. గాంధీ కుటుంబానికి వీరవిధేయులు మాత్రం సోనియాయే పూర్తి స్థాయిలో అధ్యక్ష బాధ్యతలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలపడుతున్నా కాంగ్రెస్‌కి పూర్వవైభవం తీసుకురావడానికి రాహుల్ గాంధీ చిన్నపాటి ప్రయత్నం చేయకపోవడం, మతపరమైన అంశాల్లో బీజేపీని ఇరుకున పెట్టే విధంగా వ్యూహరచన చేయలేకపోవడం పార్టీ శ్రేణుల్లో నిరాశను నింపుతోంది. రాహుల్ ఏం మాట్లాడినా అవి పార్టీకే ఎదురు తిరుగుతూ ఉండడంతో రాహుల్ తిరిగి పార్టీ పగ్గాలు చేపట్టాలని ఇన్నాళ్లూ డిమాండ్ చేసినవారే ఇప్పుడు వెనకడుగు వేస్తున్నారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం అనంతరం అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా చేయడంతో మరో గత్యంతరం లేక సోనియా పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. సోనియాకు వయసు మీద పడినా, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నా రాహుల్‌తో పోల్చి చూస్తే ఆమె నయం అన్న అభిప్రాయానికి చాలా మంది నేతలు వస్తున్నారు. లేదంటే కాంగ్రెస్‌కి కొత్త సారథి వచ్చినా మంచిదేనన్న అభిప్రాయం కూడా కొందరిలో ఉంది. ఈ మధ్య కాలంలో రాహుల్ గాంధీ నిర్లిప్తతను బహిరంగంగానే నాయకులు ఎండగడుతున్నారు. మరికొందరు అంతర్గత సంభాషణల్లో రాహుల్ తీరుతెన్నులపై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌధురి రాహుల్, ప్రియాంకలు ఇద్దరూ పార్టీకి దూరంగా ఉంటేనే మంచిదన్న అభిప్రాయంలో ఉన్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. రాహుల్ గాంధీ లేకపోతే కాంగ్రెస్ మనుగడ సాధించలేదా ? అని ఆయన ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

**ఎవరేమన్నారంటే**



రాహుల్ గాంధీ తిరిగి అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారో లేదో తేల్చి చెప్పడం లేదు. ఆయన నాన్చుడు ధోరణి వల్ల కాంగ్రెస్ పార్టీకి దారి తెన్నూ తెలియడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కి కరుకు చురుకు కలిగిన అధ్యక్షుడి అవసరం ఉంది
*- శశిథరూర్, ఎంపీ*

కాంగ్రెస్ పార్టీ నాయకత్వ సమస్యను ఎదుర్కొంటోంది. సోనియాగాంధీ తాత్కాలికంగా మాత్రమే అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. వెంటనే ఎన్నికలు నిర్వహించి అధ్యక్షుడెవరో తేల్చాలి. ఒకవేళ రాహుల్ గాంధీ పోటీ పడకపోతే కొత్త వారికి పగ్గాలు అప్పగించాలి
*- అభిషేక్ మను సింఘ్వీ, ఎంపీ*

ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించగలిగే నాయకురాలు సోనియా గాంధీ మాత్రమే. పార్టీకి మంచి భవిష్యత్ ఉండాలంటే సోనియాయే పూర్తి స్థాయిలో పగ్గాలు చేపట్టాలి
*- మనీశ్ తివారీ, ఎంపీ*

కాంగ్రెస్ సీనియర్ నాయకులెవరూ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగాలని భావించడం లేదు. ఎందుకంటే గాంధీ కుటుంబానికి వ్యతిరేకులెవరైనా ఆ పదవిలోకి వస్తే కష్టం
*- సందీప్ దీక్షిత్, ఎంపీ*

# శతాబ్దానికో మహమ్మారి!

**ప్రపంచాన్ని వణికించిన ప్లేగు, కలరా, ఫ్లూ**

ఈ ప్రపంచంలో ఏదో ఒక మూల శతాబ్దానికో అంటువ్యాధి ప్రబలుతుందనేది ఓ నమ్మిక. గత ఘటనలను ఒకసారి అవలోకనం చేసుకుంటే ఇది నిజమేనని నమ్మేందుకు తగిన ఆధారాలున్నాయి. ప్రస్తుతం కోవిడ్(కరోనా వైరస్) మాదిరిగానే 1720, 1820, 1920లలో కూడా ప్రపంచాన్ని అంటువ్యాధులు కుదిపేశాయి. వేలాదిమందిని పొట్టనబెట్టుకున్నాయని పరిశోధకులంటున్నారు. దీనిని బట్టి చూస్తే, స్వార్థం కోసం ఎవరైనా కావాలనే వీటిని సృష్టించి జనం పైకి వదులుతున్నారా? అనే అనుమానం కూడా వస్తుంది. ఇంకా ముమ్ముందు ఎలాంటి వ్యాధులు వస్తాయోననే భయం కలగక మానదని 'ఏలియన్ న్యూస్' అనే వెబ్ మీడియా పేర్కొంది.



**1720లో ప్లేగు**

1720లలో యూరప్ ప్రజలను బ్యుబోనిక్ ప్లేగ్ కలవరపెట్టింది. ఫ్రాన్సులోని మర్సెయిల్స్‌లో బయటపడిన ఈ వ్యాధి ఒక్క ఆ నగరంలోనే 50వేల మందిని బలి తీసుకుంది. మొత్తమ్మీద ఫ్రాన్సు వ్యాప్తంగా లక్ష మంది ఈ వ్యాధితో చనిపోయారు.



**1820లో కలరా**

యూరప్‌ను అతలాకుతలం చేసిన ప్లేగుకు వందేళ్లు పూర్తవుతుండగానే కలరా ఆసియా దేశాలను కబళించింది. ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్, ఇండోనేసియా దేశాల్లో ఈ వ్యాధి కూడా లక్ష మంది ఉసురుతీసింది. కలరా బ్యాక్టీరియాతో కలుషితమైన చెరువు నీటిని తాగి ప్రజలు ఈ వ్యాధి బారినపడ్డారు.



**1920లో స్పానిష్ ఫ్లూ**

ఇటీవల కాలంలో ప్రపంచానికి బాగా పరిచయమైన పేరు స్పానిష్ ఫ్లూ. 100 కోట్ల మంది ఈ బారినపడగా ఒక కోటి మంది మృత్యువాతపడ్డారు. మానవ జాతి చరిత్రలోనే పెనువిషాదం మిగిల్చిన భయంకర వ్యాధి ఇది.



**2020లో కోవిడ్**

స్పానిష్ ఫ్లూ వచ్చిన వందేళ్ల తర్వాత చైనాలో కరోనా వైరస్ విజృంభించింది. రోజులు గడిచేకొద్దీ ఈ వ్యాధి వ్యాప్తి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ సమాజాన్ని భయాందోళనలకు గురిచేస్తోంది.

## సబ్సిడీయేతర ఎల్పీజీ ధర రూ.53 తగ్గింపు

**న్యూఢిల్లీ:** వంట గ్యాస్ ధర పెరిగిందని బెంబేలెత్తుతున్న ప్రజలకు ఊరట లభించింది. సబ్సిడీ లేని వంట గ్యాస్ ధరను ప్రభుత్వం ఆదివారం తగ్గించింది. 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర ఢిల్లీ, ముంబైల్లో రూ.53 మేర, అలాగే 19 కేజీల సిలిండర్ ధర రూ.84.50 తగ్గిందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపింది. ఆగస్టు 2019 నుంచి ఫిబ్రవరి 2020 మధ్య ఎల్పీజీ ధర 50 శాతం పెరిగింది.

## ఒకే కాన్పులో ఆరుగురు..



**భోపాల్:** ఆ మహిళకు ఒకే కాన్పులో ఏకంగా ఆరుగురు శిశువులు జన్మించారు. మధ్యప్రదేశ్‌లోని షివోపూర్ జిల్లాకు చెందిన మూర్తి మాలే (22) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ప్రసవించారు. ఆమెకు మొత్తం ఆరుగురు శిశువులు..నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు జన్మించారు. తక్కువ బరువు కారణంగా ఇద్దరు అమ్మాయిలు పుట్టిన కాసేపటికే మరణించారు. మిగతా వారికి ఇంటెన్సివ్ కేర్‌లో చికిత్స అందిస్తున్నారు. ఆరుగురు శిశువుల మొత్తం బరువు కేవలం 3.65 కేజీలు.

# పౌరసత్వం ఇచ్చి తీరుతాం..

**కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడి**

**కోల్‌కతా:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కింద దేశంలోని శరణార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం పౌరసత్వం ఇచ్చి తీరుతుందని.. అప్పటివరకు వెనకడుగు వేసేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. సీఏఏ శరణార్థులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించింది మాత్రమేనని.. దీని వల్ల ఏ ఒక్క వ్యక్తి తన పౌరసత్వాన్ని కోల్పోడని ఉద్ఘాటించారు. తృణమూల్ కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు సీఏఏపై అసత్య ప్రచారాన్ని చేస్తూ.. మైనారిటీలు, శరణార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. పౌరసత్వం కోసం శరణార్థులు పత్రాలు చూపించాలని ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. కోల్‌కతాలో ఆదివారం నిర్వహించిన ఓ పబ్లిక్ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ధ్వజమెత్తారు. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ప్రచారం చేసి.. మమత అల్లర్లకు ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని



దళితులు, వెనుకబడిన మతువా కులాలకు పౌరసత్వం రాకుండా మమత అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దమ్ముంటే పౌరసత్వ చట్ట అమలును ఆపాలని మమతకు సవాల్ విసిరారు. శరణార్థులకు పౌరసత్వం ఇవ్వాలని ప్రధాని మోదీ ఆలోచిస్తుంటే మమత సహా ప్రతిపక్షాల నేతలు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. 2021లో జరగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట రెండొంతుల మెజార్టీతో విజయం సాధించి.. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆర్ నోయ్ అన్యాయ్ (ఇక అన్యాయాన్ని సహించం)'అనే ప్రచారాన్ని అమిత్‌షా ప్రారంభించారు.

**ర్యాలీలో 'గోలీమారో'నినాదాలు..**

షహీద్ మినార్ గ్రౌండ్‌లో జరిగిన అమిత్‌షా ర్యాలీలో కొందరు బీజేపీ కార్యకర్తలు 'గోలీమారో' అని నినాదాలు చేశారు. దీనికి సంబంధించి కోల్‌కతా పోలీసులను వివరణ కోరగా.. స్పందించేందుకు నిరాకరించారు. నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

**భారత్‌లో మెరుగైన రక్షణ విధానం**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో మెరుగైన రక్షణ విధానాన్ని రూపొందించిందని అమిత్‌షా పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. 10 వేల ఏళ్ల చరిత్రలో భారత్ ఎలాంటి దాడులూ జరపలేదని.. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయన్నారు. ఎవరైనా తమ భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించినా.. జవాన్లు, ప్రజల మీద దాడులకు యత్నించినా.. భారత్ గట్టిగా బదులిస్తుందని పేర్కొన్నారు. రాజర్‌హాట్‌లో జాతీయ భద్రతా దళం (ఎన్‌ఎస్‌జీ) 29వ స్పెషల్ కంపోసిట్ గ్రూప్ (ఎస్‌సీజీ) కాంప్లెక్స్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌జీ అంటే ఉగ్ర వ్యతిరేక దళంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని అన్నారు.

## కుదుటపడుతున్న ఢిల్లీ

**న్యూఢిల్లీ:** మత ఘర్షణలు చోటుచేసుకున్న ఈశాన్య ఢిల్లీలో ప్రశాంతత నెలకొంటోంది. పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ గడిచిన మూడు రోజులుగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని పోలీసులు తెలిపారు. వదంతులను పట్టించుకోవద్దని, అటువంటి వాటిపై తమకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ ఆదివారం అల్లర్ల ప్రభావిత బ్రహ్మపురిలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ఘర్షణలకు సంబంధించి 903 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 254 ఎఫ్ఐఆర్‌లను పోలీసులు నమోదు చేశారు. ఢిల్లీ అల్లర్లకు సంబంధించి అదుపులోకి తీసుకున్న వారి వివరాలను వెల్లడించాలని హక్కుల కార్యకర్తలు పోలీసులను కోరారు. కాగా, పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) వ్యతిరేక నిరసనలకు కేంద్ర బిందువు షహీన్‌బాగ్‌లో అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. ఆదివారం ఆ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. కాగా, ఖ్యాలా–రఘుబిర్ నగర్–తిలక్ నగర్ ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగనున్నాయంటూ ఆదివారం సాయంత్రం సోషల్ మీడియాలో ప్రచారం జోరందుకుంది. అయితే అవి కేవలం వదంతులేనని ఢిల్లీ పశ్చిమ డీసీపీ దీపక్ పురోహిత్ చెప్పారు.

## భారత్ వెళ్లొచ్చాక ఆ భయం పోయింది!



**సౌత్ కరోలినా:** భారత్ పర్యటన తర్వాత భారీ బహిరంగ సభలంటే ఉన్న బెరుకు తనకు లేకుండాపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్ ప్రజలు ఎంతగానో ప్రేమించే గొప్ప వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అంటూ ప్రశంసలు కురిపించారు. సౌత్‌కరోలినాలో జరిగిన ఒక ర్యాలీలో ఆయన భారత్‌లో పర్యటనను ప్రస్తావిస్తూ..'భారీగా జనం హాజరయ్యే సభలంటే ఉన్న భయం భారత్‌కు వెళ్లొచ్చాక పోయింది. మన జనాభా 35 కోట్లు. నా సభలకు మహా అయితే 60 వేల మంది వస్తారేమో. కానీ, భారత్‌లో జరిగిన సభకు లక్ష మందికి పైగా హాజరయ్యారు. ఆ దేశ జనాభా 150 కోట్లు. నాకు మీపై ఎంత అభిమానమో అక్కడి వారన్నా అంతే. భారతీయులకు అమెరికా అన్నా ఎంతో ప్రేమ. ప్రధాని మోదీ గొప్ప నేత. ఆ దేశ పర్యటన నాకు ఎంతో విలువైంది' అని వ్యాఖ్యానించారు.

# తాలిబన్లను విడుదల చేయం

- తేల్చి చెప్పిన అఫ్గాన్ అధ్యక్షుడు ఘనీ
- ఆదిలోనే శాంతి ఒప్పందానికి ఆటంకం

**కాబూల్:** అమెరికా–తాలిబన్ల శాంతి ఒప్పందం అమలుకు ఆదిలోనే ఆటంకాలు ఎదురయ్యాయి. జైళ్లలో ఉన్న తాలిబన్లను తక్షణమే విడుదల చేయడం కుదిరే పని కాదని అఫ్గానిస్తాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ తేల్చి చెప్పారు. మార్చి 10 నుంచి నార్వే రాజధాని ఓస్లోలో అఫ్గాన్ ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలతో అధికార పంపిణీపై సంప్రదింపులున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు తాలిబన్లను విడుదల చేయలేమని ఘనీ స్పష్టం చేశారు. రెండు దశాబ్దాల యుద్ధానికి స్వస్తి పలుకుతూ శాంతి ఒప్పందం కుదుర్చుకున్న అమెరికా తన సైనిక బలగాలను వచ్చే 14 నెలల్లో ఉపసంహరిస్తామని ప్రకటించింది. అయితే ఈలోగా తాలిబన్లు ఎలాంటి దాడులకు పాల్పడకూడదని



షరతు విధించింది. అలాంటప్పుడు అఫ్గాన్ అధికార యంత్రాంగంతో చర్చలు జరగకుండా తాము తాలిబన్లను జైళ్ల నుంచి ఎందుకు విడుదల చేయాలని అధ్యక్షుడు ఘనీ ప్రశ్నించారు. జైళ్ల నుంచి ఖైదీలను విడుదల చేసే నిర్ణయం పూర్తిగా తమ ప్రభుత్వం ఇష్టమేనని, తదుపరి చర్చలు మొదలవకుండా ఖైదీలను విడుదల చేసే ఉద్దేశం లేదని చెప్పారు. మరోవైపు అమెరికా శాంతి దూత జల్మే ఖలీల్‌జద్ తాలిబన్లను జైళ్ల నుంచి విడుదల చేస్తేనే వారిలో విశ్వాసం వస్తుందని అంటున్నారు. ఓస్లోలో చర్చలకు ముందే అఫ్గాన్ ప్రభుత్వం 5 వేల మంది తాలిబన్ ఖైదీలను విడుదల చేస్తుందని ఈ ఒప్పందం సందర్భంగా అమెరికా హామీ ఇచ్చింది. ఇప్పుడు అధ్యక్షుడు ఎదురు తిరగడంతో ఈ ఒప్పందం అమలుపై సందేహాలు నెలకొన్నాయి.

**అఫ్గాన్ మహిళల్లో భయం భయం**

అమెరికా–తాలిబన్ల ఒప్పందం అఫ్గాన్ మహిళల్లో భయాన్ని నింపుతోంది. తాలిబన్లు అధికారంలోకి వస్తే ఎలాంటి సమస్యలు తెస్తారోనని ఆందోళన చెందుతున్నారు. 2001 తర్వాత అమెరికా అఫ్గాన్‌ని ఆక్రమించడానికి ముందు తాలిబన్లు అయిదేళ్ల పాటు చేసిన అరాచకాలు అక్కడ మహిళల్ని వెంటాడుతూనే ఉన్నాయి. అఫ్గాన్‌లో శాంతి నెలకొనాలంటే తమ జీవితాల్ని పణంగా పెట్టాలేమోనన్న అనుమానం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

# చైనా వెలుపల కోవిడ్ మృతులు

**అమెరికా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్‌లో నమోదైన మరణాలు**

**బీజింగ్/వాషింగ్టన్:** శరవేగంగా విస్తరిస్తున్న కరోనా మహమ్మారి చైనా వెలుపల కూడా ప్రాణాలను మింగేస్తోంది. అమెరికా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్‌లో తొలిసారిగా కరోనా మరణాలు నమోదయ్యాయి. అమెరికా గడ్డపై 50 ఏళ్లు పైబడిన ఒక వ్యక్తి మరణించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రజలెవరూ ఈ వైరస్ గురించి ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు అమెరికాలో 22 కరోనా కేసులు నమోదు కాగా, వారిలో 15 మంది కోలుకున్నారు. మరోవైపు జపాన్ డైమండ్ ప్రిన్సెస్ నౌకలో వైరస్ సోకి పెర్త్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు మరణించడంతో ఆస్ట్రేలియాలో కూడా తొలి కోవిడ్ మరణం నమోదైంది. థాయ్‌లాండ్‌లో కూడా ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా కోవిడ్‌తో మృతి చెందిన వారి సంఖ్య 2,996కు చేరింది.

**ఇరాన్‌లో మృతులు 54**

మరోవైపు ఇరాన్‌లో కోవిడ్ విజృంభిస్తోంది. ఇప్పటికే అక్కడ 54 మంది మరణించారు. మరో 987 మంది చికిత్స పొందుతున్నారని ఇరాన్ మీడియా వెల్లడించింది. దక్షిణ కొరియాలో కూడా ఈ వైరస్ విశ్వరూపం చూపిస్తోంది. కొత్తగా మరో 376 కేసులు నమోదయ్యాయి. దీంతో ఆ దేశంలో బాధితుల సంఖ్య 3,526కి చేరుకుంది.

**చైనాలో మరో 35 మంది మృతి**

ఇక చైనాలో ఆదివారం ఒక్కరోజే 35 మంది మరణించారు. మరో 570 తాజా కేసులు నమోదయ్యాయి. దీంతో మృతుల సంఖ్య 2,870కి చేరుకుంటే, వైరస్ సోకిన వారి సంఖ్య 79,824కి చేరుకుంది. కరోనా వైరస్ సోకిన వారిలో 60 ఏళ్ల వయసు పైబడినవారు, హైపర్ టెన్షన్ ఉన్నవారే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ఇవాంకా ట్రంప్ మార్ఫింగ్ ఫొటోలు

## తాజ్ వద్దకు తీసుకెళ్లినందుకు థ్యాంక్స్: ఇవాంకా

**న్యూఢిల్లీ:** నటుడు, గాయకుడు దిల్జిత్ దొసాంజ్ చేసిన ఓ ట్వీట్ ట్విట్టర్‌ను ఊపేస్తోంది. దీనికి కారణం ఆ ట్వీట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు రిప్లై ఇవ్వడమే. వివరాల్లోకి వెళితే.. ఇవాంకా ట్రంప్ ఇటీవల భారత పర్యటనలో తాజ్ మహల్‌ను సందర్శించిన సంగతి తెలిసిందే. అందులో ఆమె తాజ్‌మహల్ వద్ద దిగిన ఓ ఫొటోను దిల్జిత్ ఫొటోషాప్ ఉపయోగించి మార్ఫింగ్ చేసి, ఇవాంకా పక్కన తన ఫొటో పెట్టుకున్నాడు. 'నేనే తనను తాజ్‌మహల్ వద్దకు తీసుకెళ్లాను.. అంతకంటే ఏం చేయగలను ?' అంటూ కామెంట్ పెట్టాడు. దీనిపై ఇవాంకా స్పందిస్తూ.. 'నన్ను తాజ్‌మహల్ వద్దకు తీసుకెళ్లినందుకు కృతజ్ఞతలు. దీన్ని నేనెప్పటికీ మరచిపోలేను.' అంటూ రిప్లై ఇచ్చారు. దీనిపై దిల్జిత్ స్పందిస్తూ.. 'ఓ మైగాడ్.. కృతజ్ఞతలు ఇవాంకా ! ఇది ఫొటోషాప్ చేసిన చిత్రం కాదని అందరికీ చెప్పేప్రయత్నం చేస్తున్నారు. ఈసారి లూథియానాకు రండి' అన్నారు. దీనిపై మళ్లీ స్పందించిన ఇవాంకా 'భారతీయ అభిమానులను అభినందిస్తున్నా' అంటూ ఫొటోషాప్ చేసిన మరికొన్ని చిత్రాలను షేర్ చేశారు. తనపై ఫొటోషాప్ చేసిన ఫొటోలపై ఇవాంకా సీరియస్‌గా కాకుండా ఫన్నీగా స్పందించడంతో ట్విట్టర్‌లో నవ్వులు పూశాయి.

# అపాచీకి దీటుగా స్వదేశీ హెలికాప్టర్లు



**2027 నాటికి త్రివిధ దళాలకు అందించేందుకు హాల్ సన్నాహాలు**

**న్యూఢిల్లీ:** అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు చెందిన అపాచీ హెలికాప్టర్లకు దీటుగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో మధ్య తరహా మిలటరీ హెలికాప్టర్లను తయారు చేయడానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) సన్నాహాలు చేస్తోంది. 2027 కల్లా ఈ సైనిక హెలికాప్టర్లను తయారు చేసి భారత అమ్ముల పొదిలో చేర్చడానికి క్షేత్ర స్థాయిలో పని ప్రారంభించినట్టు హాల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మాధవన్ వెల్లడించారు. రానున్న సంవత్సరాల్లో భారత్‌లోని త్రివిధ బలగాలకు అవసరమైన హెలికాప్టర్లను తామే రూపొందించడానికి కృషి చేస్తున్నట్టు ఆదివారం పీటీఐ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ హెలికాప్టర్ల డిజైన్ల రూపకల్పన ఇప్పటికే పూర్తయింది. ప్రభుత్వం అనుమతినిస్తే 500 యూనిట్లలో హెలికాప్టర్‌కు సంబంధించిన తొలి నమూనా పని 2023 నాటికి పూర్తయ్యేలా హాల్ లక్ష్యంగా నిర్ణయించింది. మి–17 స్థానంలో 10–12 టన్నుల కేటగిరీలో హెలికాప్టర్ల తయారీపై హాల్ దృష్టి పెట్టింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో 500 హెలికాప్టర్ల తయారు చేయగలిగితే విదేశాల నుంచి రూ. 4 లక్షల కోట్లకు పైగా విలువైన దిగుమతుల్ని నిరోధించవచ్చునని మాధవన్ వెల్లడించారు.

**తేజస్ తర్వాత అతి పెద్ద ప్రాజెక్టు**

తేజస్ యుద్ధ విమానాల తయారీ తర్వాత హాల్ చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్టు ఇదే. హెలికాప్టర్ల డిజైన్ల తయారీకి, నమూనా హెలికాప్టర్ తయారీకి రూ.9,600 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ''ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ప్రాథమిక డిజైన్‌కు అనుమతి లభిస్తే 2027 నాటికి 500 హెలికాప్టర్లను తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వాయుసేన, నేవీతో కూడా చర్చిస్తున్నాం. ఆర్మీ, వాయుసేనకు ఒక తరహా హెలికాప్టర్లు రూపొందిస్తే, నేవీ కోసం భిన్నమైన డిజైన్‌తో రూపొందించాల్సి ఉంటుంది. ఈ దిశగా నావికా, వైమానిక దళాధికారులతో చర్చలు కొనసాగిస్తున్నాం'అని మాధవన్ వెల్లడించారు. రెండు శక్తిమంతమైన ఇంజిన్లతో నడిచే ఈ హెలికాప్టర్ యుద్ధ నౌకలపై నుంచి కార్యకలాపాలు నడిపేలా బ్లేడ్ ఫోల్డింగ్ ఫీచర్‌తో రూపొందించనున్నారు. వీటికి భారీ డిమాండ్ ఉంటుందని మాధవన్ అంచనా.

## సామ్నా ఎడిటర్‌గా రశ్మీ ఠాక్రే



**సాక్షి, ముంబై:** శివసేన పార్టీ పత్రిక సామ్నా సంపాదకురాలిగా ఆ పార్టీ చీఫ్, ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే సతీమణి రశ్మీ ఠాక్రే ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ కొనసాగనున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే వరకూ, ఉద్ధవ్ సంపాదకుడిగా కొనసాగారు. సామ్నాకు మొదటి సంపాదకుడిగా బాల్ ఠాక్రే వ్యవహరించగా, ఆయన మరణానంతరం ఉద్ధవ్ ఠాక్రే బాధ్యతలు స్వీకరించారు.

6
సాక్షి
సాహిత్యం



నల్లగొండ | సోమవారం
మార్చి | 2 | 2020
sakshisahityam@gmail.com

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి శు.సప్తమి ఉ.8.12 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం రోహిణి పూర్తి (24 గంటలు). వర్జ్యం రా.9.35 నుంచి 11.16 వరకు. దుర్ముహూర్తం ప.12.34 నుంచి 1.23 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.44 వరకు. అమృత ఘడియలు రా.2.37 నుంచి 4.20 వరకు

**సూర్యోదయం:** 6.22 **సూర్యాస్తమయం:** 6.02 ;
**రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు



### నమాజ్ వేళలు

**ఫజర్:** 5.22 **జొహర్:** 12.28
**అసర్:** 4.44 **మగ్రీబ్:** 6.23 **ఇషా:** 7.35

### ఈవారం పుస్తకాలు

**మనసు కోతి వంటిది** (కథలు)



రచన: పాలపర్తి జ్యోతిష్మతి; పేజీలు: 218 ; వెల: 150

**ఈ పాపం ఎవరిది**
(నవల+ఆరు స్త్రీవాద కథలు)
రచన: పాలపర్తి జ్యోతిష్మతి; పేజీలు: 174 ; వెల: 150 ; ప్రతులకు: రచయిత్రి, 32-103, వాసవీ నగర్, అద్దంకి-523201. ఫోన్: 9701115600

**జఖ్మీ** (ముస్లింవాద కవిత్వం)



రచన: నస్రీన్ ఖాన్; పేజీలు: 138 ; వెల: 120 ; ప్రతులకు: ఎన్‌కె పబ్లికేషన్స్, 1-7-1022/8/8/1, జమిస్తాన్‌పూర్, ముషీరాబాద్, హైదరాబాద్-20. ఫోన్: 040-27602786

**రమ్య ద రోబో**



రచన: విశ్వపుత్రిక(డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్) కథలు ; పేజీలు: 110 ; వెల: 100 ; ప్రతులకు: ఆర్‌సీ రెడ్డి పబ్లికేషన్స్, అశోక్ నగర్ క్రాస్ రోడ్స్, హైదరాబాద్-20. ఫోన్: 040-27600815

**ఆత్మీయులు** (కథలు)



రచన: డాక్టర్ లక్ష్మీ రాఘవ; పేజీలు: 144 ; వెల: 100 ; ప్రతులకు: రచయిత్రి, 3-99, అప్పగిరి స్ట్రీట్, కురబలకోట, చిత్తూరు జిల్లా-517350. ఫోన్: 9440124700

**కొత్త వెలుగు** (కథలు)



రచన: యర్రమిల్లి విజయలక్ష్మి; పేజీలు: 100 ; వెల: 125 ; ప్రతులకు: రవీంద్ర పబ్లిషింగ్ హౌజ్, తణుకు. ఫోన్: 9492007836

**రూపాంతరం** (కథలు)



రచన: జ్వలిత ; పేజీలు: 200 ; వెల: 200 ; ప్రతులకు: రచయిత్రి, 15-21-130/2, బాలాజీ నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్-72. ఫోన్: 9989198943

**నవ చైతన్యం** (కథలు)



రచన: రేగులపాటి కిషన్‌రావు ; పేజీలు: 98 ; వెల: 100 ; ప్రతులకు: రేగులపాటి విజయలక్ష్మి, 10-1-436, సంతోష్ నగర్, రామ్ నగర్, కరీంనగర్. ఫోన్: 7396036922

రైటరు గారూ, ప్రతి టీవీ సీరియల్‌లో కోడలికి పాలలో స్లో పాయిజన్ ఇవ్వడం బాగా బోరు కొట్టేస్తుంది. మన సీరియల్‌లో మాత్రం అత్త మీ కొత్త కవితల పుస్తకం లోంచి రోజుకో కవిత కోడలికి వినిపిస్తూ స్లోగా చంపేస్తుంది. ఐడియా బావుంది కదా!



# చీమ కట్టని చీర

● కథాసారం



ఇద్దరూ ఆ మధ్యాహ్నపు ఎండలో ఒక బట్టల దుకాణం ముందు ఆగిపోయారు.

కన్నయ్య అలాంటి 'షాపు'లోకి నడిచి ఎరగడు. తనకి కావలసిన ధోవతులు ఊళ్లోనే ఉన్న నేతగాళ్ల దగ్గరే కొనేవాడు. ఇక అతని పెళ్లాం చీరల మాటా? పుట్టింటినుంచి తెచ్చుకున్న వాటితోనే గడుపుతోంది.

కన్నయ్య చెప్పులు విడిచి లోపలికి నడిచాడు. పైకి గంభీరంగా కనిపిస్తున్నా మనస్సులో జంకుగా ఉంది. వాళ్లు మెడ పట్టుకుని నెట్టేసినా ఆశ్చర్యపడేలా లేదు. ఏదో కొనడానికే వచ్చాడనీ, దారి తప్పి కాదనీ వెంటనే తెలియపర్చకపోతే అంతపనీ చేసేస్తారనుకుంటున్నట్లు ''మా ఆడోళ్లకి చీరలు కొనాలండి–'' అని ఏదో తప్పు ఒప్పుకుంటున్నవాడిలా చెప్పేశాడు గుమాస్తాని చూస్తూ. ఆ క్షణంలో దుకాణంలో ఉన్న ప్రతిమనిషి, తన భావిని శాసించేవాడిలా కనపడ్డాడు. వెనక్కి తిరిగి బుల్లెమ్మ నుద్దేశించి ''లోపలికి రాయే. పర్లేదు'' అని దుకాణం యజమాని మొహంలోకి చూశాడు. పై మీద గుడ్డతో మొహం తుడుచుకుంటూ భార్య రాకని పర్యవేక్షించాడు. అంతవరకు ఎండలో నిలుచున్న బుల్లెమ్మ సిగ్గుపడుతూ లోపలికి వచ్చింది.

''ఎలాంటి చీరలు కావాలి?'' గుమాస్తా మామూలుగానే అడిగాడు. రైతువేషం, రైతుమొహం, రైతుభయం చూసి లోకువ కట్టలేదు. కాని కన్నయ్య మాత్రం వాళ్ల మెరిసే చొక్కాలనీ, ఇస్త్రీలో బిరుసెక్కిన పంట్లాలనీ చూస్తూ, వాటితో తన మురికిగుడ్డల్ని పోల్చుకుంటూ సిగ్గుపడ్డం మొదలెట్టాడు.

''చీరలండీ మామూలియి. ఒద్దే అక్కల్లేదండి. ఒకటి చాలు'' అని బుల్లెమ్మ మొహంలోకి చూశాడు. బుల్లెమ్మ తల ఆడించింది.

గుమాస్తా చీరలు తెచ్చి వెదురు పేలికల చాప మీద పరిచేస్తున్నాడు, చీరమీదున్న చీటీ చూడకుండానే దాని ఖరీదు చెప్పేస్తున్నాడు. ధరలు పది నుంచి పద్దెనిమిది రూపాయల వరకూ ఉన్నాయి. బుల్లెమ్మ మనస్సు కేరింతలు కొట్టింది. కుర్చీల మధ్య చోటు చేసుకుని కుదురుగా కూర్చొని ఎంచడం మొదలుపెట్టింది.

బుల్లెమ్మ చిన్న పిల్లలా చీరల్ని వేళ్లతో పట్టుకుని పరీక్షించడం కన్నయ్య సహించలేకపోతున్నాడు. వాళ్లు ''ఎయ్. వాటిని తాకకు'' అంటారని భయం. గుమాస్తా బుల్లెమ్మకు ప్రత్యేకం ఏ చీర ఎందుకు మంచిదో చెప్పుకుపోతున్నాడు. యజమాని టెలిఫోన్‌లో ఇంగ్లీష్ మాట్లాడేస్తున్నాడు. ''నౌఎడేస్ టైమ్స్ వజ్ ఛేంజింగ్''.

కన్నయ్య దైవం మీద భారం వేసి చుట్టూ చూడటంలో పడిపోయాడు. చాలాకాలం గడిచేక బుల్లెమ్మ ఓ చీర ఎంచుకుంది. ముదురు నీలిరంగు. వెడల్పాటి అంచు. ఖరీదు పదిహేను రూపాయల పద్నాలుగణాలు. బేరం మాత్రం హుషారుగా చేశాడు కన్నయ్య. చివరకి వాళ్లను కిందపెట్టీ మీదపెట్టీ పదిహేనున్నరకి ఒప్పించాడు. డబ్బు చెల్లించారు. గుమాస్తా అది చాలా నాణ్యమైన సరుకనీ, చీరపోయినా రంగుపోదనీ హామీ ఇచ్చాక కాని వాళ్లు బయటకు కదల్లేదు. పొద్దు వాలింది. మధ్యాహ్నం కూడు తిని బయల్దేరినవాళ్లు తిరిగి పొయ్యి రాజేసే వేళకి ఇల్లు చేరుకున్నారు. అది కన్నయ్య, అతని తండ్రీ కలిసి ఒక్క ఇటుక వాడకుండా కట్టిన తాటాకుల ఇల్లు.

•••

''పదిహేను రూపాయలే!''

''నువ్వు మరీని, పదిహేనున్నర!''

''నా మతి మండా, ఇంకా పదిహేను రూపాయలే అనుకుంటున్నా.''

బుల్లెమ్మ చీర గురించి తెలిసిన ఆడవాళ్లు అలాగా, ఇంకా అనేక విధాలుగా మాట్లాడుకున్నారు. వాళ్లెప్పుడూ చీర కోసం ఐదు రూపాయలు ఖర్చు పెట్టలేదు. ఒకసారి అచ్చమ్మ మొగుడు 'రంగం' నించి వస్తూ ఏడు రూపాయల చీర తెచ్చినప్పుడు అందరూ వెళ్లి చూసి, తాకి, ఎన్నిక చేసి వచ్చారు. ఇప్పుడు బుల్లెమ్మ కొనుక్కున్న చీర వాళ్ల అనుభవాన్ని కాదు ఊహను కూడా మించిపోయింది.

అయితే ఇందులో బుల్లెమ్మ తప్పేం లేదు. బుల్లెమ్మ ఖరీదైన చీరల మీది మోజుని అవ్యక్తంలోనే దాచేసుకుంది. తను ఇంట్లో ఎంతో పొదుపుగానూ, తెలివిగానూ పనిచేసి లాభం చేసినా ''అందుకు సొంతలాభం కావాలనుకోలేదు''. కాని నిన్న రాత్రి కన్నయ్యే మొదలెట్టాడు. అతను ఈసారి 'దార్ల'కి ఇవ్వాల్సింది ఇచ్చెయ్యగా బోలెడంత లాభం కనపడింది పొలం మీద. అదంతా బుల్లెమ్మ అదృష్టమని తోచింది. రాత్రి కూడు తింటూ ''నీకేం బహుమతి కావాలో కోరుకోయే'' అన్నాడు, ఇక మోటారుకారు కావాలన్నా ఇచ్చేసేవాడిలా. పైకి అలా అన్నా భయంగానే వుంది, తన తాహతుకి మించిన ఏ బంగారు నగో అడుగుతుందనీ తను చిన్నప్పచ్చవలిసొస్తుందనీని. కాని బుల్లెమ్మ అతని భయం, అతని దగ్గరున్న డబ్బులన్నీ తెలిసినదానిలా ఒక 'అలాంటి చీర' కావాలంది. బుల్లెమ్మ తెలిసి బాధించదు; తెలియక కూడా బాధించదు. అంచేత బుల్లెమ్మ వద్దన్నా ఇంత ఖరీదు పెట్టి ఈ చీర కొనేశాడు.

•••

బుల్లెమ్మలో ముఖ్యమైన లక్షణం శాంతం. ఆమె మనస్సులో ఎంత ఉద్ధృతమైన భావాలొచ్చినా ఆమె కదలికలో కనబడవు. పందొమ్మిదేళ్ల బుల్లెమ్మ అలా ఉండటం లోటో, గొప్పతనమో తెలుసుకోవడం కష్టం. ఎప్పటిలాగే ఆ చీరను చూసి నిశ్శబ్దంగా ఆనందించింది. ఇంటికొచ్చాక ఒకటి రెండు సార్లు ఆ మడతల్లో ముఖాన్ని దాచుకుంది. ఆ చీరది ఒక రకం బిస్కెట్ల వాసన. కొంతసేపు చూసి జాగ్రత్తగా తన పెద్ద కొయ్యపెట్టెలో దాచేసింది.

సాయంత్రం ఇంకా పొద్దుగూకకుండానే అన్నం తినేసి వీధిలోకి వెళ్లిపోయాడు కన్నయ్య. చీకటిపడి అందరి ఇళ్లల్లోనూ పిల్లలు నిద్రకు తయారయ్యాక కూడా రాలేదు. బుల్లెమ్మ ఆరుబయట నులకమంచం వాల్చుకు పడుకుని ఆలోచన మొదలుపెట్టింది. మబ్బులేనిచోట నక్షత్రాలు ఎప్పుడూ లేని కాంతితో మెరుస్తున్నాయి. ఒకవైపు తృప్తి... మరోవైపు ఏదో దిగులు. తనా చీరను ఎప్పుడు ఎలా కట్టుకుంటుందో బుల్లెమ్మకు పాలుపోలేదు. తను రోజంతా చీమలా శ్రమించే మనిషి. ఆ చీర కట్టుకుని తనేం పని చేస్తుంది? కట్టుకుని మడత నలగకుండా, పమిటె చెదరకుండా ఒక ఎత్తైన కుర్చీలో నేలని తాకకుండా కూర్చోవాలి!

క్రమంగా ఆ చీరంటే ఉత్సాహం పోయింది. అంత పల్చటి చీరా బరువులా తోచింది. తనుండే మట్టి ఇల్లూ, 'తను' అనబడే తన ఒళ్లూ ఆ చీరను మురికి చేస్తాయనుకుంది. బుల్లెమ్మ శుభ్రంగానే ఉంటుంది. కానీ ఆ చీరకు తగననుకుంది. అది ఆలోచన ఫలితం కాదు; అదో నమ్మకం; దానికి ఎదురెళ్లడం బుల్లెమ్మకు చేతకాదు.

ఆ చీర మర్నాడు కట్టుకోలేదు. ఆ మర్నాడూ కట్టుకోలేదు. నెల్లాళ్లు గడిచినా కట్టుకోలేదు. పెద్ద పండుగ రోజున కన్నయ్య పట్టుపట్టాడు. బుల్లెమ్మ కూడా అతని మాటల ఆసరాతో సిద్ధపడింది కాని మనసు మార్చుకుని చీర పెట్టెలో పెట్టి ఏదో పని కల్పించుకుంది.

సంవత్సరాలు దొర్లిపోయాయి. కన్నయ్య ప్రతీ ఏటా పొలం మీద లాభం తీశాడు. పదేళ్ల గడిచేసరికి భూమి కొన్నాడు తనకు కౌలుకిచ్చిన వాళ్ల దగ్గర్నుంచి. బుల్లెమ్మ కొత్తలో ఆ చీర తరుచుగా పెట్లోంచి తీసి దాన్ని పసిపాపలా ముద్దు చేస్తుండేది. పురుగు చేరకుండా కలరా ఉండలు ఉంచేది మడతల్లో. ఒక్కోసారి ఎండలో ఉంచి మళ్లీ జాగ్రత్తగా మడత పెట్టి దాచేసేది. ఆ చీరను చూస్తే, తాకితే, ఒళ్లు పులకించేది. కట్టుకోవాలని కోరిక కలిగితే, ''ఆ రోజు వస్తుంది; అప్పుడు!'' అని మనస్సును మరిపించేది. అదేదో అద్భుతమైన రోజు అని బుల్లెమ్మ నమ్మకం. ఆ రోజు ఎలా వస్తుందో మాత్రం ఊహ కూడా లేదు.

''ఆ రోజు'' వచ్చింది. కన్నయ్య పెద్ద ''ఖామందు'' అయిపోయాడు. పెద్ద కూతురికి చాలా పెద్ద సంబంధం తెచ్చాడు. ఇప్పుడు కట్టుకోవచ్చు. ఇంటి లోపలా, వెలుపలా పెళ్లి సందడి. బుల్లెమ్మ కాస్త తీరిక చేసుకుని గదిలోకి వచ్చి తలుపు గడియ వేసింది. కొయ్యపెట్టె మూత తెరిచింది. ఎప్పుడూ కట్టక పోవడం చేత ఆ చీర కొత్తదిగా ఉండిపోయింది. అది కొత్త చీరే...! పొందని ఆనందంలో విలువ ఏమంటే అది పాతబడదు. బుల్లెమ్మలా అలా చీరను పూజిస్తూ గడిపినవాళ్లెవరూ కనిపించకపోవచ్చు. అలా లేకపోవడం ఆమె అనుభవానికి మరీ విలువ ఇస్తుంది.

కాని బుల్లెమ్మ అంతకంటే అదృష్టవంతురాలే. ఆ చీర ఇప్పుడు కట్టేసుకుని దాని మీదుండే పదిహేనేళ్ల మోజు పోయి ఆ వెలితిని భరించే యోగం ఆమెకు లేదు. ఆ చీర ఇప్పుడు చీరలా లేదు... జల్లెడలా వుంది. పురుగులు చక్కగా ఏవో డిజైన్లు చేసుకుని తినేశాయి. ఒక దీపం ముందుంచి చూస్తే చుక్కలతో నిండిన ఆకాశంలా ఉంటుంది.

బుల్లెమ్మ గభాలున గుండెకు హత్తుకుని అక్కడ కూర్చుండిపోయింది. పెద్ద బరువు శాశ్వతంగా తీరిపోయినట్లైంది. ఆమెకు తెలీకుండా కళ్లు, చెక్కిళ్లు తడిసిపోయాయి.

**తను రోజంతా చీమలా శ్రమించే మనిషి. ఆ చీర కట్టుకుని తనేం పని చేస్తుంది? కట్టుకుని మడత నలగకుండా, పమిటె చెదరకుండా ఒక ఎత్తైన కుర్చీలో నేలని తాకకుండా కూర్చోవాలి! క్రమంగా ఆ చీరంటే ఉత్సాహం పోయింది. అంత పల్చటి చీరా బరువులా తోచింది.**



జ్యేష్ఠ

జ్యేష్ఠ కథ 'విలువలు' సంక్షిప్త రూపం ఇది. రచనా కాలం: 1958. జ్యేష్ఠ పేరుతో రాసిన ఇవటూరి చిన వీర బసవ రాజు తన పంతొమ్మిదేళ్ల వయసులో రాసిన కథ. ఆయన ఆంధ్ర విశ్వ కళా పరిషత్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. మంచి చదువరి. మార్క్స్, హెగెల్, ఏంగిల్స్, కాంట్ సిద్ధాంతాల మీద సాధికారత ఉన్న వ్యక్తి. అనంతర కాలంలో 'మార్క్సిజం బూజు' వదిలించుకున్నారు. ధ్యానం వైపు ప్రయాణించారు. 1991లో మరణించారు. మోసపోయేవరకు ప్రతి మనిషినీ నమ్మాలి అనేవారట. సుమారు 75 కథలు రాశారు. 'జ్యేష్ఠ కథలు' ఆయన సంపుటి. ఎర్రతేలు ఆయన మరో కథ. 'నాక్కొంచెం నమ్మకమివ్వు' నవల.

● కొత్త బంగారం

# భ్రమాన్విత చేతన

'వాస్తవాన్ని వివరించడానికి, ఎన్నిమాటలూ సరిపోవు,' అంటాడు డానియల్ ఖేల్మాన్ రాసిన 'యు షుడ్ హావ్ లెఫ్ట్' నవలలోని కథకుడు. కానీ, రచయిత సమర్థుడైతే ఒక ప్రత్యేకమైన కథకుడ్ని ఉపయోగించుకుని ఆ సంక్లిష్ట వాస్తవాన్ని మన ఊహకి అందేలా చేయగలడు. నవల శిల్పం, ఆ శిల్ప ప్రభావం సంపూర్ణంగా ఆ ప్రత్యేక కథకుడి మీదా, అతని కథనం మీదా ఆధారపడి వుంటుంది.

సినిమా రచయిత అయిన కథకుడు, విజయవంతమైన తన సినిమాకి సీక్వెల్ రాయడానికి– భార్య (ఒకప్పుడు సినీ నటి, ఇప్పుడు నలభై ఏళ్లు), నాలుగేళ్ల కూతురుతో కలిసి కొండమీద ఒక భవంతిని అద్దెకి తీసుకుంటాడు. రైటర్స్ బ్లాక్‌తో అవస్థ పడుతున్న అతనికి, నటిగా అవకాశాలు రాని అసహనంతో ఉన్న భార్య విసిరే సూటిపోటి మాటలు తోడవుతుంటాయి. స్క్రీన్‌ప్లే రాసే పుస్తకంలోనే జరుగుతున్న విషయాలని కూడా అతను రాస్తుండటంతో కథ మనలని చేరుతుంటుంది. మొత్తం ఆరురోజుల కథ, ఆరే ఆరు అధ్యాయాలు. రెండో అధ్యాయంలో 'ఒక వింత విషయం జరిగింది,' అనే వాక్యంతో అసలు కథ మొదలవుతుంది. ఆ ఇంట్లో ఉన్న ఒక ఫొటోలోని మనిషే పీడకలలో కనిపించింది కానీ, తీరా చూస్తే ఇప్పుడక్కడ ఆ ఫొటోనే లేదు! ఇంట్లో ఇంతకుముందు చూసిన కారిడారే ఇంకా పొడుగ్గా ఉన్నట్టుంది. ఇంతకుముందు లేని పడక గదులు ఇప్పుడు మరికొన్ని కనిపిస్తున్నాయి. కొండకింది ఊరికి సామాన్లు తెచ్చుకోవడానికి వెళ్లినప్పుడు అక్కడో కొత్త వ్యక్తి, అక్కడెందుకు ఉంటున్నారసలు అని స్థానిక యాసలో అడిగింది అతనికి సగమే అర్థం అవుతుంది. మిగతా సగం మనకి అర్థం అవుతుంది!







**యు షుడ్ హావ్ లెఫ్ట్**
**మూలం: డానియల్ ఖేల్మాన్** (ఫొటో)
**జర్మన్ నుంచి ఇంగ్లీష్: రాస్ బెంజమిన్**

నాలుగో రోజుకి మరో ఎదురుదెబ్బ– భార్యకి మరెవరితోనో సంబంధం ఉందని తెలియడం, నిలదీస్తే 'కూతుర్ని జాగ్రత్తగా చూసుకో,' అని ఆమె కారేసుకుని వెళ్లిపోవడం. ఒక లంబ కోణం గీసి, ఆ కోణాన్ని ఖండిస్తూ అడ్డంగా మరో సరళరేఖని గీసి, ఏర్పడ్డ రెండు కోణాల మొత్తం చూస్తే అది తొంభైకి కొంచెం తక్కువగా ఉంటోంది. లెక్కలన్నీ తప్పుతున్నాయి.

ఇదంతా బొత్తిగా 'భూత' కల్పనేమో అని మనం అనుకునే లోపలే ఒక విషయం గమనిస్తాం. ఇప్పటివరకూ జరిగిన కథలోని చివరి రెండు అధ్యాయాలలోనూ కథకుడు రాస్తున్న దాంట్లో తేడా కనిపిస్తుంది. విరిగిపోతున్న వాక్యాలూ, చెరిగిపోతున్న విరామ చిహ్నాలూ మనకి కొత్త అనుమానాలు సృష్టిస్తాయి. దెబ్బతిన్న కథకుడి మానసిక సమతుల్యత అర్థమై– జరిగిన కథని పునస్సమీక్షించుకోవాల్సిన అవసరం, జరగబోతున్న కథని, చెప్పబోతున్న కథకుడిని జాగ్రత్తగా అంచనా వేయాల్సిన అవసరం ఏకకాలంలో కలుగుతాయి. ప్రత్యేకత కలిగిన ఇలాంటి అన్‌రిలయబుల్ నేరేటర్ విషయంలో కథకుడు నమ్మదగినవాడు కాదని ప్రారంభంలోనే తెలియడం వేరు. మధ్యలో తెలియడం అసలైన హారర్!

ముప్పై ఏళ్ల వయసులోనే 'మెజరింగ్ ది వరల్డ్' నవలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ జర్మన్ రచయిత మూడేళ్ల క్రితం విడుదలయిన నవల 'టిల్'తో జర్మన్ సాహిత్యంలో తన స్థానాన్ని సుస్థిరపరుచుకున్నాడు. 'యు షుడ్ హావ్ లెఫ్ట్' కథనం ఆకట్టుకోవడానికి మూల రచయిత కృషి ఎంత ఉండివుండవచ్చో, అనువాదకుడు రాస్ బెంజమిన్ కృషి దాదాపుగా అంతే ఉందనిపిస్తుంది. 2017లో పాంథియాన్ ప్రచురించిన ఈ ఇంగ్లీష్ అనువాదం చదివాక బెంజమిన్ ఇతర అనువాదాలని వెతికిపట్టుకుని చదవాలనిపిస్తుంది.

దిశ మారుతున్న కథని మనం గమనిస్తూ కూడా దాన్ని మామూలు హారర్ కథగా భ్రమించకుండా, రచయిత కథని నడుపుతున్న తీరుని గమనించేట్టు చేయడం డానియల్ ఖేల్మాన్ ఈ నవలలో సాధించిన విశేషం.

◆ ఎ.వి.రమణమూర్తి

### రారండోయ్

- మధునాపంతుల శత జయంతి సదస్సు మార్చి 5న తూర్పు గోదావరి జిల్లాలోని పల్లిపాలెంలో జరగనుంది. శతజయంతి ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తారు. కె.శివారెడ్డి, మండలి బుద్ధప్రసాద్, రాచపాళెం, శిఖామణి, అప్పాజోస్యుల, సన్నిధానం, రెంటాల, దేవదానంరాజు, సుధామ, రాపాక, లక్ష్మణ చక్రవర్తి పాల్గొంటారు. నిర్వహణ: మధునాపంతుల ఫౌండేషన్.
- వై.సత్యనారాయణ కవితా సంపుటి 'వరదగూడు' ఆవిష్కరణ మార్చి 5న ఉదయం 10:30కు ఏవీ కళాశాలలో జరగనుంది. నిర్వహణ: దక్కన్ సాహిత్య సభ, ఏవీ కళాశాల తెలుగు శాఖ. ఎన్.గోపి, కె.రామచంద్రారెడ్డి, పత్తిపాక మోహన్, కాంచనపల్లి పాల్గొంటారు.
- భూతం ముత్యాలు కథల సంపుటి 'మాలపల్లె' ఆవిష్కరణ మార్చి 7న మధ్యాహ్నం 2 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఐసీఎస్ఎస్ఆర్ గెస్ట్ హౌజ్‌లో జరగనుంది. జి.వి.రత్నాకర్, ఏనుగు నరసింహా రెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, సంగిశెట్టి శ్రీనివాస్, జునైద్ జాకీర్ పాల్గొంటారు. నిర్వహణ: ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్.
- మల్లావజ్జల సదాశివుడు స్మారక పురస్కారం అందుకున్న బెల్లి యాదయ్యకు మార్చి 8న నల్లగొండలో సన్మానం జరగనుంది. నిర్వహణ: ఉనికి, నల్లగొండ ఫిల్మ్ సొసైటీ. బండి నారాయణ స్వామి, కోయి కోటేశ్వరరావు, మునాసు వెంకట్, ఎం.వి. గోనారెడ్డి, భైరెడ్డి కృష్ణారెడ్డి, చింతల యాదగిరి పాల్గొంటారు.
- సారస్వతి అకాడమీ ఉన్నత పాఠశాల, హైదరాబాద్ పాతనగర రచయితల సంఘం ఆధ్వర్యంలో– పాఠశాల 60 వసంతాల, మహిళా దినోత్సవ వేడుకలు మార్చి 5న ఉదయం 10 గంటలకు గౌలిపురలోని పాఠశాల ప్రాంగణంలో జరగనున్నాయి. ఇందులో కవయిత్రుల సమ్మేళనం ఉంటుంది. చింతపట్ల సుదర్శన్, స్వాతి శ్రీపాద, శైలజామిత్ర, కె.హరనాథ్, బొడ్డు ప్రకాశ్, మనోహర్ మిట్టా, రమాదేవి కులకర్ణి పాల్గొంటారు.
- పల్లా పురస్కారం కోసం 2019 - 2020 జనవరి వరకు ముద్రితమైన కవితా సంపుటాల్ని ఆహ్వానిస్తున్నారు. నగదు: రూ. 5,116. మార్చి 31లోగా చేరాల్సిన చిరునామా: పల్లా కృష్ణ, యువసాహితి, 25-588, వసంతపేట, ప్రొద్దుటూరు-516360.

● మీకు తెలుసా?

విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు ఇద్దరూ తిరుపతి వేంకటకవుల శిష్యులు. వీరు కొన్నాళ్లు జంటకవులుగా కవితా సాధన చేశారు, సత్యాంజనేయ కవులు పేరుతో.

● సాహిత్య మరమరాలు

## వడ్డిస్తూ తినలేము



రచయిత, 'హాస్యబ్రహ్మ' భమిడిపాటి కామేశ్వరరావు ప్రసంగిస్తుంటే అందరూ విరగబడి నవ్వేవారట. కానీ ఆయన ముఖంలో మాత్రం ఎక్కడా నవ్వు కనబడేది కాదు. ఒకసారి అలా ఎలా ఉండగలుగుతున్నారని ఎవరో అడిగితే ఆయన ఇచ్చిన సమాధానం: ''సమారాధన పంక్తి మీద వడ్డించేవాడు తింటూ వడ్డించడు కదా, అలాగే యిదీనూ!''

● గ్రేట్ రైటర్

# తల్లి ప్రథమ శత్రువు

తుర్గేనెవ్ తల్లిదండ్రులు పాత ప్రభువంశానికి చెందినవారు. ఆయన తల్లి ఒరేల్ రాష్ట్రంలో అతి ధనవంతురాలైన జమీందారిణి. ఆమె భూదాస్య విధానాన్ని గట్టిగా బలపర్చేది, తన భూదాసులను క్రూరంగా హింసించేది. ''నేను కొట్టడాలూ, చెంప దెబ్బలూ, వగైరాలుండే వాతావరణంలో పుట్టి పెరిగాను. అప్పటికే నేను భూదాస్య విధానాన్ని అసహ్యించుకునేవాణ్ణి'' అని తుర్గేనెవ్ ఆ తరువాత రాశాడు. భూదాసులను సమర్థించి ఆయన తన తల్లితో తీవ్ర ఘర్షణ పడి ఇల్లు విడిపోవలసి వచ్చింది. ''నేను అసహ్యించుకునే చోట ఆ గాలిని పీలుస్తూ వుండలేకపోయాను. నా దృష్టిలో యీ శత్రువుకు ఒక నిర్దిష్ట రూపం వుంది, ఒక నిర్దిష్టమైన పేరు వుంది, భూదాస్య విధానమే ఆ శత్రువు'' అని ఆయన రాశాడు. యువకుడైన తుర్గేనెవ్ తన జీవితకాలమంతా యీ బద్ధ శత్రువుకు వ్యతిరేకంగా పోరాడుతానని ''హనిబాల్ ప్రమాణం'' తీసుకున్నాడు (కార్తేజి యుద్ధంలో ప్రసిద్ధ నాయకుడైన హనిబాల్ పేర తీసుకున్న ప్రమాణం). సాహిత్య విమర్శకుడూ తొలి విప్లవకర్త ప్రజాస్వామికవాదులలో ఒకడూ అయిన వి.బెలీన్‌స్కీ– తుర్గేనెవ్ మిత్రుడయ్యాడు. బెలీన్‌స్కీ భావాలూ, రచనలూ రష్యన్ సాహిత్యం మీద ప్రజల ఆలోచనల మీద గొప్ప ప్రభావాన్ని నెరపాయి. తుర్గేనెవ్ ''తండ్రులూ కొడుకులూ'' అనే తన నవలను బెలీన్‌స్కీ స్మృతికి అంకితమిచ్చి ఆయన భావాల పట్ల తనకున్న భక్తి విశ్వాసాలను నిరూపించుకున్నాడు.



*(కొండేపూడి లక్ష్మీనారాయణ రష్యన్ నుంచి తెలుగులోకి అనువదించిన ఇ.తుర్గేనెవ్ 'తండ్రులూ–కొడుకులూ' ముందుమాటలోంచి)*

◆ ఎ.తౌల్‌స్త్యకోవ్

● రీవిజిట్

కోడూరి విజయకుమార్ ఇంతవరకూ వాతావరణం, అక్వేరియంలో బంగారు చేప, అనంతరం, ఒక రాత్రి మరొక రాత్రి కవితా సంపుటాలు వెలువరించారు. 'పొడిబారని నయనమొకటి తడియారని గుండె వొకటి వుండాలే గానీ' ఉదయం లేచింది మొదలు రాత్రి వరకూ ఎన్నో ఆశ్చర్యాలు కవికి. కానీ కాలం గడిచేకొద్దీ ఈ మహానగరం 'కళ్లకు గంతలు కట్టి, గుండెకు తాళం వేస్తుంది' అని బాధ! 'కొత్త ఇంట్లోకి అడుగు పెట్టిన రోజున ఇంటి గడపపై వెలిగిన రెండు దీపాలు– మా నాన్న కళ్లు' అని మురిసిపోయిన చిన్నవాడే, పెద్దవాడై, సొంతింటి కలకన్నవాడై, శేష జీవితాన్ని ఇంటి వాయిదాలకు తాకట్టు పెట్టినవాడవుతాడు. ఇట్లాంటి ఎన్నో బాధల పలవరింపు తాజా సంపుటి 'రేగుపండ్ల చెట్టు'. అందులోంచి ఒక కవిత:

**రేగుపండ్ల చెట్టు**



రచన: కోడూరి విజయకుమార్; పేజీలు: 88; వెల: 60; ప్రచురణ: కృష్ణప్రియ ప్రచురణలు, సికింద్రాబాద్–17. కవి ఫోన్: 8330954074

### దేహమొక రహస్య బిలం

ఏ అపూర్వ రహస్యాన్ని ఛేదించడానికి
లోకం కడలిపైన ఈ దేహనావతో యాత్రిస్తున్నావు
అంతు చిక్కని ఒక రహస్యమేదో నీ
నావ లోలోపలే తిరుగుతున్నదని తెలుసా నీకు

ఇదంతా పరిచిత దేహమనే అనుకుంటావుగానీ
నీ ఎముకల రక్త మాంసాల లోలోపల్లోపల
రహస్య రహస్యంగా సంచరించే మృత్యుగీతం
చివరాఖరికెప్పుడో తప్ప వినిపించదు

ఇవాళ జీవకళతో మెరిసిపోయే ఈ నావని
పూల తీగల్లా అల్లుకున్న
నీ రక్తసంబంధాలు నీ స్నేహ సంబంధాలు
ఎవరికి తెలుసు– కొద్ది ప్రయాణంలోనే ఈ నావ
కళ తప్పి ఏ తుపాను తాకిడికో ఛిద్రమయ్యాక
అగంతకుడిలా చొరబడిన అకాల
మృత్యువు రహస్యం తెలుసుకుంటావని

ప్రతిరోజూ నీ యాత్రను
దేహానికి నమస్కరించి ప్రారంభించు
లోపలి రహస్యగీతాన్ని ఆలపిస్తూ ప్రారంభించు

◆ కోడూరి విజయకుమార్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 2-3-2020



# చూతము రారండి

**అరవై నాలుగు కళల్లో పెళ్లి కళ లేదు (నవ్వులాటకు లెండి). కానీ పెళ్లిలో అరవై నాలుగేమిటి.. నూట అరవై నాలుగు కళకళలు ఉంటాయి. కళలు ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. పెళ్లికళ మాత్రం మారుతూ ఉంటుంది. మెరుగౌతుంది. తరుగౌతుంది. తరుగైనా, మెరుగైనా తళుక్కున మాత్రం ఒక మెరుపౌతుంది. ప్రస్తుతమిది పెళ్లిళ్ల సీజన్. మన పెళ్లి వేడుకలు కాలానుగుణంగా ఎలా మారుతున్నాయో చూతము రారండి.**

ఒకప్పుడు ఏడు రోజుల పెళ్లిళ్లు జరిగేవి. మెల్లగా ఐదు రోజులు, మూడు రోజులు, రెండు రోజుల పెళ్లిళ్లు అయ్యాయి. ఇంకా కుదించుకుపోయి ఒక్కరోజుకు పరిమితమయ్యాయి కూడా. నానమ్మ–తాతయ్య తరం నుంచి అమ్మా–నాన్న తరం వరకు వచ్చిన మార్పులవి. కారణాలు ఏమయితేనేం ఇండియా సంపన్నమైంది. అమెరికా ఉద్యోగాలతో ఇండియా చేతిలో డబ్బు గలగలలు పెరిగాయి. ఈ తరానికి పెళ్లి మళ్లీ వారం రోజుల వేడుకైంది. అంతరించిపోయిన వేడుకలను యథాతథంగా తిరిగి తోడడం కంటే మనకు నచ్చిన ఉత్తరాది సంప్రదాయాలను తెచ్చుకుంటే... ఎలా ఉంటుంది? భారతీయతలోని భిన్నత్వాన్ని ఏకత్వం చేసినట్లు ఉంటుంది. ఇంకేం... ఉత్తరాది, దక్షిణాది సంప్రదాయాలు కలిసిపోయాయి. మెహందీ, సంగీత్‌లకే రెండు రోజులు! మన దగ్గరెలాగూ ఓ రోజు ప్రదానం. ఓ రోజు పెళ్లి కూతుర్ని చేయడం. ఓ రోజు గంధపు నలుగు. తాళికి, తలంబ్రాలకు ఎటూ ఒకరోజు ఉంటుంది. మరుసటి రోజు అమ్మాయిని అత్తవారింటికి తోడ్కొని వెళ్లడం... ఏడు రోజులు సరిపోయాయి. ఆ తర్వాత సత్యనారాయణ వ్రతం. అదయ్యాక పదహారు రోజుల పండగ ఎలాగూ ఉంటుంది. ఒక పెళ్లి ఇన్ని పండుగలను తెస్తుంది. పండగలతో ఆగదు, పనులనూ తెస్తుంది. ఇన్ని పనులా! ఎన్ని పనులైతేనేమి? ఒకప్పుడు ధాన్యం పట్టడం నుంచి విస్తరాకులు వేయడం వరకు అన్ని పనులనూ ఇంట్లో వాళ్లు చేసుకునేవాళ్లు. ఇంటిల్లిపాదీ పెళ్లి పనులు చేసేవాళ్లు. బంధువులు కూడా పెళ్లి పనుల్లో సాయం చేసేవాళ్లు. ఇప్పుడు ప్రతిదీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేతుల్లోనే.

ఇప్పటి సంపన్న పెళ్లిళ్ల ట్రెండ్ చూస్తుంటే మూడుముడులు వేయడానికి నచ్చిన వేదిక కోసం ముల్లోకాలను గాలిస్తున్నట్లే ఉంది. ఈ వెకేషన్ మ్యారేజ్‌లకు కేరళ కొబ్బరితోటలు, బాలిలోని పగడపు దీవులలోపాటు అరబ్ ఎమిరేట్స్ కూడా భారతీయ పెళ్లి కళను సంతరించుకుంటున్నాయి. ఇటీవలే ఖమ్మం మాజీ ఎంపీ, టీఆర్‌ఎస్ నాయకుడి కొడుకు పెళ్లి అబుదాబిలో ఘనంగా జరిగింది. పెళ్లి తర్వాత జరిగే రిసెప్షన్‌కి ఖమ్మంలో డెబ్బై ఎకరాల విస్తీర్ణంలో కళాత్మక నిర్మాణాలు, వాటర్ ఫౌంటెయిన్‌లను, బాహుబలి సెట్టింగులను మించిన సెట్టింగులను వేశారు. ఇలా శుభలేఖల నుంచి దుస్తులు, ఆభరణాలు, అలంకరణ, విందు భోజనాలు, పెళ్లి ఫొటోల వరకు ప్రతిదీ కొత్తదనం–సంపన్నతల కలబోత అయింది.

## పెళ్లి పిలుపు

పంతొమ్మిది వందల అరవైల నాటి పెళ్లి పత్రికల్లో సీతారాములు ఉండేవారు. సీతాదేవి వరమాలతో సిగ్గులొలికిస్తుంటే రాముడు కోదండ ధారుడై క్రీగంటి చూపులతో సీతను చూస్తుండేవాడు. క్రమంగా వాళ్ల స్థానంలోకి వధూవరులు వచ్చేశారు! పెళ్లికి కార్డులు ప్రింటింగ్ ప్రెస్ నుంచి కాకుండా, ఫొటోస్టూడియోల నుంచి ఫొటోల రూపంలోనే వచ్చేశాయి. రాజుల కాలం నాటి చుట్ట చుట్టిన వర్తమాన వస్త్రం నమూనాలోకి పెళ్లిపత్రికను తెచ్చుకున్నారు కొందరు. చిన్న బ్యాటరీని అమర్చిన పెళ్లి పత్రికలూ వచ్చాయి. కార్డు తెరవగానే సంగీతం వినిపించేది. కొన్ని కార్డులు ఫొటో ఫ్రేమ్‌తో వస్తున్నాయి.



50 ఏళ్లనాటి ఒక పెళ్లిపత్రిక

పెళ్లి అయిపోయిన తర్వాత ఆ పత్రికను తీసేసి ఎవరికి వాళ్లు తమకు ఇష్టమైన ఫొటోను అమర్చుకుని డ్రాయింగ్ రూమ్‌లో పెట్టుకోవచ్చు. ఇప్పటి పెళ్లి కార్డు ఈ మెయిల్, వాట్సాప్‌లలో వస్తోంది.

**ఫోన్‌లో పెళ్లి పత్రికను (పెళ్లి ఫైల్ అనాలేమో) ఓపెన్ చేయగానే వధూవరుల ఫొటోలతో ఉన్న చిన్న వీడియో ప్లే అవుతోంది. ఆ ఆహ్వానం చూస్తుంటే పెళ్లి చూసినట్లే ఉంటోంది.**

## పెళ్లి పందిరి



పెళ్లికి ముహూర్తాలు పెట్టుకున్న తర్వాత పసుపు దంచడానికి, పందిరి వేయడానికి కూడా ముహూర్తం పెట్టుకుంటారు. మామిడాకులు కట్టిన ఒక రాటను నాటుతారు. ఆ తర్వాత పందిరి కోసం కొబ్బరి ఆకులు, తాటాకులు తేవడం కూడా ముఖ్యమైన ఘట్టమే. వధువు తండ్రి బండి కట్టి ఎడ్లను అదిలిస్తుంటే తల్లి నుదుట పెద్ద బొట్టు పెట్టుకుని ఎదురు రావడం ఓ సంతోషకరమైన ఘట్టం. తాజా కొబ్బరాకుల పచ్చి వాసనతో పచ్చటి పందిరి సిద్ధమయ్యేది. గెలవేసిన అరటి చెట్లు ద్వారపాలకుల్లా ఠీవిగా కొలువుదీరేవి. మామిడి తోరణాలు ఆరడుగుల ఆజానుబాహుల నుదుటిని తాకి పలకరిస్తుంటే.. అంతగా ఎదిగిన సంగతి గుర్తొచ్చి మురిసిపోతూ, మామిడి తోరణం కింద ఒదిగి నడిచేవాళ్లు. అలాంటి పందిరిని రంగుల షామియానా మింగేసింది. ఇప్పుడు మళ్లీ సంప్రదాయపు ట్రెండులో భాగంగా పెళ్లికి ఇంటి ముందు పందిరి వేయడం అనే ముచ్చట అందరినీ మురిపిస్తోంది.

**తన గంగడోలుతో ఆడుకున్న పాపాయి పెళ్లి కూతురవుతోందని ఆ ఇంటి ఎడ్లకు ఎలా తెలుస్తుందో ఏమో! ఎప్పుడూ మొరాయించే ఎడ్లు కూడా ఆ రోజు తలలూపుతూ ఉల్లాసంగా కదిలేవి!**

## పెళ్లి మండపం

ఒకప్పుడు ఇంటి ముందు వేసిన పెళ్లి పందిరే పెళ్లి మండపం. వచ్చేవారు ఎక్కువ మంది ఉంటే ఊరి ఆలయంలోని దేవుని మండపమే కల్యాణవేదిక. ఇప్పుడు కల్యాణ వేదిక ఫంక్షన్ హాల్‌కు తరలిపోయింది. మండపం అలంకరణలో మన దగ్గర పూచే పూలకు ఆదరణ తగ్గి, కార్నేషన్, ఆర్చిడ్ వంటి పరదేశీ పూలు వచ్చి చేరాయి. పెళ్లితోపాటు నిశ్చితార్థం, రిసెప్షన్ వేదికలు కూడా ఇప్పుడు ఫంక్షన్ హాల్‌లే.



## పెళ్లి అలంకరణ

పెళ్లి అలంకరణలో కాళ్లకు పారాణితోపాటు నుదుట బాసికానికి అగ్రస్థానం ఉండేది. అందుకు తగ్గట్లే కిరీటం మీద కలికితురాయిలాగ వరుడికి పెద్ద బాసికం ఉండేది. ఆ బాసికానికి రెండు వైపులా చెంపల మీద జారుతూ పట్టుకుచ్చులు, ముఖమల్ కుచ్చులు వేళ్లాడుతుండేవి. ఇప్పుడు బాసికం నుదుటి బొట్టంత చిన్నదిగా మారిపోయింది. అప్పట్లో పెళ్లి కూతురి అలంకరణ బంధువులే చేసేవాళ్లు. కొత్తగా పెళ్లయిన యువతులు, అలంకరణ మీద ఆసక్తి ఉన్న మహిళలు చొరవగా ముందుకు వచ్చేవాళ్లు. ఇక పూల జడల్లో కనకాంబరాలు, మల్లెలు, మరువాలుండేవి. ఇప్పుడవి కనుమరుగయ్యాయి. ఆర్చిడ్స్, పేపర్ ఫ్లవర్స్, గోల్డ్ రిబ్బన్ ఫ్లవర్స్ జడలుగా అమరుతున్నాయి.



**ఇప్పుడు వధువు అలంకరణ ఒక పరిశ్రమగా మారిపోయింది. బ్రైడల్ మేకప్ బ్యూటీపార్లర్‌లో కానీ బ్యూటీషియనే మండపానికి వచ్చి మేకప్ చేయడం కానీ జరుగుతోంది.**

## పెళ్లి దండలు

పెళ్లి సీజన్‌ను బట్టి మల్లెపూలు, చేమంతులు, మరువం, కనకాంబరాలతో చిక్కగా మాలలు కట్టి, ఐదారు మాలలను కలిపి ఒత్తుగా దండ అల్లేవాళ్లు. మన దగ్గర గులాబీ తోటలు విస్తరించిన తర్వాత వధూవరుల మెడలను గులాబీ దండలు అలంకరించాయి. పీటల మీదకు వచ్చేటప్పుడు ధరించిన ఆ దండలు.. పెళ్లి పూర్తయ్యేలోపు రెక్కలు రాలి కాడలుగా మిగిలేవి. బెంగళూరు హైబ్రీడ్ గులాబీలు ఈ సమస్యని తప్పించాయి. కానీ మెడలు లాగేసేటంతటి బరువుగా ఉండేవి. పువ్వు మొత్తంతో పనేంటి రెక్కలుంటే చాలుగా అంటూ పూలరెక్కలతో దండలు అల్లే ట్రెండ్ కూడా వచ్చింది. అలాగే మెడలో ఉండీ లేనట్లుంటే ఆర్చిడ్స్, బరువైన కలువపూల దండలు వచ్చాయి. సన్నటి మల్లెల మాలలు కూడా కనిపిస్తున్నాయి.



**వధూవరుల దుస్తులకు మ్యాచింగ్ దండలు వచ్చేశాయి. ఇక్కడ వధువు చీర, జాకెట్ రంగులకే ప్రాధాన్యం. వధూవరుల దుస్తులు కనుక కాంబినేషన్‌లో ఉంటే పూలదండలు కూడా అదే రంగుల్లో ఉంటున్నాయి.**

## పెళ్లి దుస్తులు

ఒకప్పుడు వధువు పెళ్లి దుస్తుల ఎంపిక కూడా వరుడి తరపు వాళ్లదే. ‘మా అమ్మాయికి ఈ రంగు ఇష్టం’ అని వధువు తల్లి ఒక చీర చేతికి తీసుకుంటే... ‘ఆ చీరతో పెళ్లి పీటల మీద కూర్చుంటే మా బంధువులు నవ్వుతారు’ అని అబ్బాయి తరపున ఎవరో నోరుజారేవాళ్లు. ఇప్పటి వధువు.. తనకు కూడా ఇష్టాయిష్టాలున్నాయని ప్రకటించింది. కొత్తదనంలో ఎన్ని రకాల దుస్తులు మారినా.. పెళ్లి చీర ప్రత్యేకత మాత్రం చెక్కు చెదరకుండా ఉంది. అబ్బాయిలే పెళ్లి దుస్తుల శైలిని మారుస్తూ వస్తున్నారు. యాభై–అరవై ఏళ్ల కిందట అందరూ పంచెలు కట్టుకున్నారు. కాలేజ్‌లో చదివిన వాళ్లు ప్యాంటు ధరించడం అనే ట్రెండ్‌ని సెట్ చేశారు. ఎనభైల నాటికి సూట్‌లు ధరించారు. కొత్త మిలీనియంలో మన సంప్రదాయాన్ని పాటించడం అనే ఫ్యాషన్‌లో జారి పోతున్న పట్టు పంచెలతో కుస్తీలు పడుతూ, రాజస్థానీ షేర్వాణీలను ఆశ్రయిస్తున్నారు.



**మగపెళ్లి వాళ్లు హుందాగా ‘మీరే వెళ్లి అమ్మాయికి నచ్చినవి తీసుకోండి’ అని వధువు తల్లిదండ్రుల చేతిలో డబ్బు పెట్టేస్తున్నారు. పెళ్లి దుస్తుల షాపింగ్‌కి వధువు కూడా వెళ్లడం మొదలైంది.**



– వాకా మంజులారెడ్డి

## పెళ్లి ఫొటోలు

ఓ యాభై ఏళ్ల కిందట పెళ్లికి ఫొటోలు తీయించుకోవడం ఓ లగ్జరీ. అది కూడా బ్లాక్ అండ్ వైట్ ఫొటోలే. ఓ పది ఫొటోలు... తీయించుకుంటే అదే ఎక్కువ. ఎనభైలకు కలర్ రీల్ వచ్చింది. పెళ్లి చీరను ఫొటోలో చూసుకుని మురిసిపోయే చాన్స్ పెళ్లి కూతురికి వచ్చింది. వీడియో కూడా వచ్చింది. కెమెరామన్ చెప్పినట్లు పెళ్లి జరిపించాల్సిన పరిస్థితి పురోహితుడికి ఎదురైంది. అతిథులు కెమెరా టీమ్ వీపులను చూసి చూసి బోరు కొట్టి, పక్కన కూర్చున్న వాళ్లతో కబుర్లు చెప్పుకోవడంలో మునిగిపోయేవాళ్లు. అప్పుడొచ్చాయి స్క్రీన్‌లు. అతిథులకు పెళ్లిని స్క్రీన్ మీద చూసే భాగ్యం కలిగింది. డ్రోన్ కెమెరాతో కూడా పెళ్లి తంతును షూట్ చేయించుకుంటున్నారిప్పుడు.



**‘పెళ్లిని సినిమా కూడా తీయించారా’ అని అడగడంలో అమాయకత్వం, ‘తీయించాం’ అని చెప్పడంలో ఆడంబరం కొంతకాలం రాజ్యమేలాయి. క్రమంగా పెళ్లి తంతు మొత్తంలో కెమెరా టీమ్‌దే పై చేయిగా మారింది.**

## పెళ్లి వంటలు

అరిసెలు, బొబ్బట్లు, కజ్జికాయలు, బూందీ లడ్డు, జిలేబీ, వడలు, సుగీలు, పులిహోర, పాయసం, పప్పు, నెయ్యి, కాయగూరల వంటలను అరిటాకులో వడ్డించేవాళ్లు. చివరగా అరటిపండు, తమలపాకులు, వక్కపొడితో భోజనం పూర్తయ్యేది. పీటల మీద కూర్చుని ప్రశాంతంగా తినేవాళ్లు. బంతి చాపలు, టేబుళ్లు– కుర్చీలు వచ్చాయి వచ్చి వెళ్లిపోయాయి. ఇప్పుడు బరువైన ప్లేట్ చేత్తో పట్టుకుని, బరువు మోయగలిగినంత సేపు ఎంత తిన్నామో అదే భోజనం. పదార్థాలు మాత్రం బారులు తీరి ఉంటున్నాయి. మూడు రకాల స్వీట్లు, రోటీ, నాన్, పుల్కా, పూరీ, వెజ్‌టబుల్ బిరియానీ, వెజ్ ఫ్రైడ్ రైస్, చైనీస్, థాయ్, కాంటినెంటల్ వంటకాలు, ఆవకాయ అన్నం, కరివేపాకు అన్నం, పనీర్ కర్రీ, జీడిపప్పు కూర, వేపుళ్లు, వడియాలు, ఉప్పు మిరపకాయలు, ఊరగాయలు, పొడులు... నోరూరిస్తుంటాయి. భోజనానికి ముందు సలాడ్‌లు, భోజనం తర్వాత డెజర్ట్‌లు. పెళ్లి పెద్దకి మాత్రం తిన్న వారికి తిన్నంత పెట్టాలనే ఉంటుంది. అయితే కేటరింగ్ సప్లయర్లకు ట్రైనింగ్‌లో భాగంగా గరిటెలోకి కూర రాకుండా వడ్డించే నైపుణ్యం అలవడి ఉంటోంది.



**పెళ్లెప్పుడు అని అడగడానికి ‘పప్పన్నం ఎప్పుడు’ అని అడిగేవాళ్లు అప్పట్లో. పెళ్లితో అంతగా కలగలిసిపోయిన ముద్దపప్పు మాత్రం పెళ్లి భోజనాల్లో కనిపించడం లేదిప్పుడు!**

## పెళ్లి ఊరేగింపు

వరుడు మోతుబరి అయితే ఏనుగు అంబారీ మీద, మిగిలిన వాళ్లు గుర్రం మీద ఊరేగేవాళ్లు. వరుడి వెంట అతడి బంధువులు గుర్రం వెంట నడిచేవాళ్లు. గ్రామంలో ప్రతి గుడి దగ్గర ఆగి ఆ దేవుడికి కొబ్బరికాయ కొట్టి ముందుకు సాగేవాడు వరుడు. వధువు పల్లకిలో ప్రయాణమవుతుంది. పల్లకి వెంట వధువు బంధువులు తరలి వెళ్లేవాళ్లు. నడవగలిగిన వాళ్లు నడిచి వస్తుంటే, మిగిలిన వాళ్లు ఎడ్ల బండిలో అనుసరించేవాళ్లు. పెళ్లి కోసం ప్రత్యేకంగా సవారి బండ్లు ఉండేవి. పెళ్లి బండి ఎడ్లను మువ్వలు, గజ్జెలు, నల్లతాళ్లతో అలంకరించేవాళ్లు. ఇప్పుడు పూలతో అలంకరించిన టాప్‌లెస్ కారులో వధూవరుల ఊరేగింపు జరుగుతోంది. అది కూడా ఊరంతా కాదు, విడిది ఇంటి నుంచి కల్యాణ మండపం వరకే.



**పెళ్లి కూతురి వెంట పది– ఇరవై బండ్లు ఉండేవి. పెళ్లి బండ్ల సంఖ్య పెద్దదయితే... అది, వధువుకి ఆత్మీయుల బలగం అంత పెద్దదని చెప్పకుండా చెప్పడం.**

లెఫ్టినెంట్ జనరల్ మాధురి

# రక్షణ దళానికి త్రీస్టార్ డాక్టర్

సైకిల్‌పై షికారు





త్రివిధ దళాల ‘నాడీ’మణి

**డాక్టర్ మాధురీ కణిట్కర్ శనివారం న్యూఢిల్లీలో పదోన్నతిపై లెఫ్టినెంట్ జనరల్ బాధ్యతలు స్వీకరించగానే ఆమె భుజం మీదకు భారత సైన్యంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మూడు నక్షత్రాల గుర్తు వచ్చి వాలింది. రక్షణ దళాల వైద్య సిబ్బందికి కొత్త డిప్యూటీ చీఫ్ ఇప్పుడు ఆమె! భారత రక్షణ దళాల చరిత్రలో ఇంతవరకు ఇద్దరే మహిళా లెఫ్టినెంట్ జనరల్స్. మాధురి ఇప్పుడు మూడో జనరల్ కాగా.. మాధురి, ఆమె భర్త త్రీస్టార్ ఉన్న తొలి దంపతులుగా ఇక నుంచీ గుర్తింపు పొందుతారు.**

మిలటరీ రంగు చీర, జాకెట్, పైన ఆర్మీ క్యాంప్ ధరించి ఉన్న మాధురికి సైనిక దళ వైద్య సేవల (ఎ.ఎఫ్.ఎం.ఎస్) డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ అరూప్ బెనర్జీ భుజకీర్తులను తగిలిస్తున్నప్పుడు, పక్కనే ఉన్న మాధురి భర్త రాజీవ్ కణిట్కర్ కూడా ఆమె‘ఎపలెట్స్’ (భుజంపై ప్రతిష్ఠ చిహ్నాలు)ని ఎంతో గర్వంగా సవరించారు. ముందు డీజీకి అభివాదం తెలియజేసి, ఆ వెంటనే ‘థ్యాంక్యూ సర్’ అని భర్తతో అన్నారు డాక్టర్ మాధురి. రాజీవ్ కూడా సైనికాధికారే. ‘ఆర్మ్‌డ్ కోర్స్’ లో లెఫ్టినెంట్‌గా ఉండి, 2017 లో క్వార్టర్‌మాస్టర్ జనరల్‌గా త్రీ–స్టార్ హోదాలో రిటైర్ అయ్యారు. ఇప్పుడు డాక్టర్ మాధురికి కూడా త్రీస్టార్ రావడంతో భారత రక్షణ దళంలోనే తొలి త్రీస్టార్ కపుల్‌గా ఈ భార్యాభర్తలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇందుకు దక్కవలసిన అభినందనలు పూర్తిగా మాధురికే అయినప్పటికీ, ‘‘ఉద్యోగం కష్టంగా అనిపించిన పరిస్థితుల్లో.. ‘ఇలాంటప్పుడు చేసేదే ఉద్యోగం’ అని ధైర్యం చెప్పి ఆర్మీలోంచి నన్ను బయటికి రానివ్వకుండా ఆపిన నా భర్తదే ఈ క్రెడిట్ అంతా’’ అని నవ్వుతూ అన్నారు డాక్టర్ మాధురి.

### పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్

డాక్టర్ మాధురి 1982లో ‘ఆర్మీ మెడికల్ కోర్స్’ (సైనిక వైద్య దళం)లోకి వచ్చారు. ఎం.డి. చేశాక, ఎయిమ్స్‌లో పీడియాట్రిక్ నెఫ్రాలజీ (చిన్నపిల్లల మూత్రపిండ సమస్యలు)లో శిక్షణ పొందారు. ‘ప్రధానమంత్రి శాస్త్ర సాంకేతిక రంగాల వినూత్న ఆవిష్కరణల సలహా మండలి’లో సభ్యులుగా ఉన్నారు. తాజా విధుల్లోకి రాకముందు వరకు ఆర్మీలోని నార్తర్న్ కమాండ్(జమ్మూకశ్మీర్, లఢక్) వైద్యసేవల విభాగానికి అధికారిగా ఉన్నారు. ‘‘అక్కడ పని చేస్తున్నప్పుడు యుద్ధక్షేత్రంలోని ప్రతికూల పరిస్థితుల్లో వైద్య సంరక్షణ ఎంత కీలకమైన బాధ్యతో తెలిసింది. అక్కడ ఏ రోజుకారోజు స్పష్టమైన అత్యున్నత స్థాయి సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఢిల్లీ కేంద్రంగా పని చేయవలసి ఉంటుంది కాబట్టి ఆ అనుభవం ఉపయోపడుతుంది’’ అని డాక్టర్ మాధురి అన్నారు. మాధురి కణిట్కర్ కర్ణాటకలోని ధర్వార్‌లో జన్మించారు. తండ్రి చంద్రకాంత్ గోపాల్రావ్, తల్లి హేమలతా చంద్రకాంత్ ఖోట్. కణిట్కర్ దంపతులకు 1982లో పెళ్లయింది. ఇద్దరు పిల్లలు. నిఖిల్, విభూతి.



డాక్టర్ మాధురికి లెఫ్టినెంట్ జనరల్‌గా త్రీస్టార్ చిహ్నాలు తొడుగుతున్న డైరెక్టర్ జనరల్ అరూప్ బెనర్జీ. పక్కన మాధురి భర్త రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ కణిట్కర్

### ఎంబీబిఎస్‌లో గోల్డ్ మెడల్

పెళ్లయిన 36 ఏళ్లలో 12 ఏళ్లు మాత్రమే భార్యాభర్తలుగా ఉన్నారు డాక్టర్ మాధురి, రాజీవ్. మిగతా సమయమంతా భారత సైనికులుగానే ఉన్నారు. రక్షణ దళ ఉద్యోగాల్లో శిక్షణ తీసుకుంటున్నప్పటి నుంచే ఒకరిని మించిన వారొకరిగా ఉన్నారు వీళ్లు! నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుంచి రాష్ట్రపతి గోల్డ్ మెడల్‌తో బయటికి వచ్చారు రాజీవ్. మాధురి కూడా అంతే. పుణెలోని ‘ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్’లో బెస్ట్ ఎం.బి.బి.ఎస్. స్టూడెంట్‌గా రాష్ట్రపతి నుంచి గోల్డ్ మెడల్ అందుకున్నారు. తర్వాత అదే ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీకి డీన్, డిప్యూటీ కమాండెంట్ అయ్యారు. అలా అయిన తొలి మహిళా అధికారి కూడా ఆమే! శనివారం నాటి పదోన్నతితో రక్షణ దళాల్లోని లెఫ్టినెంట్ జనరల్ ర్యాంకుకు చేరిన మూడో మహిళా అధికారి అయ్యారు మాధురి. తొలి మహిళ ఎయిర్ మార్షల్ పద్మావతీ బందోపాధ్యాయ్, రెండో మహిళ వైస్ అడ్మిరల్ పునీతా ఆరోరా. వాళ్లిద్దరూ రిటైర్ అయ్యారు. సైన్యంలోని అన్ని విభాగాలలో స్త్రీ పురుష సమానత్వాన్ని కల్పించడానికి ‘పర్మినెంట్ కమిషన్’లోకి మహిళల్ని కూడా అనుమతించాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది కానీ.. భారత సైన్యంలోని మెడికల్ వింగ్‌లో మొదటి నుంచీ మహిళలకు పర్మినెంట్ కమిషన్‌లో అవకాశం ఉంది. అందువల్లే డాక్టర్ మాధురి విశిష్ట సేవలకు ఇప్పుడీ ఉన్నతస్థాయి హోదా లభించడం సాధ్యమైంది.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం
2-3-2020

# కష్టపడితే స్టార్లు అవుతారు

**- చిరంజీవి**



● ఆనంద్ ప్రసాద్, బ్రహ్మాజీ, సంజయ్, చిరంజీవి, నిత్యా శెట్టి, చెందు ముద్దు, విశ్వాంత్

''ఇప్పటి యువతరానికి నేను చెప్పేది ఒక్కటే. 100శాతం కష్టపడండి.. నమ్మకంతో ఉండండి.. విజయం సాధిస్తారు. సునీల్ లాంటి వాళ్లు కూడా మనకి ఎంతో స్ఫూర్తి. మేము ఇక్కడికి (ఇండస్ట్రీకి) రాలేమోమో? ఇక్కడ రాణించలేమేమో? అంటూ భయపడాల్సిన పరిస్థితి లేనే లేదు. ఎవరు ఏం అనుకున్నా అకుంఠిత దీక్షతో మన లక్ష్యం వైపు దూసుకెళ్లిపోండి.. ప్రతి ఒక్కరూ ఇక్కడ సూపర్ స్టార్లు.. మెగాస్టార్లు అవుతారు'' అని హీరో చిరంజీవి అన్నారు. విశ్వాంత్ దుద్దుంపూడి, నిత్యా శెట్టి, సంజయ్‌రావు ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఓ పిట్ట కథ'. 'ఇట్స్ ఎ లాంగ్ స్టోరీ' అన్నది ఉపశీర్షిక. చెందు ముద్దు దర్శకత్వంలో వి. ఆనంద్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ– ''ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో పరిస్థితులు చాలా మారిపోయాయి.. కేరవ్యాన్ లాంటి సౌకర్యాలు అవసరానికి వాడుకోవాలే కానీ విలాసాలకు కాదు. ఈ విషయాల్లో మార్పు రావాలి. హీరో, హీరోయిన్ లొకేషన్‌లో ఉన్నప్పుడే పనికి న్యాయం చేస్తున్నట్లు. కొరటాల శివ దర్శకత్వంలో నేను చేస్తున్న 'ఆచార్య' సినిమా ఉదయం 7గంటలకు షూటింగ్ అంటే ఆ టైమ్‌కి నేను మేకప్‌తో రెడీగా ఉంటున్నా.. నిర్మాతల సంతోషాన్ని చూడాల్సిన బాధ్యత నటీనటులందరిది. చిన్న సినిమాలకు థియేటర్ల కొరత, సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్‌గారు ఆదేశించడంతో నేను, నాగార్జున, మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కలిసి మా వంతు ప్రయత్నం చేస్తున్నాం'' అన్నారు.

చందు ముద్దు మాట్లాడుతూ– ''ఓ పిట్టకథ'ని ముందుకు తీసుకెళ్లిన బ్రహ్మాజీ, ఆనంద్ ప్రసాద్‌గార్లకు కృతజ్ఞతలు'' అన్నారు. ''నిండు మనసుతో ఆశీర్వదించడానికి వచ్చిన చిరంజీవిగారికి మేం రుణపడి ఉంటాం'' అన్నారు వి. ఆనంద్ ప్రసాద్. ఈ వేడుకలో హీరోలు సందీప్ కిషన్, ఆనంద్ దేవరకొండ, సత్యదేవ్, నటులు సునీల్, బ్రహ్మాజీ, ఉత్తేజ్, నటీమణులు అనసూయ, వర్ష, కెమెరామేన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభాస్‌తో జతకడతారా?



● ప్రభాస్

'మహానటి' ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి ప్రభాస్ కమిట్ అయిన సంగతి తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో ఈ సినిమా ఉండబోతోందట. ఈ సినిమాలో హీరోయిన్‌గా దీపికా పదుకోన్ పేరు వినిపిస్తోంది. అశ్వనీ దత్ నిర్మాణంలో ప్యాన్ ఇండియా సినిమాగా తెరకెక్కించనున్నారు. దీపికా పదుకోన్ అయితే ఈ సినిమాకు బావుంటుందని ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నారట చిత్రబృందం. ఒకవేళ దీపిక ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తే ఇదే తన తొలి తెలుగు సినిమా అవుతుంది. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ–ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

● దీపికా పదుకోన్



● సూర్య

## సూర్య కత్తి

కొన్ని కాంబినేషన్స్‌లో ఎన్ని సినిమాలు వచ్చినా మరిన్ని కావాలనిపిస్తాయి. తమిళంలో అలాంటి కాంబినేషనే హీరో సూర్య–దర్శకుడు హరిలది. ఈ ఇద్దరూ కలసి గతంలో 5 సినిమాలు (వేల్, ఆరు, సింగం 1, 2 , 3) చేశారు. తాజాగా ఆరో సినిమా కోసం కలిశారు. ఈ సినిమాకు 'అరువా' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. అరువా అంటే కత్తి అని అర్థం. ఏప్రిల్‌లో సెట్స్‌కు మీదకు వెళ్లనున్న ఈ సినిమాను ఒకే షెడ్యూల్‌లో పూర్తి చేయనున్నారట. ఈ ఏడాది దీపావళికి ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్టు గ్రీన్ స్టూడియోస్ నిర్మాణ సంస్థ తెలిపింది. డి. ఇమ్మాన్ సంగీత దర్శకుడు.

## బ్యాచ్‌లర్ వస్తున్నాడు



● అఖిల్

అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయిక. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాస్, వాసు వర్మ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను వేసవిలో విడుదల చేస్తున్నాం అని ప్రకటించింది చిత్ర బృందం. తాజాగా మే 22న ఈ సినిమాను రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యారని సమాచారం. గోపీ సుందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలోని తొలిపాట 'మనసే మనసే..' నేడు విడుదల కానుంది.

# నా సినిమా విజయం కంటే ఎక్కువ సంతోషపడ్డా

**- వరుణ్ తేజ్**



● నాగవంశీ, వరుణ్ తేజ్, రష్మికా మందన్నా, నితిన్, వెంకీ కుడుముల

''ఈ వేడుకకు అతిథిలా రాలేదు. నితిన్ సక్సెస్‌ని ఎంజాయ్ చేయడానికి తన ఫ్రెండ్‌లా వచ్చాను. నా సినిమా సక్సెస్ అయితే ఎంత హ్యాపీగా ఫీల్ అవుతానో నితిన్ సక్సెస్‌ను ఇంకా ఎక్కువ హ్యాపీగా ఫీల్ అవుతున్నాను'' అన్నారు వరుణ్ తేజ్. నితిన్, రష్మికా మందన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భీష్మ'. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ సినిమా సక్సెస్ మీట్‌ను వైజాగ్‌లో నిర్వహించారు. ఈ వేడుకకు హీరో వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ– ''ఇండస్ట్రీలో రెండో సినిమా కూడా హిట్ కొట్టడం కష్టమంటారు. వెంకీ పాసయ్యాడు. రష్మిక నటించిన సినిమాలన్నీ విజయం సాధిస్తున్నాయి. తనతో కలసి త్వరలోనే యాక్ట్ చేయాలనుంది. మణిశర్మగారి అబ్బాయి సాగర్ మహతి మంచి సాంగ్స్ ఇచ్చారు. నితిన్ నేను ఈ మధ్య మంచి ఫ్రెండ్స్ అయ్యాం. అతనితో ఈ స్నేహం కొనసాగాలనుకుంటున్నాను. సింగిల్ అని చెప్పి రిలీజ్ కంటే ముందే ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. అందర్నీ మోసం చేశాడు''అన్నారు. నితిన్ మాట్లాడుతూ – ''ఈ నిర్మాణసంస్థతో 'అ ఆ' చేశాను. పెద్ద హిట్ అయింది. నాలుగేళ్ల తర్వాత నాకు హిట్ వచ్చింది. దీనికి కారణమైనన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్. రష్మికతో నటన, డ్యాన్సులు నెవ్వర్ బిఫోర్ ఎవ్వర్ ఆఫ్టర్'' అన్నారు. రష్మిక మాట్లాడుతూ – ''భీష్మ' మంచి విజయం సాధించినందుకు సంతోషంగా ఉంది. నితిన్‌గారు, వెంకీగారు అంటే నాకు చాలా ఇష్టం'' అన్నారు. ''ఈ అవకాశం ఇచ్చిన నితిన్‌గారికి, నిర్మాత వంశీగారికి థ్యాంక్స్'' అన్నారు దర్శకుడు వెంకీ కుడుముల.

## కరణం మల్లేశ్వరి బయోపిక్



● కరణం మల్లేశ్వరి

క్రీడాకారుల జీవితాన్ని కథగా స్క్రీన్ మీద చూపించే ట్రెండ్ ప్రస్తుతం అన్ని ఇండస్ట్రీల్లో కనిపిస్తోంది. తాజాగా ఓ బయోపిక్ రెడీ అవుతోంది. వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మన దేశానికి తొలి మెడల్ తీసుకొచ్చిన కరణం మల్లేశ్వరిపై ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాకు సంజనా రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. కోన వెంకట్, యంవీవీ సత్యనారాయణ నిర్మించనున్నారు. శ్రీకాకుళంలోని ఓ మారుమూల గ్రామం నుంచి దేశానికి తొలి ఒలింపిక్ పతాకాన్ని తీసుకొచ్చిన కరణం మల్లేశ్వరి కథ చాలా స్ఫూర్తిదాయకంగా ఉంటుందని చిత్ర బృందం భావించిందట. సుమారు 50 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. ఈ సినిమాలో మల్లేశ్వరి పాత్రలో ఎవరు నటిస్తారనే విషయాన్ని ఇంకా ప్రకటించలేదు.



● సంజనా రెడ్డి

## రొమాంటిక్ రైడ్



● విజయ్ దేవరకొండ

ముంబై వీధుల్లో బైక్‌పై రొమాంటిక్ రైడ్‌ను ఆస్వాదిస్తున్నారు విజయ్ దేవరకొండ, అనన్యా పాండే. ఇదంతా పూరి జగన్నాథ్ రూపొందిస్తున్న 'ఫైటర్'(వర్కింగ్ టైటిల్) సినిమా కోసం. ఛార్మి, పూరి, కరణ్ జోహార్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబై నగరంలో జరుగుతోంది. బైక్ రేసింగ్‌కి సంబంధించిన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. బైక్‌పై అనన్యా పాండేతో రేస్‌లో పాల్గొన్నారు విజయ్. మరి రేస్ గెలిచారా? వేచి చూడాలి. బాక్సింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కుతోంది.

# వాస్తవ సంఘటనల పలాస



● కరుణ కుమార్

''స్వచ్ఛ భారత్‌కి నేను చేసిన 'చెంబుకు మూడింది' లఘు చిత్రం జాతీయ స్థాయిలో రెండో బహుమతి తెచ్చుకోవడం నా జీవితంలో కీలక మలుపు. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి కేటీఆర్‌గార్లు అప్పుడు నన్ను సన్మానించారు. కేటీఆర్‌గారి ప్రోత్సాహంతో చాలా ప్రభుత్వ యాడ్స్ చేశాను. 'పలాస ' నా మొదటి సినిమా అవుతుందనుకోలేదు'' అన్నారు దర్శకుడు కరుణ కుమార్. రక్షిత్, నక్షత్ర జంటగా కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పలాస 1978'. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 6న విడుదల కానుంది. కాగా 'పలాస 1978' ట్రైలర్‌ని రానా ట్విట్టర్‌లో విడుదల చేసి, 'ఈ చిత్రం విజువల్స్, నేపథ్యం చాలా కొత్తగా ఉన్నాయి'' అన్నారు. కరుణ కుమార్ మాట్లాడుతూ– ''1978 ప్రాంతంలో శ్రీకాకుళం జిల్లాలోని పలాసలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన సినిమా ఇది. తమ్మారెడ్డి భరద్వాజగారికి కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం అని, నిర్మాత ప్రసాద్‌గారిని పరిచయం చేశారు. ఇది ఒక వ్యక్తి కథో, కుటుంబం కథో కాదు.. ఇది ఒక సమూహం కథ. ఎవరి మనోభావాలు దెబ్బ తినకుండా పలాస కథను తెరకెక్కించాం. ఈ చిత్రంలో ఒక నిజాయతీ కథ కనిపిస్తుంది. సెన్సార్ బోర్డ్‌వారు ఎక్కువ కట్స్ సూచించడంతో రివైజ్ కమిటీకి వెళ్లాం.. వాళ్లు మా చిత్రాన్ని చూసి, ప్రశంసించారు'' అన్నారు.



● వీవీ వినాయక్, రామ్‌చరణ్, అల్లు అరవింద్, టి. సుబ్బరామిరెడ్డి, వినాయకరావు

# ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగే ఉంటారు చిరంజీవి

**- టి. సుబ్బరామిరెడ్డి**

''సముద్రమంత లోతున్న మంచితనం, శిఖరమంత ఎత్తున్న గొప్పతనం.. నా జీవితంలో మంచికీ చెడుకి మధ్య నిల్చున్న వ్యక్తి చిరంజీవి'' అన్నారు దర్శకుడు రాఘవేంద్రరావు. చిరంజీవి జీవితంపై సీనియర్ జర్నలిస్ట్ వినాయకరావు రచించిన 'మెగాస్టార్– ది లెజెండ్' పుస్తకాన్ని 'కళాబంధు' టి.సుబ్బిరామిరెడ్డి ఆవిష్కరించి, దర్శకుడు రాఘవేంద్రరావుకి తొలి ప్రతిని అందజేశారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ– ''హిమాలయాలంత ఎత్తుకి ఎదిగినా ఒదిగే ఉంటారు చిరంజీవి. అందుకే ఆయన 40 ఏళ్లుగా స్టార్‌గా ఉన్నారు. మరో 20 ఏళ్లు కూడా ఉంటారు'' అన్నారు. ''మొదటి 3–4 ఏళ్లే మేమిద్దరం బావ–బామ్మర్దిగా ఉన్నాం. ఆ తర్వాత స్నేహితుల్లా ప్రయాణించాం. చిరంజీవిగారితో నాది 40ఏళ్ల ఏమోషనల్ జర్నీ. కష్టపడే తత్వానికి నిదర్శనం ఆయన'' అన్నారు అల్లు అరవింద్. ''ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి జీవితాన్ని పుస్తకంగా మలచడానికి నా శాయశక్తులా ప్రయత్నించాను. ఈ పుస్తకం వెనుక మూడేళ్ల ప్రయాణం ఉంది'' అన్నారు వినాయకరావు. ''చిన్నతనంలో నాన్న ఎంత కష్టపడి పని చేసేవారో చూసే అవకాశం మాకు దొరికేది కాదు. ఇప్పటికీ మాకు ఏం అందించాలని ఆలోచిస్తూ ఉంటారు. ఈ పుస్తకం ద్వారా నాన్నకు మరింత దగ్గరవుతాను అనుకుంటున్నాను. వినాయకరావుగారికి మా కుటుంబం, అభిమానులందరి తరపున ధన్యవాదాలు'' అన్నారు రామ్‌చరణ్. మురళీమోహన్, దర్శకుడు బి.గోపాల్, వీవీ వినాయక్, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సరికొత్త స్క్రీన్‌ప్లే

విక్రమ్ శివ, ప్రగతి హీరోహీరోయిన్లుగా 'స్క్రిప్ట్ డాక్టర్‌గా ప్రసిద్ధిపొందిన కెఎల్ ప్రసాద్ నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'స్క్రీన్‌ప్లే'. 'ఆఫ్ ఏన్ ఇండియన్ లవ్ స్టోరీ' అన్నది క్యాప్షన్. డాక్టర్ అరుణకుమారి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని పలువురు సినీ విమర్శకులకు, రచయితలకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ శివ, ప్రగతి, సంగీత దర్శకురాలు యంయంశ్రీలేఖ, కెఎల్ ప్రసాద్ మాట్లాడారు. ''పలు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో మా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి. నటీనటుల నటన, సినిమా స్క్రీన్‌ప్లే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని చిత్రబృందం పేర్కొంది.



● ప్రగతి



● శుభాంగి, రమేష్

## బంజారా భాషలో...

రమేష్ చౌహాన్, శుభాంగి జంటగా కపిల సుబ్బారావు దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'రాం నాయక్'. శ్రీ తుల్జా భవానీ ఫిల్మ్ సిటీ పతాకంపై లక్ష్మీ చౌహాన్ నిర్మించనున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రమేష్ చౌహాన్ మాట్లాడుతూ– ''బంజారా భాషలో నిర్మించనున్న ఈ చిత్రంలో 5 పాటలు ఉంటాయి. సంగీత దర్శకుడు భోలే షావలి ఈ పాటలకు ప్రాణం పోశారు. చక్కటి కథతో కపిల సుబ్బారావు తెరకెక్కించనున్నారు'' అన్నారు. ''మా సినిమా రెగ్యులర్ షూటింగ్ రేపటి నుంచి మొదలుకానుంది. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్ చిత్రీకరించనున్నాం'' అన్నారు కపిల సుబ్బారావు. ''గతంలో సూపర్ హిట్ అయిన బంజారా చిత్రం 'గోర్ జీవన్' తర్వాత అంతగా మనసు లగ్నం చేసి 'రాం నాయక్' చిత్రానికి సంగీతం సమకూర్చాను. నాకు మంచి పేరు తీసుకువస్తుందనుకుంటున్నాను'' అన్నారు భోలే షావలి. ఈ చిత్రానికి కెమెరా: శ్రావణ్ కుమార్.



● ఆండ్రియా

## ఆ సీన్లు చేసుండాల్సింది కాదు!

''ఏదైనా ఒక క్యారెక్టర్ బాగా చేస్తే ఆ తర్వాత అందరూ అలాంటి పాత్రలకే అడుగుతారు. చేసిన పాత్రలే చేస్తే నాకు బోర్ కొడుతుంది. చూసే ప్రేక్షకులు కూడా ఒకే రకమైన పాత్రల్లో కనిపిస్తోంది అంటారు'' అంటున్నారు ఆండ్రియా జర్మియా. గాయనిగా, నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఆండ్రియా 'వడ చెన్నై' అనే తమిళ సినిమాలో కొన్ని బోల్డ్ సీన్స్‌లో నటించారు. 2018లో ఈ చిత్రం విడుదలైంది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకూ ఆ సినిమాలో ఆమె చేసిన చంద్ర తరహా పాత్రలకే అడుగుతున్నారట. ఆ విషయం గురించి ఆండ్రియా మాట్లాడుతూ – ''వడ చెన్నై' సినిమాలో నా కో–స్టార్ అమీర్‌తో కలిసి బెడ్‌రూమ్ సీన్స్ చేశాను. ఆ రొమాంటిక్ సీన్స్ చేసినందుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను. ఎందుకంటే చాలామంది దర్శకులు అలాంటి పాత్రలతో నా దగ్గరకు వస్తున్నారు. నాకిష్టం లేదు. ఒకవేళ రొమాంటిక్ సీన్స్ లేకుండా మంచి పాత్రకి అవకాశం వస్తే పారితోషికం తగ్గించుకోవడానికి కూడా నేను రెడీ'' అన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. విజయ్ హీరోగా రూపొందిన 'మాస్టర్'లో నటించారు ఆండ్రియా. ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ప్రస్తుతం 'కా', 'వట్టమ్', 'మాళిగై', 'అరణ్మనై' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారామె.

# ఆలోచింపజేసే పాయింట్‌తో



● శైలేష్, జ్ఞానేశ్వరి

''పెద్ద సినిమా, చిన్న సినిమా అనేది నేను నమ్మను. మంచి సినిమానా? కాదా? అనేది నమ్ముతాను. 'మిస్టర్ అండ్ మిస్' ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను'' అన్నారు డైరెక్టర్ నాగ్ అశ్విన్. శైలేష్ సన్నీ, జ్ఞానేశ్వరి జంటగా అశోక్ రెడ్డి దర్శకత్వంలో క్రౌడ్ ఫండెడ్ సినిమాగా తెరకెక్కిన 'మిస్టర్ అండ్ మిస్' ట్రైలర్‌ని నాగ్ అశ్విన్ విడుదల చేశారు. అశోక్ రెడ్డి మాట్లాడుతూ– ''కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా నిర్మించాం. ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. సుధీర్ వర్మ రైటింగ్, మనోహర్ కెమెరావర్క్, కార్తీక్ ఎడిటింగ్, యశ్వంత్ నాగ్ మ్యూజిక్ మా సినిమాకి హైలైట్స్. ఈ నెలాఖరులో సినిమా విడుదల కానుంది'' అన్నారు. ''మా సినిమాకు క్రౌడ్ సపోర్ట్ ఉంది.. సినిమా విడుదల తర్వాత ప్రేక్షకుల సపోర్ట్ కూడా ఉంటుందని నమ్ముతున్నా'' అన్నారు శైలేష్ సన్నీ. ''మా ట్రైలర్ చూస్తుంటే భావోద్వేగంగా ఉంది. ఈ సినిమాలోని పాయింట్ అందర్నీ ఆలోచింపజేస్తుంది. అశోక్‌గారు సినిమా చాలా బాగా తీశారు'' అన్నారు జ్ఞానేశ్వరి. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: ప్రవీణ్ సాగి.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
2-3-2020

పరిపరిశోధన

# కంటినిండా నిద్రకు కుంకుమ పువ్వు



ఎంత ప్రయత్నించినా రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదా? తెల్లవార్లూ మంచంపై పొర్లుదండాలు పెడుతున్నారా? కంటి నిండా నిద్రపోవాలంటే ఏం చేయాలో చెప్పండర్రా అని అందరినీ అడుగుతున్నారా? చాలా సింపుల్. కాసింత కుంకుమపువ్వు తీసుకుంటే సరిపోతుందంటున్నారు ఆస్ట్రేలియాలోని మర్డాక్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. కుంకుమ పువ్వు నుంచి తీసిన పదార్థం ఒకటి నిద్రకు బాగా ఉపకరిస్తుందని వీరు ప్రయోగపూర్వకంగా గుర్తించారు. పద్దెనిమిది ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్యవయస్కులు కొందరిని ఎంపిక చేసి వారిలో కొందరికి రోజూ 14 మిల్లీగ్రాముల కుంకుమపువ్వు నుంచి తీసిన పదార్థాన్ని ఇచ్చారు. మిగలిన వారికి ఉత్తుత్తి మాత్రలు ఇచ్చారు. వీరందరికీ నిద్రలేమి సమస్యలు ఉన్నాయని, ముందుగానే తెలుసు. అంతేకాకుండా వీరు ఏ రకమైన మందులు తీసుకోవడం లేదు. నాలుగు వారాల పాటు జరిగిన పరీక్ష తరువాత పరిశీలించినప్పుడు కుంకుమ పువ్వు నుంచి తీసిన పదార్థాన్ని వాడుతున్న వారికి మెరుగైన నిద్ర పడుతున్నట్లు తెలిసింది. ఏడు రోజుల తరువాతి నుంచే తమ నిద్ర నాణ్యతలో మెరుగుదల కనిపించిందని ప్రయోగంలో పాల్గొన్న వారు చెప్పారు. పైగా కుంకుమ పువ్వు నుంచి తీసిన పదార్థాన్ని వాడటం ద్వారా ఎలాంటి దుష్ప్రభావమూ కనిపించలేదు కూడా. ఇప్పుడు మరింత విస్తత స్థాయిలో మరోసారి ప్రయోగాలు నిర్వహించి ఫలితాలను నిర్ధారించుకుంటామని అడ్రియన్ లోప్రెసెటీ అనే శాస్త్రవేత్త తెలిపారు.

# గాలిని శుభ్రం చేసే దీపం



ముందుగా ఫొటో చూసేయండి. ఎంతో పొందికగా అందంగా ఉంది కదూ.. మంచం వెనుకవైపున ఉన్న బెడ్‌ల్యాంప్‌ను చూశారా? అదేనండి.. తెల్లటి గీతలతో ఇంద్ర ధనస్సులా కనిపిస్తున్నదే. ముచ్చటగా ఉంది కదూ.. కాకపోతే ఇది కేవలం బెడ్‌ల్యాంప్ మాత్రమే కాదు. పరిసరాల్లోని గాలిని శుభ్రం చేసి స్వచ్ఛమైన గాలిని అందించే ఎయిర్ ఫిల్టర్ కూడా. సుగో అనే సంస్థ గులినీ ల్యాంప్ స్కేప్ పేరుతో తయారు చేసిన ఈ బెడ్‌ల్యాంప్ ఫొటో కేటాలసిస్ అనే టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తాయి. ఈ కోలి, సాల్మొనెల్లా వంటి హానికారక బ్యాక్టీరియాను 99.9 శాతం వరకూ శుద్ధి చేయగల సామర్థ్యం దీని సొంతం. అంతేకాదు. వాయుకాలుష్యంలో ప్రధానమైనటువంటి కార్బన్ డైయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, ఫార్మాల్డీహైడ్‌లను, దుర్వాసన కలిగించే కణాలను కూడా శుభ్రం చేయగలదు. అతి తక్కువ విద్యుత్తును వాడే ఎల్‌ఈడీలతో కూడిన బెడ్‌ల్యాంప్ వెలిగినప్పుడు అడుగుభాగంలో ఉండే పరికరంలోని ప్రత్యేకమైన పదార్థాలు చైతన్యవంతమై పరిసరాల్లోని గాలిని శుభ్రం చేస్తాయన్నమాట. ప్రస్తుతానికి ఈ గులియన్ ల్యాండ్ స్కేప్ బెడ్‌ల్యాంపుల వాణిజ్య ఉత్పత్తి కోసం నిధుల సమీకరణ జరుగుతోంది. అది పూర్తయిన వెంటనే అందరికీ అందుబాటులోకి వస్తుంది.

పరిచయం భారతి ఖుటి, సేంద్రియ రైతు



**ఈ ఫొటోలో గేదె పాలు పితుకుతున్న యువతి.. ఆ ఫొటోలో ట్రాక్టర్ ఎక్కి పొలం దున్న అమ్మాయి.. కుడిపక్క ఫొటోలో ఎయిర్ హోస్టెస్ ఐడి కార్డు ధరించి ఉన్నదీ... ఒక్కరే. అదే అమ్మాయి మరో ఫొటోలో భర్త, కొడుకుతోపాటు పొలంలో పని చేస్తోంది. ఇంకో ఫొటోలో గుర్రం సవారీకి సిద్ధమవుతోంది. ఆమే.. భారతి ఖుటి. ఆమె గురించి గుజరాత్ రాష్ట్రంతోపాటు, దేశమంతా ఎందుకు మాట్లాడుకుంటోందనే విషయాన్ని ఈ ఫొటోలే చెప్తున్నాయి.**

# భూమి బిడ్డ

భారతిది గుజరాత్ రాష్ట్రం, పోర్‌బందర్ జిల్లాలోని బేరాన్ గ్రామం. ఆమె 2010లో రామ్‌దేని పెళ్లి చేసుకుని లండన్‌కు ప్రయాణమైంది. రామ్‌దే అప్పటికే అక్కడ మేనేజిరియల్ ఎగ్జిక్యూటివ్‌గా మంచి ఉద్యోగంలో ఉన్నాడు. భారతి అక్కడికి వెళ్లి ట్రావెల్ అండ్ టూరిజమ్‌లో గ్రాడ్యుయేషన్ కోర్సు చేసింది. బ్రిటిష్ ఎయిర్‌వేస్‌లో ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగంలో చేరింది. ఈస్ట్ లండన్‌లోని స్టాట్‌ఫోర్డ్‌లో నివాసం. 2014లో కొడుకు 'ఓమ్' పుట్టాడు. సంతోషంగా సాగిపోతోంది జీవితం. ఆ సమయంలో సొంతూరులో ఉన్న భారతి అత్తమామల ఆరోగ్యం ఆందోళనకు గురి చేసింది. రామ్‌దే, భారతి ఇద్దరూ పెద్దవాళ్లకు మంచి వైద్యం చేయించి స్వస్థత చేకూరే వరకు అంటిపెట్టుకుని ఉండి, తిరిగి యూకే వెళ్లారు. అయితే ఈ వయసులో అమ్మానాన్నలను ఇండియాలో ఉంచి తాము యూకేలో స్థిరపడడం కష్టంగా తోచింది రామ్‌దేకి. అదే విషయాన్ని భార్యతో చెప్పాడు. అందుకామె సరేనంది. అలా ఐదేళ్ల కిందట బేరాన్‌కి తిరిగి వచ్చేశారు.

**విమానం దిగి.. ట్రాక్టర్ ఎక్కింది**

మొత్తం రెండు వందల కుటుంబాలు నివసించే గ్రామం బేరాన్. దాదాపుగా అందరూ వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ వృత్తుల మీదనే జీవిస్తున్నారు. పంట పొలాలన్నీ రసాయనాలతో కలుషితమై ఉన్నాయి. దాదాపుగా ఓ నలభై ఏళ్ల కిందట... హరిత విప్లవంలో భాగంగా ఇన్‌సెంటివ్ మెన్యూర్ స్కీమ్‌ను పరిచయం చేసింది ప్రభుత్వం. అందుబాటులో ఉన్న సాగునేల దేశం మొత్తానికి కడుపు నింపేటంతటి ఆహారధాన్యాలను పండించడం కోసం చేసిన ప్రయత్నం అది. రసాయనిక ఎరువుల వాడకాన్ని రైతులకు పనిగట్టుకుని నేర్పించింది కూడా ప్రభుత్వమే. ఆ ప్రయత్నం విజయవంతమైంది. మన దేశం ఆహారభద్రత సాధించగలిగింది. కానీ పంట నేలలను నిస్సారం చేసుకుంది. ఇప్పుడు మరో విప్లవం రావాలి. అదే ఆర్గానిక్ రివల్యూషన్. ఈ వినూత్న విప్లవాన్ని తమ గ్రామంలో తొలి అడుగు వేయించింది భారతి.

**పంటకు తోడు పాడి**

ఏడు ఎకరాల భూమిలో వేరుశనగ, జీలకర్ర, ధనియాలు, నువ్వులు, జొన్నలు పండిస్తోంది. రసాయన ఎరువుల ప్రస్తావనే లేకుండా పూర్తిగా సేంద్రియ ఎరువులుతో వ్యవసాయం చేస్తున్నారు ఈ దంపతులు. వ్యవసాయానికి అనుబంధంగా గేదెలతో డైరీ ఫార్మ్ కూడా పెట్టి పాడికి –పంటకు మధ్య ఉన్న పరస్పర ఆధారిత బంధాన్ని రుజువు చేస్తున్నారు. తన డైలీ రొటీన్‌ను స్వయంగా షూట్ చేసి సోషల్ మీడియాలో పెట్టి, వ్యవసాయంలో సంపాదన యూకేలో ఉద్యోగంలో మిగిలే డబ్బు కంటే ఎక్కువగానే ఉంటోందని చెబుతోంది భారతి. ఈ దంపతులు ఇప్పుడు ఆ గ్రామస్థులకు రోల్ మోడల్స్. వీళ్ల గురించి తెలిసిన వాళ్లు 'వీళ్లు బేరాన్ గ్రామానికి మాత్రమే కాదు మొత్తం దేశానికంతటికీ రోల్ మోడల్స్' అని ముక్తకంఠంతో ప్రశంసిస్తున్నారు.

–మంజీర

## నేల మీద సాము

అది 2015. లండన్‌లో ఉంటున్న రామ్‌దే నిర్ణయాన్ని సొంతూరిలో ఉన్న బంధువులందరూ వ్యతిరేకించారు. అప్పుడు రామ్‌దేకు అండగా నిలిచింది అతడి భార్య భారతి మాత్రమే. భారతి ఇచ్చిన భరోసాతో ఇండియా వచ్చేశాడు రామ్‌దే. ఇప్పుడు గుజరాత్‌లోని రామ్‌దే సొంతూరు బేరాన్ గ్రామస్థులతోపాటు ఆ రోజు నవ్విన బంధువులు కూడా భారతి ట్రాక్టర్ ఎక్కి దుక్కి దున్నుతుంటే కళ్లారా చూస్తున్నారు. ఆ దృశ్యాన్ని వీడియోలు తీసి యూ ట్యూబ్‌లో పెడుతున్నారు. యువత కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ అంటూ ఖండాలు దాటిపోతుంటే... భారతి వాటిని వదిలేసి మన నేలను మించిన ఉపాధి హామీ మరెక్కడా ఉండదని నిరూపిస్తోందని ఆమె వీడియోలు చూసిన వాళ్లు పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ తరం నేల విడిచి సాము చేస్తుంటే భారతి నేల మీద సాము చేస్తోంది. అదే ఆమె సక్సెస్ అని మరి కొందరు మెచ్చుకుంటున్నారు. లండన్‌లో మంచి ఉద్యోగం, అక్కడే స్థిరపడే అవకాశాన్ని వదులుకుని జన్మభూమికి వచ్చి పొలం దున్నుతున్న ధీర అని ఆమెకు ట్యాగ్‌లైన్ ఇస్తున్నారు.



● లండన్ నుంచి ఇండియాకు వచ్చిన తొలినాళ్ల ఫొటో

స్ఫూర్తి



వీడియో పాటలో శివభక్తుడిగా నటించిన శ్రీనివాస్

# చీకటి దారిలో వెలుగు పాట

**అమ్మానాన్నలు లేక అనాథగా మిగిలినా.. రెండు కళ్లు శాశ్వతంగా చీకటిమయమైనా బతుకుపోరులో వెలుగు దారులు వెతుక్కుంటూ ముందుకుసాగుతున్నాడు. అన్నీ ఉన్నా ఇంకా ఏదో లేదనే నిరాశవాదులకు మిట్టపల్లి శ్రీనివాస్ జీవితం ఒక దిశా నిర్దేశం చేస్తుంది.**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిప్పయ్యపల్లెకు చెందిన గాయకుడు మిట్టపల్లి శ్రీనివాస్. తూర్పున సూర్యుడు ఉదయించినా.. తనకు మాత్రం బతుకంతా చీకటే. బాల్యంలోనే అమ్మానాన్నల మరణం అతడిని ఒంటరిని చేసింది. కష్టాలు నీడలా వెన్నంటి ఉన్నా.. కళ్లులేని చీకటి బతుకు వద్దని ఏనాడు అనుకోలేదు అతడు. బతుకు దారిలో వెలుగు రాదనీ తెలిసినా.. తన గాత్రంతో లోకాన్ని చూడాలనే సంకల్పం తనను ముందుకు నడిపిస్తోందంటున్నాడు మిట్టపల్లి శ్రీనివాస్.

**మట్టి వినాయకుల తయారీ..**

అనాథగా మిగిలి ఒంటిరిగా అద్దె ఇంట్లో ఉంటూ తన కాళ్ల మీద తాను నిలబడుతున్నాడు. ఇంటి పనులతోపాటు బట్టలు ఉత్కుకోవడం దగ్గరి నుంచి అన్నం, కూర వండుకుని తినడం వంటి అన్ని పనులు తానే స్వయంగా చేసుకుంటాడు. చిన్నతనం నుంచే పర్యావరణాన్ని కాపాడాలంటూ అవగాహన కల్పిస్తూ, రెండు కళ్లు చూడలేకపోయినా పద్నాలుగేళ్లుగా మట్టి వినాయకులు తయారుచేసి వాటిని విక్రయిస్తూ ఎవరిపైనా ఆధారపడకుండా ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.



మిట్టపల్లి శ్రీనివాస్

**శాపమైన పేదరికం**

నిరుపేద కుటుంబంలో పుట్టిన శ్రీనివాస్‌కు తన పదమూడో ఏట నుంచే కష్టాలు మొదలయ్యాయి. అందరి పిల్లలాగే పుస్తకాలతో బడికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి చేరాక అమ్మతో బీడీలకు దారం కట్టేవాడు. నాన్న బీమండిలో సాంచాలు నడుపుతూ తన రోగాలకు, నొప్పులకు పోను మిగిలిన సొమ్ముతో ఆరు నెలలకు ఒకసారి ఇంటికి వచ్చేవాడు. పదమూడేళ్ల వయసులో ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు ఎడమ కన్నులో పువ్వు ఏర్పడి కన్ను మసకగా కనపడడం మొదలైంది. కానీ రెక్కాడితేగాని, డొక్కాడని బతుకులు. తన అంధత్వానికి పేదరికం ఎలా నిలిచిందో చెబుతూ – 'నాన్న లక్ష్మిరాజం బీమండిలో సాంచాలపై పనిచేస్తుంటే అమ్మ లక్ష్మి ఇంట్లో బీడీలు చుట్టి కుటుంబాన్ని వెళ్లదీసింది. 'అమ్మా, కన్ను మసకబారుతోంది' అంటే 'అయ్యో..' అని బాధపడింది. అప్పుడు ఆపరేషన్‌కి రూ.70 వేల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. ఏ పూట కాపూటే తినే రోజుల్లో ఆస్పత్రికి పోయే ఆర్థిక స్తోమత లేదని తెలిసి కాలం కరిగిపోయింది. ఏడాది తిరిగేలోగా కన్ను పూర్తిగా కానరాకుండ అయింది. అప్పటికే అమ్మ కూడా లోకాన్ని విడిచి పోయింది. తొమ్మిదో తరగతిలో నరాలు క్షీణించి మరో కన్నుసైతం మసకబారింది. పరీక్ష రాయలేని పరిస్థితిని గమనించి, మా సారు నాన్నకు కబురు పంపాడు. అక్కడా ఇక్కడా అప్పు పుట్టిన పదిహేను రోజుల్లోనే ఉన్న ఒక్క కన్నూ పూర్తిగా కానరాక పోయింది' అని తన జీవితంలో చీకట్లు కమ్ముకున్న తీరును గుర్తు చేసుకున్నారు మిట్టపల్లి శ్రీనివాస్.

**బడిలో మొదలైన బతుకు పాట..**

తొమ్మిదో తరగతిలో చూపు కోల్పోయిన శ్రీనివాస్ చదువుకోవాలనే ఆశను కోల్పోలేదు. స్క్రైబ్ సాయంతో పది, ఇంటర్ పరీక్షలు పూర్తిచేశాడు. శ్రీనివాస్ చిన్ననాటి నుంచే పాఠశాల వార్షికోత్సవం, జాతీయ పండుగల్లో పాటలు పాడేవాడు. ఇంటర్ పూర్తిచేసిన శ్రీనివాస్ పాటలో తన ప్రతిభకు పదును పెట్టుకుంటూ సాగుతున్నాడు. ఆరో తరగతిలోనే జిల్లాస్థాయి పాటల పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి అందుకున్నాడు. డ్రాయింగ్ కాంపిటిషన్‌లో సైతం బహుమతులు కూడా గెలుచుకున్నాడు. పాటలే జీవితంగా సింగర్‌గా మారాలని అప్పుడే అనుకున్నాడు. రెండు కళ్లు పోయినా సింగర్ కావాలనే తన కలను చంపుకోలేదు. తన మధురమైన గొంతుతో పాటలు పాడుతూ తన కలను నెరవేర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు. ఇప్పటివరకు భక్తిగీతాలు, ఆల్బమ్ పాడిన శ్రీనివాస్ ఇప్పుడు టీవీ షోలలో రాణిస్తున్నాడు. ప్రముఖ టీవీ చానళ్లతో పాటు యూట్యూబ్‌లో శ్రీనివాస్ పాటలు లక్షలాది మంది నుంచి ఆదరణ లభిస్తోంది. శ్రీను పాడిన 'రాత రాసే బ్రహ్మదేవుడా..' పాటతో పాటు శివరాత్రి సందర్భంగా ఇటీవల మైక్ టీవీ విడుదల చేసిన 'బోళా శంకరా.. ఈశ్వరా.. శంభోశివా..' పాటతో శ్రీనివాస్ గొంతు మరింత ప్రాచుర్యం పొందింది. యశ్‌పాల్ రాసిన ఈ పాట యూట్యూబ్‌లో మార్మోగింది.

**ఒంటరి జీవితం.. స్వయం పాకం..**

29 ఏళ్ల శ్రీనివాస్ గత పద్నాలుగేళ్లుగా చీకటే లోకంగా బతుకు వెళ్లదీస్తున్నాడు. తల్లి లేదు తండ్రీ లేడు, రెండు కళ్లు లేవు, ఇల్లు లేదు, జాగ లేదు.. అయినా ఏనాడూ బతుకు భారం అనుకోలేదు. ఇంకొకరికీ భారంగానూ ఉండాలనుకోలేదు. అలాగని ఆత్మహత్య ఆలోచనను తన దరికి రానీయలేదు. కష్టాలు, కన్నీళ్లు దిగమింగుకుంటూ కాలంతో పోటీపడుతున్నాడు. తన తొమ్మిదో ఏట తల్లి లక్ష్మి, పదిహేడో ఏట తండ్రి లక్ష్మిరాజం అనారోగ్యంతో మరణించారు. పద్నాలుగేళ్లుగా శ్రీనివాస్ ఒంటరి జీవితం గడుపుతున్నాడు. తనకు తానే అన్ని పనులు చేసుకుంటాడు. తానే అన్నం, కూరలు వండుకుంటాడు. వంటకు అన్ని సరుకులు ఒక్క దగ్గర పెట్టుకుని చేతి స్పర్శతోనే ఉప్పు కారం మోతాదు అంచనా వేసుకుని కూర వండుకుంటాడు. అన్ని వేలలా స్నేహితులే అండగా ఉంటున్నారని వారి సాయంతోనే ప్రోగ్రాంలకు పాటలు పాడేందుకు వెళ్లగలుగుతున్నానని అంటాడు శ్రీనివాస్.

– పాదం వెంకటేశ్, సాక్షి, జగిత్యాల
ఫొటోలు : జవ్వాజి చంద్రశేఖర్

## పాటతోనే లోకాన్ని చూస్తున్నా



రెండు కళ్లు లేవనే బాధ కన్నా కంటికి రెప్పలా కాపాడే అమ్మానాన్న ఇద్దరూ నన్ను అనాథను చేసి వెళ్లిపోయారనే బాధ ఎక్కువగా ఉంది. చీకటి పడిందంటే అడుగుబయటపెట్టేవాన్ని కాదు. రాత్రిపూట అమ్మ నన్ను విడిచి ఎక్కడికీ వెళ్లేది కాదు. అర్ధరాత్రి వరకు అమ్మ బీడీలు చేసి, వచ్చిన పైసలతో బతుకె వెళ్లదీసింది. నాన్న భీమండిలో సాంచాల పనిచేసేవాడు. అమ్మ పోయిన తర్వాత నాన్న నాకోసం ఇంటికి వచ్చి, కంటికి రెప్పలా చూసుకున్నాడు. నాన్న కూడా మరణించాక ఇప్పుడు చీకటే లోకంగా బతుకుతున్న. పాటతో లోకాన్ని చూడాలని, నిరుపేదల బతుకుల్లో చీకటి తొలగించే వెలుగుదివ్వెగా నా పాట ఉపయోగపడాలన్నదే నా సంకల్పం.

– మిట్టపల్లి శ్రీనివాస్

వెబ్ సిరీస్ / మెంటల్‌హుడ్

# పిల్లల పెంపకంలో టెన్షన్

**పిల్లల పట్ల తల్లికి ఉండే ప్రేమను, బాధ్యతను, వాత్సల్యాన్ని కలగలిపి 'మాతృత్వం' అంటుంటారు. ఇంగ్లిష్‌లో 'మదర్‌హుడ్'. ఈ మాతృత్వం గొప్పదని, వరమని అంటూ తల్లి చుట్టూ బంధాలు బిగించారా? పిల్లల పెంపకంలో వొత్తిడి మదర్‌హుడ్‌ను మెంటల్ హుడ్‌గా మార్చిందా? బాలాజీ టెలిఫిల్మ్స్ తీసిన కొత్త వెబ్‌సిరీస్ 'మెంటల్‌హుడ్' ఆ విషయాన్నే చర్చిస్తుంది.**





భర్తలు బయటికెళ్లి సంపాదించుకుని రావాలి, భార్యలు ఇంటి పట్టున ఉండి పిల్లల ఆలనా పాలనా చూడాలి అనేది అనాదిగా ఉన్న భారతీయ సంప్రదాయం. 'రోజంతా ఇంట్లో ఉంటావ్ కదా... ఏం చేస్తుంటావ్?' అని అనే భర్తలు ఇప్పుడూ ఎప్పుడూ ఉండనే ఉంటారు. భార్యను పుట్టింటికి పంపి, పిల్లలతో ఒకరోజు ఇంట్లో గడిపితే తెలుస్తుంది రోజంతా ఇంట్లో ఉండి భార్య ఏం చేస్తుందో. పిల్లలను రోజూ నిద్ర లేపి, రెడీ చేసి, టిఫెన్లు తినిపించి, స్కూళ్లకు పంపే పని తండ్రులు ఎంతమంది చేస్తారు ఇళ్లల్లో అనేది ఎవరికి వారు ఆలోచించుకుంటే తల్లులు పడే వొత్తిడి తెలిసి వస్తుంది.

నిత్య జీవితంలో సమస్యలు అన్నీ సినిమా ఫార్ములాకు తగినట్టుగా ఉండవు. అందుకే చాలా విషయాలు పెద్ద తెర మీద కనిపించవు. థ్యాంక్స్ టు వెబ్ సిరీస్. వెబ్ కంటెంట్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో రకరకాల స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్ వచ్చాక తప్పనిసరై ఇంటి సమస్యల పై కూడా దృష్టి పడుతోంది. ఇప్పుడు తాజాగా బాలాజీ టెలిఫిల్మ్స్ ఏక్తా కపూర్ నిర్మాణంలో 'మెంటల్‌హుడ్' వెబ్ సిరీస్‌ను తయారు చేసింది. మార్చిలో 'జీ5'లో ఈ సిరీస్ టెలికాస్ట్ కానుంది. హిందీలో పేరున్న స్టార్స్– కరీష్మా కపూర్, డినో మారియా, సంజయ్ సూరి తదితరులు ఇందులో నటించారు.

మెంటల్‌హుడ్ కథ ప్రధానంగా ఐదుగురు తల్లుల చుట్టూ తిరుగుతుంది. వీరితో పాటు ఒక 'హౌస్ హజ్బెండ్' కూడా ఉంటాడు. హౌస్ హజ్బెండ్ అంటే భార్య ఉద్యోగానికి వెళితే ఇంట్లోనే ఉండి పిల్లల బాగోగులు చూసుకునే తండ్రి అనమాట. ఈ ఆరుగురు తమ పిల్లల జీవితాలను ఎలా డీల్ చేశారనేది కథ. ఇందులో కరీష్మా ముగ్గురు పిల్లల తల్లిగా నటించింది. ఈమె సగటు గృహిణి. పిల్లలు పెంచే వొత్తిడిని భర్త ఏ మాత్రం పంచుకోడు. ఆమె ఏం చేయాలి? మరో తల్లి 'వర్కింగ్ మదర్'గా ఉంటూనే తన మాతృత్వానికి పూర్తి న్యాయం చేయాలని పెనుగులాడుతూ ఉంటుంది. ఒక తల్లి తన పిల్లలకు కేవలం ఆల్టర్నేట్ మెడిసిన్ వాడాలని, వాళ్లు ఆర్గానిక్ ఫుడ్ తినాలని అనుకుంటూ ఉంటుంది. వీళ్లలో ఒక పాపను స్కూల్లో మోలెస్ట్ చేస్తారు. ఆ వొత్తిడి ఎలా ఎదుర్కోవాలి?... ఇవన్నీ సమస్యలు.

మన వొడిలో కూచుని ఆడుకుని ఎదిగిన పిల్లలే వయసు పెరిగే కొద్దీ అభిప్రాయాలు పెంచుకుని, అంచనాలు తెచ్చుకుని తల్లిని ప్రేమించాలా ద్వేషించాలా అనేవరకు ఈ మదర్‌హుడ్ వెళుతుంది. ప్రతి కుటుంబం తనను తాను చూసుకునే ఈ వెబ్ సిరీస్‌కు దర్శకురాలు కూడా స్త్రీయే. కరిష్మా కోహ్లి. కనుక స్త్రీల దృష్టికోణంలో పిల్లల పెంపకాన్ని ఈ సిరీస్ గట్టిగా చర్చకు పెడుతుందని చెప్పవచ్చు.

# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్పర్థయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
2-3-2020


## కెరీర్ కౌన్సెలింగ్ Q A

» **ఇంటర్ బైపీసీ పూర్తయ్యాక బ్యుటీషియన్ కోర్సు పూర్తి చేశాను. కాని నాకు ఈ రంగం ఇష్టం లేదు. ఏం చేయాలో చెప్పండి? –ఖ్యాతి వర్ధిని**

బైపీసీ కోర్ సబ్జెక్ట్‌ల పట్ల ఆసక్తి ఉంటే.. కెరీర్‌కు అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. బీఎస్సీ బీజెడ్‌సీ ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్న సంప్రదాయ డిగ్రీ కోర్సు. ఇందులో ఇప్పుడు బయో కెమిస్ట్రీ, బయో ఫిజిక్స్, మైక్రో బయాలజీ వంటి సబ్జెక్ట్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా హెల్త్‌కేర్ రంగంలో ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఇక సత్వర ఉపాధి కావాలనుకుంటే.. నర్సింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సులు చదవడం మేలు. ఒకవేళ హెల్త్ కేర్ రంగంలో సుస్థిర భవిత కోరుకుంటే.. బీఫార్మసీ, వెటర్నరీ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్ విభాగంలో కాకుండా.. ఇతర విభాగాల్లో అవకాశాలు కోరుకుంటే కలినరీ ఆర్ట్స్, గార్డెనింగ్, హార్టికల్చర్ వంటి కోర్సులు చదివే అవకాశం ఉంది. వీటిలో ఏ కోర్సులో చేరాలనుకున్నా.. ముందుగా వాటి గురించి పూర్తిగా తెలుసుకొని.. మీ స్వీయ ఆసక్తికి అనుకూలంగా నిర్ణయం తీసుకోండి.

» **నేను 2020లో డిగ్రీ పూర్తి చేసుకోబోతున్నాను. నాకు హోటల్ మేనేజ్‌మెంట్ పట్ల ఆసక్తి ఉంది. కోర్సులు, కాలేజీలు, ఫీజులు, కెరీర్ అవకాశాల గురించి తెలపండి? – సునీల్**

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు సంబంధించి ప్రస్తుతం పీజీ స్థాయిలో పలు అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో డాక్టర్. వైఎస్ఆర్ ఎన్ఐటీహెచ్ఎంలో ఎంబీఏ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సు ఉంది. దీంతోపాటు అమిటీ యూనివర్సిటీ, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్‌వంటి పలు ఇన్‌స్టిట్యూట్‌లలో పీజీ స్థాయిలో హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సు అందుబాటులో ఉంది. క్యాట్, సీమ్యాట్, మ్యాట్, ఎక్స్ఏటీ స్కోర్ల ఆధారంగా వీటిలో ప్రవేశం కల్పిస్తారు. ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు సొంతంగా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రవేశం పొందొచ్చు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి హోటల్స్, ఎయిర్‌పోర్ట్స్, ట్రావెల్ ఏజెన్సీలలో ఉద్యోగాలు లభిస్తాయి. ప్రారంభంలో ఫుడ్ అండ్ బెవరేజ్ మేనేజర్, ఆపరేషన్స్ మేనేజర్, కీ అకౌంట్స్ మేనేజర్ వంటి హోదాలతో కెరీర్ ప్రారంభించొచ్చు. ఈ రంగంలో స్థిరపడాలనుకుంటే కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటరాక్షన్ స్కిల్స్ వంటి పర్సనల్ స్కిల్స్ తప్పనిసరి. అదే విధంగా ఇంగ్లిష్‌తోపాటు ఏదైనా ఫారెన్ లాంగ్వేజ్ నైపుణ్యం కూడా సొంతం చేసుకున్న వారికి సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

## ఎమర్జింగ్ కెరీర్

# కొలువుదీర్చే.. డ్రోన్!



» అన్ని రంగాలకు విస్తరిస్తున్న డ్రోన్‌లు
» డీజీసీఏ కొత్త పాలసీతో పెరుగుతున్న అవకాశాలు
» పదో తరగతి నుంచి ఇంజనీరింగ్ వరకు అందరూ అర్హులే

**ఇప్పుడు డ్రోన్‌ల గురించి తెలియని వారంటూ లేరు. ముఖ్యంగా డ్రోన్ కెమెరాలు ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ సుపరిచితమే! సాంకేతికత పురోభివృద్ధితో ఆయిల్, గ్యాస్, నిర్మాణం, మైనింగ్, అగ్రికల్చర్.. ఇలా అన్ని రంగాలకు డ్రోన్‌లు విస్తరిస్తున్నాయి. డ్రోన్‌ల అవసరం, వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలను గుర్తించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) డ్రోన్ నూతన పాలసీ తీసుకొచ్చింది. దీంతో డ్రోన్‌ల వినియోగం మరింత విస్తృతమైంది. ఫలితంగా కెరీర్ అవకాశాలు సైతం పెరుగుతున్నాయి. పదో తరగతి నుంచి ఏరోడైనమిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పట్టభద్రుల వరకూ.. అర్హతలకు తగ్గ ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. డ్రోన్‌ల రంగంలో కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..**

2025 నాటికి డ్రోన్ రంగంలో.. లక్ష కంటే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని తాజా అంచనా. ఇదే సమయంలో డ్రోన్ టెక్నాలజీ, వాణిజ్య అనువర్తనాల మార్కెట్ 2020 నాటికి 7,127 మిలియన్ డాలర్లకు చేరుకోనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న డ్రోన్ విధానం.. పలు నిబంధనలతో డ్రోన్‌ల వినియోగాన్ని అనుమతిస్తోంది. రానున్న రోజుల్లో వాణిజ్య, వ్యాపార రంగాల్లోనూ డ్రోన్‌లను వినియోగించేలా విధాన మార్పులు జరిగే అవకాశం ఉంది. అదే జరిగితే మరిన్ని రంగాలకు డ్రోన్ సేవలు విస్తరించడం ఖాయం.

### ఆర్‌పీఏఎస్

డ్రోన్‌లను సాంకేతిక పరిభాషలో ఆర్‌పీఏఎస్ (రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్)గా పేర్కొంటారు. డీజీసీఏ కూడా ఆర్‌పీఏస్ పేరుతోనే పాలసీ తీసుకొచ్చింది. ఇప్పటికే పలు కంపెనీలు డ్రోన్‌లు తయారుచేస్తుంటే.. మరికొన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. డ్రోన్‌లను రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో వాటిని ఆపరేట్ చేసేందుకు పైలట్ల అవసరం తప్పనిసరి. ఇక్కడ పైలట్ అంటే..నిర్దేశిత ప్రాంతంలో కూర్చుని రిమోట్ ద్వారా గాలిలో ఎగురుతున్న డ్రోన్ కదలికలను నియంత్రించే వ్యక్తి. ఆర్మీలో వినియోగించే డ్రోన్‌లను యూఏవీ(అన్‌మ్యాన్‌డ్ ఏరియల్ వెహికల్స్) అంటారు.

### డ్రోన్ పైలట్

పదోతరగతి అర్హత, ఇంగ్లిష్‌లో పరిజ్ఞానం ఉంటే చాలు.. 'డ్రోన్' పైలట్‌గా కెరీర్ అవకాశాలు దక్కించుకోవచ్చు. ఇందుకోసం డీజీసీఏ నిర్దిష్టంగా నిబంధనలు రూపొందించింది. వీటి ప్రకారం డ్రోన్ ఆపరేటర్ డీజీసీఏ నుంచి రిమోట్ పైలట్ లైసెన్స్ పొందాలి. దీని కోసం ముందుగా డీజీసీఏ గుర్తింపు పొందిన ఫ్లయింగ్ ట్రెనింగ్ ఆర్గనైజేషన్ నుంచి కనీసం అయిదు రోజులపాటు శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణలో భాగంగా రేడియో టెలిఫోనీ టెక్నిక్స్, ఫ్లయిట్ ప్లానింగ్ అండ్ ఏటీసీ ప్రొసీజర్స్, డీజీసీఏ రెగ్యులేషన్స్, తదితర విమానయాన సంబంధిత టెక్నికల్ అంశాల్లో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ పొందుతారు. ప్రస్తుతం ఈ విభాగంలో దేశంలో ఐఐడీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రోన్స్) ఒక్కటే డీజీసీఏ గుర్తింపు పొందింది.

### లైసెన్స్ ఎగ్జామ్

డీజీసీఏ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత.. డ్రోన్ పైలట్‌గా కెరీర్ ప్రారంభించాలంటే.. డీజీసీఏ లైసెన్స్ తప్పనిసరి. లైసెన్స్ పొందేందుకు డీజీసీఏ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి డ్రోన్ పైలట్ లైసెన్స్ లభిస్తుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రోన్స్(ఐఐడీ) » మావన్ డ్రోన్ అకాడమీ » ఇండియన్ అకాడమీ ఆఫ్ డ్రోన్స్ » నేషనల్ డ్రోన్ స్కూల్ » ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీ వంటి సంస్థలు డ్రోన్ పైలట్ శిక్షణ ఇస్తున్నాయి.

### టెక్ విద్యార్థులకు

ఉపాధి పరంగా టెక్నికల్ విద్యార్థులు డ్రోన్‌ల రంగంలో ప్రయోజనం పొందుతున్నారు. ముఖ్యంగా డ్రోన్‌ల తయారీ కోణంలో ఏరోడైనమిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో టెక్నికల్ గ్రాడ్యుయేట్లకు సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. డ్రోన్‌ల డిజైన్, మోడలింగ్, 3డి ప్రింటింగ్, అసెంబ్లింగ్, ప్రోగ్రామింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

### అనలిస్ట్‌ల అవసరం

డ్రోన్ కెమెరాలు పంపే చిత్రాలను విశ్లేషించి.. సంస్థలకు నివేదికలు ఇవ్వాల్సిన క్రమంలో అనలిస్ట్‌ల అవసరం ఏర్పడుతుంది. ముఖ్యంగా ల్యాండ్ సర్వేయింగ్, మైనింగ్ వంటి రంగాలకు సంబంధించిన అంశాల్లో అనలిస్ట్‌ల అవసరం ఎక్కువగా ఉంటోంది.

### పలు జాబ్ ప్రొఫైల్స్

డ్రోన్/యూఏవీ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్–డ్రోన్ అండ్ రోబోటిక్స్, డ్రోన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ అండ్ పైలెట్ జాబ్, మైక్రో రోబోట్ అండ్ డ్రోన్ మ్యానుఫ్యాక్చరింగ్, డ్రోన్ మెకానికల్ డిజైన్ ఇంజనీర్, డ్రోన్ ఆపరేటర్, యూఏవీ టెస్ట్ పైలెట్, ఆటోమేషన్ ఇంజనీర్.

### స్టార్టప్ ప్రోత్సాహం

మరోవైపు స్వయం ఉపాధి పరంగానూ డ్రోన్‌లు సరికొత్త వేదికలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా డ్రోన్‌ల తయారీ సంస్థలను స్టార్టప్‌లుగా ఏర్పాటు చేసేందుకు అవకాశముంది. ఇప్పటికే మన దేశంలో దాదాపు 150కిపైగా డ్రోన్ తయారీ సంస్థలున్నాయి. మరోవైపు ఈ స్టార్టప్ ఔత్సాహికులకు వెంచర్ క్యాపిటలిస్ట్‌ల నుంచి ఆర్థిక సహకారం కూడా లభిస్తోంది. ఇప్పటికే డ్రోన్‌ల తయారీలో నిమగ్నమైన ఇండియాఫోర్జ్ సంస్థకు 23.77 మిలియన్ డాలర్ల ఫండింగ్ అందింది. అదే విధంగా ఆరవ్ అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్‌కు ఏడున్నర లక్షల డాలర్లు, డిటెక్ట్ టెక్నాలజీస్‌కు ఏడు లక్షల డాలర్లు, క్రోన్ సిస్టమ్స్‌కు 6.6 లక్షల డాలర్లు, ద్రోణ ఏవియేషన్ సంస్థకు ఒక లక్ష డాలర్ల ఫండింగ్ లభించింది. వీటిని దృష్టిలో పెట్టుకుంటే.. భవిష్యత్తులోనూ డ్రోన్ స్టార్టప్ సంస్థలకు ఫండింగ్ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని చెప్పొచ్చు.

### విదేశీ అవకాశాలు

డ్రోన్‌ల వినియోగంలో ప్రస్తుతం అమెరికా తొలి స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానంలో భారత్ నిలుస్తోంది. భారత్‌లో 2021 నాటికి 50వేల మంది డ్రోన్ పైలట్ల అవసరం ఏర్పడనుందని అంచనా. డ్రోన్ పైలట్లకు విదేశాల్లోనూ డిమాండ్ నెలకొంది. అసోసియేషన్ ఆఫ్ అన్ మ్యాన్డ్ వెహికిల్ సిస్టమ్స్ ఇంటర్నేషనల్ అంచనాల ప్రకారం–2025 నాటికి అంతర్జాతీయంగా లక్ష మంది డ్రోన్ పైలట్ల అవసరం ఏర్పడనుంది.

### భవిష్యత్‌లో మార్పులు

ప్రస్తుత కొత్త డ్రోన్ పాలసీ కొన్ని రంగాలకే అనుమతిచ్చినప్పటికీ.. భవిష్యత్తులో మరిన్ని రంగాల్లోనూ డ్రోన్‌ల వినియోగానికి అనుమతిచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ–కామర్స్, హెల్త్ కేర్, ట్రావెల్ రంగాల్లో డ్రోన్‌ల వాడకానికి అనుమతిచ్చే వీలుంది. ఇప్పటికే ప్రముఖ క్యాబ్ సంస్థ ఉబెర్ దుబాయ్‌లో గత ఏడాది డ్రోన్ ట్యాక్సీని ఆవిష్కరించింది. ఇదే తరహాలో ఫ్రాన్స్‌లో డ్రోన్ అంబులెన్స్ పేరుతో ప్రయోగాలు నిర్వహించి విజయం సాధించారు. అదే విధంగా ప్రముఖ ఈ–కామర్స్ సంస్థ అమెజాన్.. ప్రైమ్ నౌ పేరుతో డ్రోన్ డెలివరీ వ్యవస్థను ప్రారంభించి అమెరికాలో పేటెంట్ కూడా సొంతం చేసుకుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటే.. భవిష్యత్తులో కచ్చితంగా ఇతర రంగాల్లోనూ ముఖ్యంగా సర్వీస్ సెక్టార్‌లోనూ డ్రోన్‌ల వినియోగానికి అనుమతి ఇవ్వొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ఉపాధి వేదికలు ఇవిగో..

**ఫొటోగ్రఫీ**

డ్రోన్ పైలట్లకు ఎక్కువగా మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, ఫొటోగ్రఫీ, సినిమా రంగాల్లో అవకాశాలు లభిస్తున్నాయి. కారణం.. ఇటీవల కాలంలో సినీ రంగం, ఎలక్ట్రానిక్ మీడియాలో డ్రోన్ కెమెరాలతో షూటింగ్ చేయడం పెరుగుతోంది. అదే విధంగా భారీ సభలు, వేడుకలను డ్రోన్ కెమెరాలతో ఫొటోలు తీయడం పరిపాటిగా మారింది. సినిమా రంగంలో డ్రోన్ పైలట్‌లకు రూ.20 వేల–రూ.30 వేలు వేతనం లభిస్తోంది.

**అగ్రికల్చర్**

డ్రోన్‌ల నార్మలైజ్డ్ డిఫరెన్స్ వెజిటేషన్ ఇండెక్స్ మ్యాప్(ఎన్‌డీవీఐ) ద్వారా భూమిలో ఎక్కడ మొక్క బాగా పెరుగుతుందో గుర్తించడంతోపాటు ప్రతి మొక్క ఎంత బాగా పెరిగిందో కూడా తెలుసుకోవచ్చు. కొత్త సాఫ్ట్‌వేర్ డ్రోన్ పైలట్లు సేకరించిన ముడి డేటాను రైతులకు వారి భూమిపై సంభావ్య ప్రాంతాలను సూచించే నివేదికలను రూపొందించడానికి, సమస్యను పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించగలదు.

**రియల్ ఎస్టేట్**

ప్రాపర్టీ ఏరియల్/గ్రౌండ్ ఫోటోలు, వీడియోలు తీసి అమ్మకాల పరంగా మంచి వాతావరణాన్ని సృష్టించేందుకు రియల్ ఎస్టేట్‌లో డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని అనేక మంది డ్రోన్ పైలట్‌లు రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌లో ఫ్రీలాన్సర్స్‌గా పనిచేస్తున్నారు.

**రవాణా రంగం**

రవాణా రంగంలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తనిఖీలకు డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. తద్వారా తక్కువ ఖర్చు, స్వల్ప వ్యవధిలో తనిఖీలను చేపడుతున్నారు. సాధారణంగా సిబ్బంది ట్రాక్‌పై తిరుగుతూ రైల్వే ట్రాక్‌ను తనిఖీ చేస్తుంటారు. నిర్దిష్ట ప్రాంతంలో ట్రాక్‌ను సర్వే చేసి వాటి వివరాలను రైల్వే టెక్నికల్ విభాగానికి పంపుతారు. రోజుల వ్యవధి పట్టే ఈ కార్యకలాపాలను డ్రోన్‌ల సహాయంతో గంటల్లోనే పూర్తి చేసే అవకాశం ఉంటుంది.

### పదో తరగతితోనే

ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, కెరీర్ అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటే.. వేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి డ్రోన్ రంగం చేరుకుందని చెప్పొచ్చు. ముఖ్యంగా పదోతరగతి అర్హతతో కెరీర్‌లో స్థిరపడే అవకాశాన్ని డ్రోన్‌లు కల్పిస్తున్నాయి. ఇప్పటికే అగ్రికల్చర్, మైనింగ్ రంగాల్లోని పలు సంస్థలు నిపుణులైన డ్రోన్ పైలట్లు లేకపోవడంతో.. తమ సంస్థల్లోని ఉద్యోగులకే డ్రోన్ ఆపరేటింగ్‌లో శిక్షణ ఇప్పించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

### వేతనాలు

ప్రస్తుతం ఆయా రంగాల్లో నెలకొన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. డీజీసీఏ లైసెన్స్ పొందిన డ్రోన్ పైలట్‌లకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ప్రారంభంలోనే కనీసం రూ.25వేల జీతం లభించడం ఖాయంగా కనిపిస్తోంది. సొంతంగా డ్రోన్ కలిగుంటే రోజుకు రూ.ఏడు వేల నుంచి రూ.25 వేల వరకు సంపాదించే అవకాశం ఉంది.

---

## జాబ్ స్కిల్స్

# ఇంగ్లిష్‌పై పట్టు.. ఉద్యోగ సాధనలో తొలిమెట్టు

**ఇంగ్లిష్ నైపుణ్యం ఉంటే.. ప్రపంచాన్నే చుట్టేయొచ్చు అనే నానుడి! కంపెనీలు నియామకాలప్పుడు ఇంగ్లిష్‌పై పట్టును ప్రత్యేకంగా పరిశీలిస్తున్న పరిస్థితి. ఐఐటీలు, ఐఐఎంల నుంచి స్థానిక కళాశాలల్లో చదివిన విద్యార్థుల వరకూ.. ఇంగ్లిష్ స్కిల్స్ ఉంటేనే అవకాశం కల్పిస్తున్న వైనం! సబ్జెక్ట్ నాలెడ్జ్ ఎంత ఘనంగా ఉన్నా.. ఇంగ్లిష్ నైపుణ్యం లేకపోతే ఆఫర్ అనుమానమే! దీంతో.. ఇప్పుడు నచ్చిన కొలువు దక్కించుకోవాలంటే.. ముందుగా ఇంగ్లిష్ స్కిల్స్‌ను పెంచుకోక తప్పని పరిస్థితి! ఈ నేపథ్యంలో.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌కు కంపెనీలు ఇస్తున్న ప్రాధాన్యం.. భాషపై పట్టును పెంచుకునేందుకు అందుబాటులో ఉన్న మార్గాల గురించి తెలుసుకుందాం...**




» ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలుంటేనే.. ఆఫర్స్ ఇస్తున్న కంపెనీలు
» అన్ని రంగాల్లో కీలకంగా మారుతున్న ఇంగ్లిష్ కమ్యూనికేషన్
» ఇంగ్లిష్ నేర్చుకునేందుకు మార్గాలు అనేకం

ఇప్పుడు ఏ ఉద్యోగ ప్రకటనను చూసినా.. ఇంగ్లిష్‌లో రాయడం, మాట్లాడం వచ్చి ఉండటం తప్పనిసరి నిబంధనగా మారింది. కంపెనీలు ఇంగ్లిష్ స్కిల్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం ఇది. మరోవైపు నూటికి 70 శాతం మంది ఇంగ్లిష్ నైపుణ్యాలు లేని కారణంగా అవకాశాలను చేజార్చుకోవాల్సి వస్తోంది. ఐఐటీలు మొదలు స్థానిక కళాశాల వరకూ.. ఎక్కడ చదివినా, ఎలాంటి కోర్సు పూర్తి చేసినా.. ఇంగ్లిష్ నైపుణ్యం లేకుంటే.. అవకాశం దక్కడం కష్టమే. దక్కినా నిలబెట్టుకోవడం అసాధ్యం. ఇంతలా ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరగడానికి కారణం.. మారుతున్న కంపెనీల వ్యాపార కార్యకలాపాలు.. రోజు రోజుకూ మారిపోతున్న టెక్నాలజీ!అంతర్జాతీయ క్లయింట్స్ సంస్థలు, వినియోగదారులతో సంప్రదింపుల పరంగా ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యం పెరిగింది. కాబట్టి విద్యార్థులు సబ్జెక్ట్ నాలెడ్జ్‌కే పరిమితం కాకుండా.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవడానికి కృషిచేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

### విదేశీ విద్యకు లాంగ్వేజ్ టెస్ట్‌లు

ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్ ఇప్పుడు కేవలం ఉద్యోగాల సాధనకే పరిమితం కాకుండా.. ఇతర విషయాల్లోనూ యువతను ముందంజలో నిలిచేలా చేస్తోంది. ముఖ్యంగా విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందాలంటే.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టుల్లో ప్రతిభ చూపడం తప్పనిసరి. ముఖ్యంగా టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, పీటీఈ వంటి స్టాండర్డ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ పాత్ర కీలకం. స్పోకెన్, రిటెన్ ఇంగ్లిష్ నైపుణ్యాలు మెరుగ్గా ఉంటేనే లాంగ్వేజ్ టెస్టుల్లో రాణించే వీలుంటుంది.

### ప్రజెంటేషన్ స్కిల్స్

ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకుంటే.. అభ్యర్థుల్లో ప్రజెంటేషన్ స్కిల్స్ కూడా మెరుగవుతాయి. ఇది ఉద్యోగ సాధనకు దోహదపడుతుంది. ఇప్పుడు చాలా కంపెనీలు ఏదైనా ఒక టాపిక్‌పై ప్రజెంటేషన్‌ను కోరుతున్నాయి. ఇలాంటి సందర్భంలో ఇంగ్లిష్ ప్రజెంటేషన్ స్కిల్స్ ప్రధానంగా మారాయి. అంతే కాకుండా ప్లేస్‌మెంట్స్ ప్రక్రియలో భాగంగా నిర్వహించే గ్రూప్ డిస్కషన్స్‌లోనూ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కీలకం. కాబట్టి విద్యార్థులు తాము కోర్సులో చేరిన రోజు నుంచే ఇంగ్లిష్ భాషపై పట్టు పెంచుకునేందుకు ప్రత్యేకంగా దృష్టిసారించాలి. అలాగే స్టార్టప్ ఔత్సాహికులు తమ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లను వివరించేందుకు ఇంగ్లిష్ స్కిల్ తప్పనిసరి. మరోవైపు పోటీ పరీక్షల్లో రాణించేందుకు కూడా ఇంగ్లిష్ భాషపై పట్టుండటం తప్పనిసరి.

### ప్రముఖ విద్యాసంస్థల్లో సైతం

✦ ఇంగ్లిష్ సమస్య స్థానిక కాలేజీలకే పరిమితం కాలేదు. ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌గా పేర్కొనే ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థుల్లో సైతం ఈ స్కిల్స్ లేమి సమస్యగా మారింది. వాస్తవానికి ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థులకు క్యాంపస్ ఆఫర్లు ఇట్టే లభిస్తాయనే అభిప్రాయం ఉన్న మాట తెలిసిందే. కానీ.. ఇక్కడి విద్యార్థులూ సరిపడ ఇంగ్లిష్ నైపుణ్యాలులేక ఒత్తిడికి గురవుతున్నట్లు చెబుతున్నారు.

✦ ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసుకుంటున్న విద్యార్థుల్లో దాదాపు 70 శాతం మందిలో ఇంగ్లిష్ నైపుణ్యం లేకపోవడం కంపెనీలకు పెద్ద సమస్యగా మారింది. మరోవైపు.. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వే ప్రకారం –క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో పాల్గొంటున్న సంస్థల్లో 90 శాతం కంపెనీలు తమ నియామక ప్రక్రియలో ఇంగ్లిష్ స్కిల్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తేలింది. ఇటీవల విడుదలైన ఇండియా స్కిల్ రిపోర్ట్–2019 ప్రకారం–నియామకాల పరంగా ఇంగ్లిష్ టాప్–3 స్కిల్స్‌లో నిలిచింది.

### ఆన్‌లైన్ వేదికగా.. ఆంగ్లంపై పట్టు

ఇంగ్లిష్ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఆన్‌లైన్ వేదికలను ఉప యోగించుకోవచ్చు. వీటిల్లో బ్లాగులు, సోషల్ నెట్‌వర్క్ మెసేజింగ్, చాటింగ్, య్యూటూబ్ వీడియోలు, లాంగ్వేజ్ లెర్నింగ్ పోర్టల్స్ వంటివి ముఖ్యమైనవి. బ్లాగుల్లో ఏదైనా ఒక విషయానికి సంబంధించి పోస్ట్ చేసిన కామెంట్లు లేదా అనాలిసిస్‌లను చదివి.. వాటికి ఇంగ్లిష్‌లో సమాధానం రాయడం అలవర్చుకోవాలి. తొలిదశలో నచ్చిన రీతిలో రాస్తూ.. క్రమేణా రాత నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు. సోషల్ నెట్‌వర్క్ సైట్స్‌లో నిపుణుల కామెంట్స్‌ను క్షుణ్నంగా చదవడం ఎంతో లాభిస్తుంది. ఒక టాపిక్‌కు సంబంధించి సదరు నిపుణులు ఉపయోగించిన భాషపై అవగాహన వస్తుంది. తద్వారా భాషా పరిజ్ఞానాన్ని క్రమేణా పెంచుకోవచ్చు. అలాగే యూట్యూబ్‌తో పాటు ఇతర వెబ్‌పోర్టల్స్‌లో వీడియోలు చూడటం ద్వారా ఇంగ్లిష్‌పై పట్టు సాధించే వీలుంది.

### స్పోకెన్ ఇంగ్లిష్

స్పోకెన్ ఇంగ్లిష్.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్ పరంగా అత్యంత కీలకమైన నైపుణ్యం. ఇంగ్లిష్‌లో రాయగలిగినా.. చాలామంది మాట్లాడేందుకు జంకుతుంటారు. లిజనింగ్, రైటింగ్ పరంగా పట్టు సాధించినప్పటికీ.. స్పీకింగ్‌కు వచ్చేసరికి తడబడుతుంటారు. వాస్తవానికి ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్పోకెన్ ఇంగ్లిష్ కీలకంగా మారింది. పట్టుదలతో ప్రయత్నిస్తే స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. ఇంగ్లిష్‌లో మాట్లాడటం కోసం ముందుగా.. నిర్దిష్టంగా ఒక అంశాన్ని ఎంపిక చేసుకోవాలి. సదరు విషయానికి సంబంధించి అప్పటివరకు ప్రచురితమైన వ్యాసాలు, వార్తలు చదవాలి.అందులో వినియోగించిన పదజాలం, వాక్య నిర్మాణం వంటివి పరిశీలించాలి. స్థూలంగా దాని సారాంశం తెలుసుకోవాలి. ఆ తర్వాత సంబంధిత టాపిక్‌ను తమదైన శైలిలో పాయింట్ల రూపంలో రాసుకోవాలి. ఆయా అంశాలను ముందుగా స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడాలి. ఈ విషయంలో బిడియం సరికాదు. తొలిదశలో ఒక విషయాన్ని ఎదుటి వారికి అర్థమయ్యేట్లు చెప్పగలుగుతున్నామా లేదా? అనేదే ప్రధానం.

### గ్రూప్ డిస్కషన్స్

స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకునేందుకు ఉపయోగపడే మరో సాధనం..గ్రూప్ డిస్కషన్స్(జీడీ). తొలిదశలో గ్రూప్ డిస్కషన్స్‌ను స్నేహితులు, కుటుంబ సభ్యులతో ప్రారంభించాలి. దీనివల్ల సదరు చర్చ సందర్భంగా బాగా మాట్లాడిన వాళ్లను పరిశీలించే అవకాశం లభిస్తుంది. అలాగే డిబేట్స్(చర్చలు)లో పాల్గొనడం కూడా మేలు చేస్తుంది. కాలేజీ, స్కూల్ స్థాయి నుంచే ఇంగ్లిష్‌లో మాట్లాడం అలవాటుగా మార్చుకోవాలి. ఫలితంగా నలుగురిలో ఇంగ్లిష్‌లో మాట్లాడేటప్పుడు బెరుకు తగ్గుతుంది.

### గ్రామర్, వొకాబ్యులరీ

✦ ఇంగ్లిష్ నేర్చుకునేటప్పుడు తొలిదశలో అత్యంత ఉపయుక్త సాధనం.. నిఘంటువు (డిక్షనరీ). ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి డిక్షనరీల్లో ఒక పదానికి అర్థం తెలియజేయడంతోపాటు.. సదరు పదాన్ని ఏ సందర్భంలో వినియోగిస్తారు? ఎలా మాట్లాడొచ్చు? అనే విషయాలు ఉంటాయి. సదరు పదాలకు సమానార్థాలు, వ్యతిరేకార్థాలు కూడా కనిపిస్తాయి.

✦ స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యం కోణంలో వొకాబ్యులరీపై పట్టు సాధించడం ఎంతో అవసరం. ప్రతిరోజు కనీసం పదికొత్త పదాలు–వాటి అర్థాలు తెలుసుకోవాలి. వాటిని ఏ సందర్భంలో ప్రయోగించవచ్చో తెలుసుకోవాలి.

✦ ఇంగ్లిష్ నైపుణ్యం మెరుగుపరచుకునే విషయంలో బేసిక్ గ్రామర్(వ్యాకరణం)పై అవగాహన మేలు చేస్తుంది. ప్రధానంగా టెన్సెస్, డైరెక్ట్–ఇండైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్–ప్యాసివ్ వాయిస్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఫలితంగా ఒక విషయాన్ని కమ్యూనికేట్ చేసే క్రమంలో చక్కటి నైపుణ్యం లభిస్తుంది.

### అకడమిక్ మార్గాలు

ఇంగ్లిష్ నైపుణ్య సాధనకు ఇప్పుడు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. అకడమిక్ స్థాయిలోనే కాలేజీలు, యూనివర్సిటీల పరిధిలో ఫినిషింగ్ స్కూల్స్ పేరుతో, లేదా ప్రత్యేకంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్లబ్‌ల పేరుతో శిక్షణ కేంద్రాలు ఏర్పడుతున్నాయి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. వీటితోపాటు బ్రిటిష్ కౌన్సిల్, కేంబ్రిడ్జ్ ఇండియా వంటి ప్రముఖ సంస్థలు లెర్నింగ్ ఇంగ్లిష్‌పై దశల వారీగా శిక్షణనిస్తున్నాయి. సదరు శిక్షణ పూర్తయ్యాక నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్ సైతం చేతికందుతుంది.

### నేర్చుకోండిలా

మరి ఇంగ్లిష్‌ను నేర్చుకోవడం ఎలా.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌పై పట్టు సాధించడం ఎలా?! అనే సందేహాలు తలెత్తడం సహజం. విద్యార్థులు నాలుగు అంశాలపై దృష్టి సారిస్తే ఇంగ్లిష్ బేసిక్ స్కిల్స్ అలవడుతాయని నిపుణులు చెబుతున్నారు. అవి.. లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్.

✦ **లిజనింగ్:** ఇంగ్లిష్‌ను నేర్చుకునే క్రమంలో తొలుత సంభాషణను శ్రద్ధగా వినడం చాలా ముఖ్యం. ఇంగ్లిష్‌పై అవగాహన ఉన్న వ్యక్తులు తమతో మాట్లాడుతున్నప్పుడు ఏకాగ్రతతో ఆలకించాలి. మధ్యలో అడ్డు తగలకూడదు. దీనివల్ల వారు ఏ అంశానికి సంబంధించి మాట్లాడుతున్నారో తెలుస్తుంది. వారి లాంగ్వేజ్ ఎక్స్‌ప్రెషన్ కూడా అర్థం అవుతుంది.

✦ **స్పీకింగ్:** అంటే.. మాట్లాడటం. ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్‌ను పెంచుకునే విషయంలో స్పీకింగ్ ఎంతో కీలకం. నచ్చిన అంశాన్ని ఎంచుకుని మాట్లాడటం సాధన చేయాలి. తొలిదశలో పొరపాట్లు దొర్లినా.. బిడియ పడకుండా మాట్లాడటం కొనసాగించాలి. తద్వారా క్రమేణా తమ తప్పులు తెలుసుకుని సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.

✦ **రీడింగ్:** ఒక అంశాన్ని క్షుణ్నంగా చదివి దాని సారాంశాన్ని.. అందులోని పద ప్రయోగాలను గుర్తించాలి. దీనివల్ల సదరు అంశం.. ఉద్దేశం, లక్ష్యం అర్థమవుతుంది.

✦ **రైటింగ్:** ఇంగ్లిష్ బేసిక్ స్కిల్స్‌లో నాలుగోది చదివిన లేదా విన్న అంశాలను సొంత మాటల్లో రాయడం. ఈ విధానం వల్ల వాక్య నిర్మాణం, పద ప్రయోగం వంటి వాటిపై క్రమేణా పట్టు లభిస్తుంది.

### రెండు విధానాల్లోనూ కీలకం

“ ఇంగ్లిష్ కమ్యూనికేషన్.. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ ఎంతో కీలకంగా మారుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఇంగ్లిష్ నేర్చుకునేందుకు కృషి చేయాలి. ఆయా ఇన్‌స్టిట్యూట్‌లలో అందుబాటులో ఉన్న ఇంగ్లిష్ లెర్నింగ్ కోర్సులు అభ్యసించేందుకు ప్రయత్నించాలి.

– ప్రొఫెసర్ టి.థామస్,
ప్రొక్టార్, ఇఫ్లూ–హైదరాబాద్




## వారెవ్వా... క్యా క్యాచ్ హై!



కళ్లారా చూసినా కూడా కళ్లే నమ్మలేనంత అద్భుతమైన క్యాచ్‌ను జడేజా ఒంటిచేత్తో పట్టేశాడు. ఈ ఒక్క క్యాచ్‌తో ఒరిగిందేమిటనే చర్చను పక్కన బెడితే.. అతని విన్యాసం అద్భుతం. ఒంటిచేత్తో అందుకున్న వైనం చేస్తే 'వాహ్ తాజ్' కాదు... వాహ్ జడేజా అనాల్సిందే. 72వ ఓవర్‌ను షమీ వేస్తుండగా ఆఖరి బంతిని వాగ్నర్ ఎదుర్కొన్నాడు. అతని బలమైన షాట్‌కు బంతి డీప్‌స్క్వేర్ మీదుగా దూసుకెళ్లింది. చూసేవాళ్లకిది సిక్సర్‌గానే కనిపించింది. అయితే అందరి అంచనాలను తారుమారు చేస్తూ అది ఓ క్యాచ్ అయ్యింది. డీప్‌స్క్వేర్ వద్ద అప్రమత్తంగా ఉన్న జడేజా తనను తాను నియంత్రించుకుంటూనే ఎడంచేతితో గట్టిగా ఒడిసిపట్టుకున్నాడు. గాల్లో ఎంతో ఎత్తు ఎగిరి... కింద పడేటపుడు బంతిని ఏమాత్రం చేజారనివ్వకుండా జాగ్రత్త పడ్డాడు. ఇదంతా కేవలం 60 సెకన్లలోపే జరిగింది.

# ఆలౌట్ చేసి... ఆలౌట్ దారిలో...



కోహ్లి

### రెండో రోజు వికెట్ల జాతర ● మొత్తం 16 వికెట్లు కూలిన వైనం

### కివీస్ తొలి ఇన్నింగ్స్‌కు 235 వద్ద తెర ● భారత్‌కు 7 పరుగుల స్వల్ప ఆధిక్యం ● రెండో ఇన్నింగ్స్‌లో 90/6

**క్రైస్ట్‌చర్చ్:** భారత బౌలర్లు న్యూజిలాండ్ బ్యాటింగ్ జోరుకు కళ్లెం వేశారు. అయితే తొలి టెస్టులాగే టెయిలెండర్లను ఆపలేకపోయినా... మొత్తం మీద చెమటోడ్చి తమ తొలి ఇన్నింగ్స్ కంటే తక్కువ స్కోరుకే ప్రత్యర్థిని ఆలౌట్ చేశారు. కానీ బ్యాట్స్‌మెన్ మళ్లీ బాధ్యత మరిచారు. సమం చేసేందుకు పురోగమించే చోట సమర్పించుకునేందుకే తిరోగమించారు. 36వ ఓవర్ పూర్తవకముందే 6 కీలక వికెట్లను అప్పగించేశారు. రెండో టెస్టులో బౌలర్ల శ్రమతో పట్టు చిక్కినట్లే చిక్కి పేలవ బ్యాటింగ్‌తో భారత్ కష్టాల్లో పడింది. స్థూలంగా చెప్పాలంటే రెండో రోజు ఆటను ఇరు జట్ల బౌలర్లు శాసించారు. ఏకంగా 16 వికెట్లను పడేశారు. దీంతో ఈ టెస్టు నేడే ముగిసినా ఆశ్చర్యం లేదు. ఆదివారం మొదట 63/0 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 73.1 ఓవర్లలో 235 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ లాథమ్ (52; 5 ఫోర్లు) అర్ధ శతకం సాధించాడు. భారత బౌలర్లలో షమీ 4, బుమ్రా 3 వికెట్లు తీశారు. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడిన భారత్ ఆట నిలిచే సమయానికి 36 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. అవుటైన ఆరుగురితో పాటు క్రీజ్‌లో ఉన్న ఇద్దరు... మొత్తం 8 మందిలో ఏ ఒక్కరు చెప్పుకోదగ్గ స్కోరే చేయలేదు. బౌల్ట్ (3/12) భారత ఇన్నింగ్స్‌ను దెబ్బ తీశాడు.



షమీ



బుమ్రా

#### రాణించిన లాథమ్...

ఆటమొదలైన కాసేపటికే న్యూజిలాండ్ రెండు కీలక వికెట్లను కోల్పోయింది. బ్లన్‌డెల్ (30; 4 ఫోర్లు)ను ఉమేశ్... కెప్టెన్ కేన్ విలియమ్సన్‌ను (3)ను బుమ్రా అవుట్ చేశాడు. జట్టు స్కోరు వంద పరుగులు దాటాక... షమీ విజృంభించాడు. దీంతో స్వల్ప వ్యవధిలో రాస్ టేలర్ (15; 1 ఫోర్), ఫిఫ్టీ పూర్తి చేసుకున్న లాథమ్, నికోల్స్ (14; 1 ఫోర్) పెవిలియన్ చేరారు. టేలర్‌ను జడేజా బోల్తా కొట్టించగా... లాథమ్, నికోల్స్‌లను షమీ అవుట్ చేశాడు. లంచ్ విరామానికి కివీస్ స్కోర్ 142/5. రెండో సెషన్‌లో కివీస్ పతనం కొనసాగింది. బుమ్రా ఒకే ఓవర్లో వాట్లింగ్ (0), సౌతీ (0)లను డకౌట్‌గా పంపాడు. ఈ దశలో గ్రాండ్‌హోమ్ (26; 4 ఫోర్లు), టెయిలెండర్ జేమీసన్ (49; 7 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే పనిలో పడినప్పటికీ ఈ జోడీ ఎంతోసేపు నిలువలేదు. జడేజా... గ్రాండ్‌హోమ్‌ను బౌల్డ్ చేశాడు. 177 పరుగులకే 8 వికెట్లను కోల్పోయినా కూడా కివీస్ కథ అప్పుడే ముగిసిపోలేదు. జేమీసన్, వాగ్నర్ (21; 3 ఫోర్లు)తో కలిసి 9వ వికెట్‌కు 51 పరుగుల కీలక భాగస్వామ్యం అందించడంతో భారత్ భారీ ఆధిక్యానికి గండిపడింది. ఎట్టకేలకు షమీ తన వరుస ఓవర్లలో వాగ్నర్, జేమీసన్‌లను అవుట్ చేయడంతో 235 పరుగుల వద్ద కివీస్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

#### కష్టాలతో రెండో ఇన్నింగ్స్...

తమకన్నా తక్కువ స్కోరుకే ప్రత్యర్థిని కట్టడి చేశామన్న భారత్ ఆనందం ఆవిరయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు. తీరు మారని బ్యాటింగ్‌తో రెండో ఇన్నింగ్స్ కష్టాలతోనే మొదలైంది. రెండో ఓవర్లోనే బౌల్ట్ బౌలింగ్‌లో మయాంక్ (3) వికెట్ల ముందు దొరికిపోయాడు. మరో ఓపెనర్ పృథ్వీ షా (14) కాసేపే ఆడగలిగాడు. ఇతన్ని సౌతీ అవుట్ చేయగా... కెప్టెన్ కోహ్లి (14; 3 ఫోర్లు), పుజారా (24; 2 ఫోర్లు) జట్టు స్కోరును కష్టమ్మీద 50 పరుగులు దాటించారు. దీనికి మరో పరుగు జతయ్యాక విరాట్ కోహ్లి ఎల్బీగా పెవిలియన్ బాట పట్టాడు. తర్వాత రహానే (9) వచ్చినా... ఉమేశ్ (1)ను నైట్‌వాచ్‌మన్‌గా పంపించినా ఫలితం లేకపోయింది. కుదురుకుంటాడనుకున్న పుజారా కూడా బౌల్ట్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డవ్వడం భారత్ కష్టాల్ని మరింత పెంచింది. ఆట నిలిచే సమయానికి హనుమ విహారి (5 బ్యాటింగ్), రిషభ్ పంత్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ ఓవరాల్ ఆధిక్యం 97 పరుగులకు చేరింది. సౌతీ, వాగ్నర్, గ్రాండ్‌హోమ్ తలా ఒక వికెట్ తీశారు.

**బౌలర్లు కష్టపడి ప్రత్యర్థిని తమ కంటే తక్కువ స్కోరుకే ఆలౌట్ చేస్తే... మన బ్యాట్స్‌మెన్ మళ్లీ కష్టాలపాలు చేశారు. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన కివీస్ టెయిలెండర్ జేమీసన్ చక్కగా 49 పరుగులు చేశాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో మన స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ పృథ్వీ షా (14), మయాంక్ అగర్వాల్ (3), కోహ్లి (14), రహానే (9)లు అంతా కలిసి 40 పరుగులు చేయడం టీమిండియా 'పటిష్టమైన బ్యాటింగ్' లైనప్ ముద్రకు పెను సవాల్ విసురుతోంది. క్రీజులో ఉన్న విహారి, రిషభ్ పంత్ మూడో రోజు భారీ ఇన్నింగ్స్ ఆడితే తప్పించి రెండో టెస్టులోనూ భారత్‌కు భంగపాటు తప్పేలా లేదు.**

#### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్: 242; న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** లాథమ్ (బి) షమీ 52; బ్లన్‌డెల్ ఎల్బీడబ్ల్యూ (బి) ఉమేశ్ 30; విలియమ్సన్ (సి) పంత్ (బి) బుమ్రా 3; రాస్ టేలర్ (సి) ఉమేశ్ (బి) జడేజా 15; నికోల్స్ (సి) కోహ్లి (బి) షమీ 14; వాట్లింగ్ (సి) జడేజా (బి) బుమ్రా 0; గ్రాండ్‌హోమ్ (బి) జడేజా 26; సౌతీ (సి) పంత్ (బి) బుమ్రా 0; జేమీసన్ (సి) పంత్ (బి) షమీ 49; వాగ్నర్ (సి) జడేజా (బి) షమీ 21; బౌల్ట్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (73.1 ఓవర్లలో ఆలౌట్) 235**

**వికెట్ల పతనం:** 1–66, 2–69, 3–109, 4–130, 5–133, 6–153, 7–153, 8–177, 9–228, 10–235. **బౌలింగ్:** బుమ్రా 22–5–62–3, ఉమేశ్ యాదవ్ 18–2–46–1, షమీ 23.1–3–81–4, జడేజా 10–2–22–2.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** పృథ్వీ షా (సి) లాథమ్ (బి) సౌతీ 14; మయాంక్ ఎల్బీడబ్ల్యూ (బి) బౌల్ట్ 3; పుజారా (బి) బౌల్ట్ 24; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) గ్రాండ్‌హోమ్ 14; రహానే (బి) వాగ్నర్ 9; ఉమేశ్ (బి) బౌల్ట్ 1; విహారి (బ్యాటింగ్) 5, పంత్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (36 ఓవర్లలో 6 వికెట్లకు) 90. వికెట్ల పతనం:** 1–8, 2–26, 3–51, 4–72, 5–84, 6–89. **బౌలింగ్:** సౌతీ 6–2–20–1, బౌల్ట్ 9–3–12–3, జేమీసన్ 8–4–18–0, గ్రాండ్‌హోమ్ 5–3–3–1, వాగ్నర్ 8–1–18–1.

---

## నాదల్ @ 85



**అకాపుల్కో:** ప్రపంచ రెండో ర్యాంకర్, స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ ఈ ఏడాది తన ఖాతాలో తొలి టైటిల్‌ను జమ చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన మెక్సికో ఓపెన్ ఏటీపీ–500 టోర్నీలో 33 ఏళ్ల నాదల్ చాంపియన్‌గా నిలిచాడు. ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో నాదల్ 6–3, 6–2తో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలిచాడు. టైటిల్ గెలిచే క్రమంలో నాదల్ తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. మెక్సికో ఓపెన్‌ను నాదల్ నెగ్గడం ఇది మూడోసారి. గతంలో నాదల్ 2013, 2015లలో విజేతగా నిలిచాడు. ఓవరాల్‌గా నాదల్ కెరీర్‌లో ఇది 85వ సింగిల్స్ టైటిల్. తాజా టైటిల్‌తో నాదల్ వరుసగా 17వ ఏడాది కనీసం ఒక టైటిల్‌ను సాధించినట్లయింది. విజేతగా నిలిచిన నాదల్‌కు 3,72,785 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 2 కోట్ల 69 లక్షలు)తోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## ప్రపంచ రెండో ర్యాంకర్‌గా కోనేరు హంపి



**చెన్నై:** అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి పురోగతి సాధించింది. ఆదివారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో హంపి 2586 ఎలో రేటింగ్ పాయింట్లతో మూడో స్థానం నుంచి రెండో స్థానానికి ఎగబాకింది. 2658 ఎలో రేటింగ్ పాయింట్లతో హూ ఇఫాన్ (చైనా) టాప్ ర్యాంక్‌లో ఉంది. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జూ వెన్‌జున్ రెండో ర్యాంక్ నుంచి (చైనా–2583 పాయింట్లు) మూడో ర్యాంక్‌కు పడిపోయింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 2517 పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌లో ఉంది.

## క్లాసెన్ అజేయ సెంచరీ



**పార్ల్:** హెన్రిచ్ క్లాసెన్ (114 బంతుల్లో 123 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ సెంచరీ... డేవిడ్ మిల్లర్ (70 బంతుల్లో 64; 4 ఫోర్లు, సిక్స్) బాధ్యతాయుత బ్యాటింగ్ కారణంగా... ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 74 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. తొలుత దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. క్లాసెన్, మిల్లర్ ఐదో వికెట్‌కు 149 పరుగులు జతచేసి తమ జట్టు భారీ స్కోరు చేసేందుకు దోహదపడ్డారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ రెండు, కమిన్స్ మూడు వికెట్లు తీశారు. 292 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 45.1 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (94 బంతుల్లో 76; 3 ఫోర్లు), లబ్‌షేన్ (51 బంతుల్లో 41; 2 ఫోర్లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఇన్‌గిడి (3/30), షమ్సీ (2/45) రాణించారు. క్లాసెన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే బుధవారం బ్లోమ్‌ఫోంటెన్‌లో జరుగుతుంది.

## ఓవరాల్ చాంప్ పంజాబ్ యూనివర్సిటీ

### ముగిసిన ఖేలో ఇండియా గేమ్స్




**భువనేశ్వర్:** తొలిసారి నిర్వహించిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పంజాబ్ యూనివర్సిటీ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం ముగిసిన ఈ క్రీడల్లో పంజాబ్ వర్సిటీ మొత్తం 46 పతకాలు సాధించింది. ఇందులో 17 స్వర్ణాలు, 19 రజతాలు, 10 కాంస్యాలు ఉన్నాయి. ముగింపు ఉత్సవానికి ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. మొత్తం పది రోజులపాటు జరిగిన ఈ క్రీడల్లో 64 యూనివర్సిటీలు కనీసం ఒక స్వర్ణమైనా సాధించాయి. 113 యూనివర్సిటీలు కనీసం ఒక కాంస్యమైనా గెలిచాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నాలుగు పతకాలతో (స్వర్ణం, రజతం, రెండు కాంస్యాలు) 38వ ర్యాంక్‌లో... ఆంధ్ర యూనివర్సిటీ రెండు పతకాలతో (స్వర్ణం, కాంస్యం) 50వ ర్యాంక్‌లో... కృష్ణా యూనివర్సిటీ రెండు రజతాలతో 72వ ర్యాంక్‌లో... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఒక కాంస్యంతో 97వ ర్యాంక్‌లో.... తెలంగాణకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ రెండు పతకాలతో (స్వర్ణం, రజతం) 45వ ర్యాంక్‌లో... పాలమూరు యూనివర్సిటీ ఒక రజతంతో 81వ ర్యాంక్‌లో నిలిచాయి.

## లిటన్ దాస్ శతకం: బంగ్లాదేశ్ భారీ గెలుపు



**సిల్హెట్:** ఓపెనర్ లిటన్ దాస్ (105 బంతుల్లో 126 రిటైర్డ్ హర్ట్) కెరీర్‌లో రెండో సెంచరీ సాధించడంతో... జింబాబ్వేతో ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు 169 పరుగుల భారీ ఆధిక్యంతో ఘనవిజయం నమోదు చేసింది. పరుగుల పరంగా వన్డేల్లో బంగ్లాదేశ్‌కిదే భారీ విజయం. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 321 పరుగులు చేసింది. మొహమ్మద్ మిథున్ (41 బంతుల్లో 50; 5 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. 322 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 39.1 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్లలో సైఫుద్దీన్ (3/22), మష్రఫే మొర్తజా (2/35), మిరాజ్ (2/33) ఆకట్టుకున్నారు.

## సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్

**మహిళల టి20 ప్రపంచకప్**





**సిడ్నీ:** 'హ్యాట్రిక్' విజయంతో దక్షిణాఫ్రికా... మూడో గెలుపుతో ఇంగ్లండ్ జట్లు మహిళల టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా 17 పరుగుల ఆధిక్యంతో పాకిస్తాన్‌పై... ఇంగ్లండ్ 46 పరుగుల ఆధిక్యంతో వెస్టిండీస్‌పై గెలుపొందాయి. గ్రూప్ 'బి'లో తమ నాలుగు లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న ఇంగ్లండ్ మూడు విజయాలతో ఆరు పాయింట్లు సంపాదించింది. దక్షిణాఫ్రికా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఆరు పాయింట్లతో ఇంగ్లండ్‌తో సమఉజ్జీగా ఉంది. అయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా ఇంగ్లండ్ ఈ గ్రూప్‌లో టాప్ ర్యాంక్‌లో ఉంది. మంగళవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను ఓడిస్తే దక్షిణాఫ్రికా గ్రూప్ టాపర్‌గా నిలుస్తుంది.

పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 136 పరుగులు చేసింది. లారా వోల్వార్ట్ (36 బంతుల్లో 53 నాటౌట్; 8 ఫోర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. మారిజన్ కాప్ (32 బంతుల్లో 31; 2 ఫోర్లు, సిక్స్) కూడా రాణించింది. 137 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 119 పరుగులు చేసి ఓడిపోయింది. జవేరియా ఖాన్ (31; 4 ఫోర్లు), అలియా రియాజ్ (39 నాటౌట్; 3 ఫోర్లు, సిక్స్) రాణించినా ఫలితం లేకపోయింది.

మాజీ చాంపియన్ వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 143 పరుగులు చేసింది. నటాలీ షివెర్ (56 బంతుల్లో 57; 6 ఫోర్లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. అనంతరం వెస్టిండీస్ 17.1 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. సోఫీ ఎకిల్‌స్టోన్ 7 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి విండీస్‌ను దెబ్బతీసింది.

నేటి గ్రూప్ 'ఎ' మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్‌తో శ్రీలంక; ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ తలపడనున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్ విజేత ఈ గ్రూప్ నుంచి రెండో జట్టుగా సెమీఫైనల్ చేరుకుంటుంది. గ్రూప్ 'ఎ'లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ అజేయంగా నిలిచి భారత జట్టు ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్న సంగతి తెలిసిందే.

## పటిష్ట స్థితిలో బెంగాల్

**కోల్‌కతా:** రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భాగంగా కర్ణాటకతో జరుగుతోన్న సెమీఫైనల్ మ్యాచ్‌లో బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులకు ఆలౌటైంది. అనుస్తుప్ (149 నాటౌట్; 21 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయంగా నిలిచాడు. అనంతరం కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 122 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా బెంగాల్‌కు 190 పరుగుల ఆధిక్యం లభించింది. బెంగాల్ బౌలర్ ఇషాన్ పోరెల్ 5 వికెట్లతో రాణించాడు. ఆట ముగిసే సమయానికి బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 72 పరుగులు చేసింది. రాజ్‌కోట్ వేదికగా జరుగుతోన్న ఇంకో సెమీస్ మ్యాచ్‌లో సౌరాష్ట్ర 304 పరుగులకు ఆలౌటైంది. ఆట ముగిసే సమయానికి గుజరాత్ 6 వికెట్లు కోల్పోయి 119 పరుగులు చేసింది.

## శ్రీలంక క్లీన్‌స్వీప్

**పల్లెకెలె:** వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో శ్రీలంక ఆరు పరుగులతో నెగ్గి సిరీస్‌ను 3–0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలుత శ్రీలంక 50 ఓవర్లలో 307 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ మెండిస్ (55), ధనంజయ డిసిల్వా (51) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం వెస్టిండీస్ 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 301 పరుగులు చేసి ఓడిపోయింది. షై హోప్ (72), అంబ్రిస్ (60), పూరన్ (50) రాణించినా ఫలితం లేకపోయింది.

epaper.sakshi.com

## స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 1,448 ▼ | 432 ▼ |
| 38,297 | 11,202 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,567 | ▲ 1 |
| డోజోన్స్ | 25,409 | ▼ 357 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,582 | ▼ 216 |
| డాక్స్ | 11,890 | ▼ 477 |
| షాంఘై | 2,880 | ▼ 111 |
| నికాయ్ | 21,143 | ▼ 805 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 71.37 | 74.01 |
| £ | బ్రిటన్ పౌండ్ | 91.72 | 95.30 |
| € | యూరో | 78.16 | 81.49 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 63.00 | 70.00 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | 46.01 | 48.42 |
| S$ | సింగపూర్ డాలర్ | 50.92 | 53.39 |
| SAR | సౌదీ రియాల్ | 18.46 | 20.07 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 19.19 | 20.04 |
| ¥ | చైనా యువాన్ | 9.71 | 10.96 |

# డిజిటల్ పాలసీ ఎంతో చౌక

## ఆన్‌లైన్‌లో వాహన బీమా పాలసీతో ఆదా..

- ఏ సంస్థ నుంచి తీసుకుంటే నయం..?
- అకో, గో డిజిట్ నుంచి మంచి ఆఫర్లు
- 20-30 శాతం తక్కువ ప్రీమియం
- ఇతర సంస్థల నుంచీ ఎన్నో ఆఫర్లు
- కాకపోతే చూడాల్సిన అంశాలు చాలానే ఉంటాయి



**వాహనానికి బీమా తీసుకోవడం నిబంధనల రీత్యా తప్పనిసరి. ఏటేటా వాహన ప్రీమియం ఖరీదయిపోతోంది. ఈ క్రమంలో ప్రీమియం భారం కాస్త తగ్గించుకునేందుకు డిజిటల్ పాలసీలపై దృష్టి సారించొచ్చు. ఆన్‌లైన్‌లోనే సేవలతో దూసుకుపోతున్న అకో, గో డిజిట్ సంస్థలు పోటా పోటీగా మంచి ఫీచర్లతో పాలసీలను ఆఫర్ చేస్తున్నాయి. దీంతో యువతలో ఈ బీమా సంస్థలకు ఇటీవలి కాలంలో ప్రాచుర్యం పెరిగింది. కొనుగోలు ఎంతో సులభం కావడం, ప్రీమియం తక్కువగా ఉండడం వారికి ఎంతో సౌకర్యాన్నిస్తున్నాయి. అకో, గో డిజిట్ సంస్థలు నూరు శాతం ఆన్‌లైన్ కార్యకలాపాలకే పరిమితమయ్యాయి. భౌతికంగా వీటికి శాఖలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో వీటికి పరిపాలన, నిర్వహణ చార్జీలు ఇతర ప్రధాన బీమా సంస్థలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. కనుక ఈ సంస్థలు 20-30 శాతం తక్కువ ప్రీమియానికే మోటార్ పాలసీలను ఆఫర్ చేస్తున్నాయి. ఈ రెండు సంస్థలకు మోటారు ఇన్సూరెన్స్ మార్కెట్లో ప్రస్తుతానికి 3-4 శాతం వాటా ఉంది. కానీ, ఇతర సంస్థలతో పోలిస్తే ఇవి ఎంతో వేగంగా తమ వ్యాపారాన్ని విస్తృతం చేసుకుంటున్నాయి. పాలసీ రెన్యువల్ చేసుకునే సమయం వస్తే, ఈ సంస్థలను ఆశ్రయించొచ్చా..? ఈ ప్రశ్న మీకు ఎదురైతే.. సమాధానం వెతుక్కునేందుకు ఇక్కడున్న వివరాలను సమగ్రంగా తెలుసుకోవాల్సిందే. మోటారు ఇన్సూరెన్స్‌లో అతిపెద్ద సంస్థగా ఉన్న ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, అకో, గో డిజిట్ సంస్థల మధ్య కొన్ని సేవల పరంగా అంతరాన్ని పరిశీలించొచ్చు..**

### అకో జనరల్ ఇన్సూరెన్స్

సాధారణ బీమా వ్యాపార కంపెనీ అయిన అకో జనరల్ ఇన్సూరెన్స్ 2017లో కార్యకలాపాలు ప్రారంభించింది. మోటార్, హెల్త్, మొబైల్, ట్రావెల్ ఇన్సూరెన్స్ పాలసీలను ఈ సంస్థ అందిస్తోంది. అమెజాన్, కేటమరాన్ వెంచర్స్, సైఫ్ పార్ట్‌నర్స్ ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టాయి. ఈ సంస్థ అందించే మోటార్ ఇన్సూరెన్స్ పాలసీలో.. రోడ్డు ప్రమాదం, అగ్ని ప్రమాదం, ప్రకృతి విపత్తుల కారణంగా సొంత వాహనానికి, మూడో పార్టీ వాహనానికి నష్టం జరిగితే కవరేజీ ఉంటుంది. వాహనం చోరీకి గురైనా బీమా లభిస్తుంది. అలాగే, వాహనదారుడికి వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీ కూడా ఇందులో ఉంటుంది. జీరో డిప్రిసియేషన్‌ను యాడాన్ కవర్‌గా తీసుకోవచ్చు. అంటే వాహనంలోని రబ్బర్, ప్లాస్టిక్ తదితర కొన్ని విడిభాగాలకు నష్టం జరిగితే బీమా సంస్థ వాస్తవ విలువలో నిర్ణీత శాతమే పరిహారం చెల్లిస్తుంది. జీరో డిప్రిషియేషన్ కవర్ తీసుకుంటే 100 శాతం విలువను పరిహారంగా చెల్లిస్తుంది.

**వీటికి పరిహారం రాదు...**



ఈ పాలసీలో నిబంధనలు ఇతర మోటారు పాలసీల్లో మాదిరే ఉంటాయి. మద్యం సేవించి వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైతే లేదా కారణమైతే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ ప్రమాదం బారిన పడితే అందుకు జరిగే నష్టానికి కంపెనీ రూపాయి కూడా చెల్లించదు. అలాగే, ప్రమాదం వల్ల కాకుండా ఇతర కారణాల వల్ల వాహనానికి నష్టం జరిగినా పరిహారం రాదు.

**కొనుగోలు ఇలా...**

ఆన్‌లైన్ పోర్టల్ అకో డాట్ కామ్‌కు వెళ్లి మీ కారు నంబర్ లేదా బ్రాండ్‌ను ఎంపిక చేసుకుని, కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన తర్వాత, ఇన్సూర్డ్ డిక్లేర్డ్ వ్యాల్యూ (ఐడీవీ)ను ఎంచుకోవాలి. తర్వాత ప్రీమియం చెల్లించిన నిమిషాల వ్యవధిలోనే పాలసీ ఈ మెయిల్‌కు వచ్చేస్తుంది. ఈ ప్రక్రియ కేవలం ఐదారు నిమిషాల వ్యవధిలోనే పూర్తయిపోతుంది.

**క్లెయిమ్ ప్రక్రియ సులభం...**

ప్రమాదం కారణంగా వాహనానికి నష్టం జరిగితే దేశవ్యాప్తంగా 1,000కుపైగా గ్యారేజ్‌లలో నగదు రహిత సేవలు పొందొచ్చు. క్లెయిమ్ కోసం కంపెనీ టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. లేదా కంపెనీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. ఒకవేళ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీ నగరాల్లో ఉన్న వారికి రిపేర్ కోసం వాహనాన్ని 60 నిమిషాల వ్యవధిలోనే పిక్ చేసుకుంటారు. కంపెనీ సర్వేయర్ వాహనానికి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తారు. ఇతర పట్టణాల్లోని వారు తామే స్వయంగా వాహనాన్ని కంపెనీ నిర్దేశించిన గ్యారేజ్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. కారు ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, బీమా పాలసీ జిరాక్స్ కాపీ అవసరపడతాయి. క్లెయిమ్‌ను కంపెనీ ఆమోదిస్తే నగదు రహితంగా గ్యారేజ్‌లో రిపేర్ చేసి డెలివరీ చేస్తారు. కంపెనీ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. మొత్తం క్లెయిమ్‌లలో 72.4 శాతం 15 రోజుల్లోనే పరిష్కారం అవుతున్నాయి. 90 రోజుల వ్యవధిలో ఇది 99.5 శాతంగా ఉంది. వారంలో అన్ని రోజులూ, రోజులో 24 గంటల పాటు కస్టమర్ సపోర్ట్ సేవలు అందుబాటులో ఉంటాయి.

### గో డిజిట్ ఇన్సూరెన్స్

ఈ సంస్థ కూడా 2017లోనే ఆరంభమైంది. కార్లు, బైక్‌లు, సైకిళ్లు, ట్రావెల్, హోమ్, మొబైల్ ఫోన్లకు ఇన్సూరెన్స్ పాలసీలను ఆఫర్ చేస్తోంది. జీరో డిప్రిసియేషన్ కవర్, ఇంజన్ ప్రొటెక్షన్ కవర్, రిటర్న్ టూ ఇన్‌వాయిస్ కవరేజీలు ఇందులో ఉన్నాయి. థర్డ్ పార్టీ లయబిలిటీ కవర్‌ను కూడా విడిగా తీసుకోవచ్చు. అకో జనరల్ ఇన్సూరెన్స్ మాదిరిగానే సాధారణ మినహాయింపులు ఇందులోనూ ఉన్నాయి.

**కొనుగోలు...**

కంపెనీ వెబ్‌సైట్‌కు వెళ్లి కారు లేదా బైక్ వీటిల్లో వాహనం ఏదన్నది ఎంచుకుని, బ్రాండ్, మోడల్‌ను సెలక్ట్ చేసిన తర్వాత, పూర్వపు బీమా సంస్థ వివరాలను ఇవ్వాలి. దాంతో ప్రీమియం ఎంతన్న వివరాలు అక్కడ కనిపిస్తాయి. ప్రీమియం చెల్లించిన అనంతరం మెయిల్‌కు పాలసీ జారీ అయిపోతుంది.



**క్లెయిమ్ ప్రక్రియ...**

దేశవ్యాప్తంగా 1,400 గ్యారేజ్‌లలో నగదు రహిత సేవలు అందుబాటులో ఉన్నాయి. కంపెనీ టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి క్లెయిమ్ వివరాలను రికార్డ్ చేసుకోవాలి. దాంతో మీ మొబైల్‌కు స్వీయ తనిఖీ పత్రం లింక్ ద్వారా వస్తుంది. వాహనానికి నష్టం జరిగితే మొబైల్ ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ ఇమేజ్‌లను గో డిజిట్ టీమ్ పరిశీలించిన అనంతరం ఎంత మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చన్న సమాచారాన్ని అందిస్తుంది. అవసరమైతే సంబంధిత డాక్యుమెంట్లను కూడా అప్‌లోడ్ చేయాల్సి వస్తుంది. అనంతరం నగదు రహిత సేవలు అందుబాటులో ఉన్న గ్యారేజ్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. వాహనం మీ నుంచి పిక్ చేసుకుని, రీపెయిర్ తర్వాత తిరిగి అందించే సేవలను కూడా కంపెనీ ఆఫర్ చేస్తోంది. కంపెనీ చెబుతున్న వివరాల ప్రకారం.. 2018–19 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ పరిహారం చెల్లింపుల రేషియో 94.84 శాతం. ద్విచక్ర వాహన క్లెయిమ్‌కు సగటున 11 రోజుల సమయం తీసుకుంటుంది.

### ప్రీమియం అంతరాన్ని పరిశీలిస్తే...

**రెండు సంవత్సరాల వయసున్న మారుతి సుజుకీ బాలెనో, ఐడీవీ విలువ రూ.5.03 లక్షలకు సమగ్ర కవరేజీతో (వ్యక్తిగత ప్రమాద బీమాతో కూడిన) ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ నుంచి పాలసీ తీసుకుంటే చెల్లించాల్సిన ప్రీమియం రూ.14,604. ఇందులో రోడ్డు సైడ్ అసిస్టెన్స్‌కు రూ.199 కూడా కలిసి ఉంది. అదే గో డిజిట్‌లో అయితే ఇదే వాహనానికి ప్రీమియం రూ.11,015, అకోలో రూ.9,276గా ఉన్నాయి.**

### ఐసీఐసీఐ లాంబార్డ్

మోటారు వాహన పాలసీల విభాగంలో ఐసీఐసీఐ లాంబార్డ్ చాలా పెద్ద సంస్థ. కేవలం మోటారు పాలసీల నుంచే 2018–19లో ఈ సంస్థ రూ.6,400 కోట్ల ప్రీమియం రాబట్టింది. అకో జనరల్ రూ.75 కోట్ల ప్రీమియం పొందగా, గో డిజిట్ రూ.854 కోట్ల ప్రీమియం ఆదాయం సంపాదించాయి. ఇతర సంస్థల మాదిరే ఐసీఐసీఐ లాంబార్డ్ మోటారు బీమాలోనూ అన్ని రకాల ఫీచర్లు, యాడాన్ కవరేజీలు అందుబాటులో ఉన్నాయి.

**కొనుగోలు...**

కారు నంబర్ లేదా బ్రాండ్ పేరు, ఏ సంవత్సరం మోడల్ తదితర వివరాలను ఇవ్వడం ద్వారా ఐసీఐసీఐ లాంబర్డ్ ఆన్‌లైన్ పోర్టల్ నుంచి మోటారు పాలసీ తీసుకోవచ్చు. అన్ని రకాల వాహన పాలసీలు కూడా అందుబాటులో ఉన్నాయి. వాహనం వివరాలను పేర్కొన్న తర్వాత ప్రీమియం వివరాలు కనిపిస్తాయి. భిన్న ఫీచర్లతో తీసుకుంటే ప్రీమియం ఏ మేరకు అన్న వివరాలు కూడా కనిపిస్తాయి. నచ్చిన దానిని ఎంపిక చేసుకుని ప్రీమియం చెల్లించాలి. ఆ సమయంలో ఎటువంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం ఉండదు. జీరో డిప్రిసియేషన్, ఇంజన్ ప్రొటెక్షన్, కీ ప్రొటెక్ట్, కన్స్యూమబుల్స్ కవరేజీలను ప్రధాన పాలసీకి జత చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనే కాకుండా కంపెనీకి దేశవ్యాప్తంగా విస్తృత సంఖ్యలో శాఖలు కూడా ఉన్నాయి. సమీపంలోని శాఖకు వెళ్లి కూడా పాలసీ తీసుకోవచ్చు.

**క్లెయిమ్ ప్రక్రియ...**



దేశవ్యాప్తంగా 8,300 గ్యారేజ్‌లలో నగదు రహిత సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో లేదా సమీపంలోని శాఖకు వెళ్లి క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ విధానంలో అయితే 'ఇన్స్యూర్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. లైవ్ వీడియో స్ట్రీమింగ్ సదుపాయం 'ఇన్‌స్టాస్పెక్ట్' ఈ యాప్‌లో ఉంటుంది. దీని ద్వారా క్లెయిమ్‌ను నమోదు చేసుకోవడం ద్వారా సర్వేయర్ నుంచి వేగంగా క్లెయిమ్‌కు అనుమతి పొందొచ్చు. అవసరమైన పత్రాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉచితంగా మీ నుంచి వాహనాన్ని స్వీకరించి గ్యారేజీకి తీసుకెళ్లే ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. సమీపంలో ఉన్న కంపెనీ నెట్‌వర్క్ గ్యారేజ్‌కు తీసుకెళ్లి రీపెయిర్ చేసి వాహనదారుడికి తిరిగి అందిస్తారు. 2018–19 సంవత్సరంలో క్లెయిమ్ చెల్లింపుల నిష్పత్తి 98.8 శాతంగా ఉందని కంపెనీ సమాచారం తెలియజేస్తోంది. 24 గంటల పాటు కస్టమర్ సేవలు అందుబాటులో ఉంటాయి.



### ఎంపిక ఏది..?

- ఆన్‌లైన్లో డిజిటల్ పాలసీలు తీసుకోవడం ద్వారా ప్రీమియం రూపంలో భారీ ఆదా చేసుకోవచ్చు. అమేజాన్ కస్టమర్లు అకో నుంచి ఇంకా చౌకకే పాలసీ పొందే అవకాశం ఉంది.
- గో డిజిట్‌లో యాడాన్ కవరేజీలు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. థర్డ్ పార్టీ స్టాండలోన్ కవరేజీ కూడా ఉంది. కానీ, అకో వద్ద ఇవి లేవు.
- అకో, గో డిజిట్ చెల్లింపుల రేషియో 99 శాతం దగ్గరగానే ఉండడం గమనార్హం.
- ముఖ్యంగా పాలసీ కొనుగోలు చేసే ముందు, ఆయా సంస్థ ఆఫర్ చేస్తున్న నెట్‌వర్క్ గ్యారేజీలు మీ ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయా..? అన్నది గమనించాలి.
- అదే ఐసీఐసీఐ లాంబార్డ్ నుంచి అయితే ప్రీమియం ఎక్కువ. కానీ, నెట్‌వర్క్ గ్యారేజీలు విస్తృతంగా ఉన్నాయి. ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్‌లోనూ పాలసీ, క్లెయిమ్‌లకు అవకాశం ఉంటుంది. అయితే ఆన్‌లైన్ సౌకర్యంగా అనిపించని వారికి అనుకూలం.
- ఒక నిర్ణయానికి ముందు నిపుణుల సలహా మంచిది.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (ఫిబ్రవరి-25-2020 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 5.75 | 6 | 6.1 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.4 | 6.5 | 6.5 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 5.5 | 6 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.3 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 5.9 | 6.3 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.2 | 6.2 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 5.9 | 6.45 | 6.25 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.05 | 6.3 | 6.3 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6 | 6.3 | 6.4 |
| కరూర్ వైశ్యా బ్యాంక్ | 5.9 | 6.25 | 6.3 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.25 | 6.75 | 6.75 |
| హెచ్‌ఎస్‌బీసీ | 5 | 5.6 | 5.75 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 5.8 | 6.25 | 6.25 |
| కర్ణాటక బ్యాంక్ | 6.25 | 6.5 | 6.4 |
| ఎస్‌బీఐ | 5.5 | 6 | 6 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.25 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.5 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# అమెరికా ఈక్విటీల్లో పెట్టుబడుల కోసం

## ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యూఎస్ బ్లూచిప్ ఫండ్

మన మార్కెట్లతో పోలిస్తే అమెరికా స్టాక్ మార్కెట్లలో పరిపక్వత ఎక్కువ. అలాగే అస్థిరతలు కొంచెం తక్కువ. ప్రపంచంలో ఆర్థికంగా బలీయమైన స్థానంలో ఉన్న అమెరికాలోని స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడం మంచి నిర్ణయమే అవుతుంది. పెట్టుబడులకు వైవిధ్యం ఎంతో అవసరం. ఆ విధంగా చూసినా అమెరికా ఈక్విటీలకు కొంత పెట్టుబడులు కేటాయించుకోవడం మంచిది. ఇలా అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లోని లిస్టెడ్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశం కల్పిస్తున్న ఫండ్స్‌లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యూఎస్ బ్లూచిప్ ఫండ్ కూడా ఒకటి.

పెట్టుబడులు అన్నింటినీ తీసుకెళ్లి ఒకే చోట ఇన్వెస్ట్ చేయడం సూచనీయం కాదు. ఈక్విటీ, డెట్ రెండు రకాల సాధనాల్లోనూ పెట్టుబడులు వర్గీకరించుకోవడం వైవిధ్యం అవుతుంది. ఇది రిస్క్‌ను తగ్గిస్తుంది. ఇక ఈక్విటీల్లోనూ వైవిధ్యం కోసం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యూఎస్ బ్లూచిప్ ఫండ్ వీలు కల్పిస్తుంది. పెట్టుబడులు అన్నింటినీ తీసుకెళ్లి మన ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేసుకోవడానికి బదులు, కొంత మేర అమెరికా స్టాక్స్‌కూ కేటాయించుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. ఎందుకంటే గత రెండేళ్లుగా మన స్టాక్ మార్కెట్లలో అస్థిరతలు బాగా పెరిగాయి. ఈ సమయంలో కేవలం ఎంపిక చేసిన బ్లూచిప్ స్టాక్స్ మాత్రమే ర్యాలీ చేశాయి. కానీ, ఇదే కాలంలో అమెరికా స్టాక్స్ మంచి పనితీరు ప్రదర్శించాయి. కనుక ఇన్వెస్టర్లు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

**పెట్టుబడుల విధానం..**

ఫండ్ రివ్యూ

ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడులను ఇవ్వడమనే విధానంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యూఎస్ బ్లూచిప్ ఫండ్ పనిచేస్తుంది. ముఖ్యంగా ఈ పథకం తన పెట్టుబడులను అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్టెడ్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తుంది. అలాగే, భారత్, ఇతర విదేశీ కంపెనీలు జారీ చేసే ఏడీఆర్, జీడీఆర్‌లలోనూ పెట్టుబడులు పెడుతుంది. అందులోనూ లార్జ్ క్యాప్ కంపెనీలకే పెట్టుబడులను పరిమితం చేస్తుంది. ప్రస్తుతం ఈ పథకం తన దగ్గరున్న నిధుల్లో 95.1 శాతం మేర స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన మొత్తాన్ని నగదు, నగదు సమాన రూపాల్లో కలిగి ఉంది. ఇక ఈక్విటీ మొత్తం పెట్టుబడుల్లో 94 శాతం మెగాక్యాప్, 6 శాతం లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. మనదేశంలో




ఇన్వెస్ట్ చేసే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో అధిక శాతం (సెక్టార్ ఫండ్స్ కాకుండా) బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ స్టాక్స్‌కే అగ్ర ప్రాధాన్యం ఇస్తాయి. కానీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యూఎస్ బ్లూచిప్ ఫండ్ అమెరికా స్టాక్స్‌లో హెల్త్‌కేర్ రంగానికి అగ్ర ప్రాధాన్యం ఇచ్చింది. ఈ రంగానికి చెందిన కంపెనీల్లో 25% ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత 18% పెట్టుబడులను టెక్నాలజీ కంపెనీల్లో, 12% ఎఫ్‌ఎంసీజీలకు కేటాయించగా, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 7 శాతం కేటాయింపులు చేసింది.

**రాబడులు**

ఆరంభం నుంచి ఆకర్షణీయంగానే ఉంది. ఏడాది కాలంలో 9.71% రాబడులను ఇచ్చింది. గడిచిన మూడేళ్లలో చూసుకుంటే వార్షిక రాబడులు 12.52 శాతం. ఐదేళ్లలో 11.54%, ఏడేళ్లలో 15.35% చొప్పున వార్షిక రాబడులను ఇచ్చినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక ఇన్వెస్టర్లు కనీసం ఐదేళ్లు, అంతకంటే దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసుకోవాలనుకునే వారు, ఈ పథకాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. అప్పుడే ఆశించిన రాబడులకు అవకాశం ఉంటుంది. లార్జ్‌క్యాప్ ఫండ్ కనుక సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇంకాస్త మెరుగైన రాబడులకు వీలుంటుంది.

### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| అమెజాన్. డాట్‌కామ్ ఐఎన్‌సీ | 5.26 |
| కార్టెవా ఐఎన్‌సీ | 3.09 |
| బెర్క్‌షైర్ హాత్‌వే | 2.99 |
| వీవా సిస్టమ్స్ | 2.98 |
| సేల్స్‌ఫోర్స్ | 2.95 |
| ఇంటెల్ కార్పొరేషన్ | 2.82 |
| బయోజెన్ ఐడెక్ | 2.78 |
| ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ | 2.77 |
| ఆల్ట్రియా గ్రూప్ | 2.77 |
| ఫైజర్ ఐఎన్‌సీ | 2.74 |

epaper.sakshi.com



ఒక వ్యక్తి ఏ తప్పూ చేయలేదంటే...
అతను ఎప్పుడూ కొత్తగా ఆలోచించలేదని అర్థం!
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

## బొమ్మ-బొరుసు



# 'కోవిడ్'పైనే దృష్టి..!

- ఏడేళ్ల కనిష్టానికి జీడీపీ వృద్ధి, 4.7 శాతానికే పరిమితం
- తగ్గిన మారుతీ అమ్మకాలు.. కొనసాగుతోన్న మందగమనం
- సోమవారం తయారీ, బుధవారం సేవా రంగాల డేటా వెల్లడి
- ఈ వారంలోనూ కోవిడ్‌–19 వైరస్‌ పరిణామాలే నడిపిస్తాయ్‌..



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాలు విసురుతోన్న కోవిడ్‌–19 (కరోనా) వైరస్‌.. చైనా నుంచి మొదలుకుని అమెరికా స్టాక్‌ మార్కెట్‌ వరకు అన్ని దేశాల ప్రధాన సూచీలను కుప్పకూల్చేసింది. ఈ వైరస్‌ పేరు వింటేనే ప్రపంచ వ్యాప్తంగా బుల్స్‌ వణికిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే దేశీ స్టాక్‌ మార్కెట్‌ గతవారంలో భారీ నష్టాలను చవిచూసింది. గడిచిన వారంలో సెన్సెక్స్‌ 2,873 పాయింట్లు (6.9 శాతం), నిఫ్టీ 879 పాయింట్లు (7.2 శాతం) నష్టపోయాయి. శుక్రవారం ఒక్కరోజులోనే బీఎస్‌ఈ సెన్సెక్స్‌ 1,448 పాయింట్లు పతనమై 38,297 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 432 పాయింట్లు నష్టపోయి 11,202 పాయింట్ల వద్దకు పడిపోయింది. సెన్సెక్స్‌ చరిత్రలోనే ఇది రెండో అత్యంత భారీ పతనంగా నమోదైంది. ఇంతటి పతనానికి కారణమైన కరోనా వైరస్‌ పరిణామాలే ఈ వారంలో దేశీ మార్కెట్‌కు దిశా నిర్దేశం చేయనున్నాయని దలాల్‌స్ట్రీట్‌ వర్గాలు భావిస్తున్నాయి.

**ఈ వారంలో సూచీలు కోలుకునేనా..?**
కరోనా వైరస్‌ గురించి ఎప్పుడు ఇంకేం వినాల్సి వస్తుందో అనే అంశంపైనే మార్కెట్‌ వర్గాలు దృష్టి సారించాయి. తాజాగా అమెరికాలోని వాషింగ్టన్‌లో కోవిడ్‌–19 కారణంగా ఓ వ్యక్తి మృతి చెందినట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. చైనాలోని వూహాన్‌లో ఉద్భవించిన ఈ వైరస్‌.. చివరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నగా ఉన్న అమెరికాకు సైతం సోకడం మరింత కలవర పెడుతోంది. ఈ ప్రాణాంతక వైరస్‌ కారణంగా పరిశ్రమలు మూత పడి ఆర్థిక వ్యవస్థ మరింత మందగమనంలోకి జారిపోవచ్చనే భయాలు మార్కెట్‌ వర్గాల్లో పెరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు ఈ వైరస్‌ వ్యాప్తిని అరికట్టడం పట్ల ఎంత మేర విజయం సాధిస్తాయనే అంశం ఆధారంగానే మార్కెట్‌ కోలుకోవడం అనే అంశం ముడిపడి ఉందని జియోజిత్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ పరిశోధనా విభాగం చీఫ్‌ వినోద్‌ నాయర్‌ విశ్లేషించారు. ఇక డిసెంబర్‌ త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి రేటు ఏడేళ్ల కనిష్టానికి తగ్గిపోయింది. శుక్రవారం వెల్లడైన గణాంకాల ప్రకారం.. జీడీపీ 4.7 శాతంగా నమోదైంది. ఏడేళ్ల కనిష్టానికి పడిపోయింది. దేశ ఆర్థిక వృద్ధి రేటు కొంతమేర ఆశాజనకంగానే ఉన్నా మార్కెట్‌ నిలదొక్కుకునేదని ఎమ్కే వెల్త్‌ మేనేజ్‌మెంట్‌ రీసెర్చ్‌ హెడ్‌ జోసెఫ్‌ థామస్‌ విశ్లేషించారు. అంతర్జాతీయ అంశాలు, కరోనా వైరస్‌ పరిణామాలే ఈ వారంలో దేశీ సూచీలను నడిపిస్తాయని శామ్కో సెక్యూరిటీస్‌ సీఈఓ జిమిత్‌మోడీ అన్నారు.

**గణాంకాల ప్రభావం...**
మార్కెట్‌ తయారీ పీఎంఐ సోమవారం వెల్లడికానుండగా.. సర్వీసెస్‌ పీఎంఐ గణాంకాలు బుధవారం వెలువడనున్నాయి. అమెరికా మార్కెట్‌ తయారీ పీఎంఐ సోమవారం విడుదలకానుంది. మరోవైపు శుక్రవారం వెల్లడైన జీడీపీ డేటా ప్రభావం సోమవారం తొలి ట్రేడింగ్‌ సెషన్‌పై ప్రభావం చూపనుందని మార్కెట్‌ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఆదివారం వెల్లడైన ఆటో రంగ ఫిబ్రవరి నెల అమ్మకాలు కూడా నిరాశాజనకంగానే ఉన్నాయి. దేశీ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతీ విక్రయాలు గత నెలలో 1.6% పడిపోయాయి.

**ఫిబ్రవరిలో రూ. 6,554 కోట్ల పెట్టుబడి...**
విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గతనెల్లో రూ. 6,554 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు డిపాజిటరీల డేటా ద్వారా వెల్లడయింది. ఫిబ్రవరి 3–28 కాలంలో ఈక్విటీ మార్కెట్లో రూ. 1,820 కోట్లు, డెట్‌ మార్కెట్లో రూ. 4,734 కోట్లను వీరు కుమ్మరించారు. మార్కెట్‌ గతవారం భారీ నష్టాలను చవిచూసినప్పటికీ.. వీరి పెట్టుబడులు ఈ స్థాయిలో నమోదు కావడం విశేషం.

## మెరుగ్గా జీఎస్‌టీ వసూళ్లు

ఫిబ్రవరిలో 1.05 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) రూపంలో ఫిబ్రవరి నెలలో రూ.1,05,366 కోట్ల ఆదాయం సమకూరింది. క్రితం ఏడాది ఇదే నెలలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే 8 శాతం పెరిగింది. అంతేకాదు, ఆర్థిక మందగమన పరిస్థితుల్లో జీఎస్‌టీ ఆదాయం రూ.లక్ష కోట్ల పైనే కొనసాగడం సానుకూలతను తెలియజేస్తోంది. అయితే, ఈ ఏడాది జనవరి నెలలో వసూలైన రూ.1.10 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం స్వల్పంగా తగ్గింది.

## పీఎఫ్‌ఎంఎస్‌ పటిష్టతకు టెక్నాలజీ ఊతం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ సూచన

**న్యూఢిల్లీ:** పబ్లిక్‌ ఫైనాన్స్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టం (పీఎఫ్‌ఎంఎస్‌) యంత్రాంగాన్ని సమర్థంగా తీర్చిదిద్దేందుకు, పటిష్టం చేసేందుకు కొత్త టెక్నాలజీలను మరింతగా ఉపయోగించుకోవాలని సివిల్‌ అకౌంట్స్‌ అధికారులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ సూచించారు. కొంగొత్త మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. 44వ సివిల్‌ అకౌంట్స్‌ డే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ విషయాలు తెలిపారు. దేశం మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు పీఎఫ్‌ఎంఎస్‌లో టెక్నాలజీపరంగా విప్లవాత్మక మార్పులు తోడ్పడ్డాయని మంత్రి పేర్కొన్నారు. చెల్లింపుల ప్రాసెసింగ్‌, పర్యవేక్షణ, సమన్వయం, ఖాతాల తనిఖీ తదితర అంశాల్లో ప్రభుత్వ విభాగాలకు పీఎఫ్‌ఎంఎస్‌ తోడ్పాటు అందిస్తుంది.



### పనితీరు ఆధారంగానే పన్ను అధికారులకు పోస్టింగ్‌: సీబీడీటీ



**ముంబై:** కేంద్ర ప్రభుత్వం ఇటీవలే తీసుకొచ్చిన 'వివాద్‌ సే విశ్వాస్‌' పథకం కింద.. ఆదాయ పన్ను శాఖ క్షేత్రస్థాయి అధికారులు పన్ను వసూళ్లలో చూపించిన పనితీరు ఆధారంగానే, వారి వార్షిక పనితీరు మదింపు, పోస్టింగ్‌లు ఆధారపడి ఉంటాయని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) స్పష్టం చేసింది. ముఖ్యంగా భవిష్యత్తు పోస్టింగ్‌ల్లో పన్నుల వసూళ్లే పెద్ద పాత్ర పోషిస్తాయని తేల్చి చెప్పింది. పన్ను అంశాలకు సంబంధించి ఆదాయపన్ను శాఖతో ఏర్పడిన వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం వివాద్‌ సే విశ్వాస్‌ పథకాన్ని 2020–21 బడ్జెట్‌లో ప్రకటించింది. దీని కింద మార్చి ఆఖరు నాటికి కనీసం రూ.2 లక్షల కోట్ల మేర పన్ను ఆదాయం సమకూర్చుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. పార్లమెంట్‌ బడ్జెట్‌ సమావేశాలు తిరిగి సోమవారం ప్రారంభం కానుండగా, అదే రోజు ఈ పథకం ప్రారంభం కానుంది.

## గుజరాత్‌ గ్యాస్‌ | బ్రోకరేజ్‌ సంస్థ: మోతీలాల్‌ ఓస్వాల్‌ | కొనొచ్చు

స్టాక్స్‌ వ్యూ



**ప్రస్తుత ధర: రూ.276** **టార్గెట్‌ ధర: రూ.340**
**ఎందుకంటే:** భారత్‌లోని పెద్ద సిటీ గ్యాస్‌ డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీల్లో ఒకటి. 20వేల కిమీ. గ్యాస్‌ పైప్‌లైన్‌ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది. గుజరాత్‌లో 12 లక్షలకు పైగా కుటుంబాలకు నేచురల్‌ గ్యాస్‌ను సరఫరా చేస్తోంది. ప్రస్తుతం 291 సీఎన్‌జీ స్టేషన్లను నిర్వహిస్తోంది. లిక్విఫైడ్‌ నేచురల్‌ గ్యాస్‌(ఎల్‌ఎన్‌జీ) ధరలు తగ్గుతుండటం వల్ల ఈ కంపెనీ లాభదాయకత మెరుగుపడగలదు. 2019లో 6 డాలర్లుగా ఉన్న ఎల్‌ఎన్‌జీ ధర ఈ ఏడాది 3 డాలర్లకు తగ్గిపోయింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరాలు జోరుగా ఉండటంతో ఎల్‌ఎన్‌జీ ధరలు బాగా తగ్గాయి. మోర్బిలో ఉన్న ప్లాంట్‌ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతోంది. జాతీయ హరిత ట్రిబ్యునల్‌ ఇంధన వినియోగం నిబంధనలను కఠినతరం చేస్తుండటంతో భవిష్యత్తులో ఎల్‌ఎన్‌జీకి డిమాండ్‌ పెరుగుతుంది. పారిశ్రామికంగా కాలుష్యం అధికంగా గల పారిశ్రామిక క్లస్టర్లలో ఎల్‌ఎన్‌జీ వినియోగం పెంచడం ద్వారా ఆ సమస్య(పారిశ్రామిక కాలుష్యం) నుంచి గట్టెక్కే అవకాశాలున్నాయి. అందుకే భవిష్యత్తులో పారిశ్రామిక రంగం నుంచి ఎల్‌ఎన్‌జీకి డిమాండ్‌ మరింతగా పెరగనున్నది. మూడేళ్లలో గుజరాత్‌లో వంద సీఎన్‌జీ స్టేషన్లను ఏర్పాటు చేయాలని గుజరాత్‌ గ్యాస్‌ భావిస్తోంది. వాహన కాలుష్యం తగ్గించడానికి ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోన్న నేపథ్యంలో సీఎన్‌జీకి డిమాండ్‌ పెరగనున్నది. గ్యాస్‌ లభ్యత గుజరాత్‌లో అధికంగానే ఉండటం, గ్యాస్‌/పైప్‌లైన్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలు తగిన స్థాయిలోనే ఆ రాష్ట్రంలో ఉండటం, ఈ కంపెనీకి సానుకూలాంశాలు. రెండేళ్లలో అమ్మకాలు 10 శాతం మేర పెరగగలవని అంచనా. ఎల్‌ఎన్‌జీ ధరలు పెరిగే అవకాశాలు, పోటీ పెరుగుతుండటం ప్రతికూలాంశాలు.

## బజాజ్‌ ఎలక్ట్రికల్స్‌ | బ్రోకరేజ్‌ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్‌ | కొనొచ్చు



**ప్రస్తుత ధర: రూ.408** **టార్గెట్‌ ధర: రూ.500**
**ఎందుకంటే:** భవిష్యత్తులో వృద్ధి జోరు పెంచుకోవడానికి లాభదాయకత అధికంగా ఉండే కన్సూమర్‌ డ్యూరబుల్స్‌(సీడీ) వ్యాపారంపైననే అధికంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. ఇంజినీరింగ్‌ అండ్‌ ప్రాజెక్ట్‌(ఈ అండ్‌ పీ) విభాగం ఆర్డర్లను తగ్గించుకుంటోంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం ఆర్డర్‌ బుక్‌ రూ.4,844 కోట్లుగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌ క్వార్టర్‌ నాటికి రూ.1,742 కోట్లకు తగ్గించుకుంది. ఫలితంగా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కంపెనీ ఆర్థిక అంశాలు మెరుగుపడగలవని భావిస్తున్నాం. రుణ భారం తగ్గించుకోవడానికి, వర్కింగ్‌ క్యాపిటల్‌ సైకిల్‌ను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవలనే రైట్స్‌ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించింది. ఈ రైట్స్‌ ఇష్యూ కారణంగా రుణానికి, ఈక్విటీగల నిష్పత్తి(డీ/ఈ) 1కి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 1.5గా ఉండేది. సీడీ వ్యాపారం పనితీరు బాగా ఉండనుండటం, ఈపీ విభాగం ఎక్స్‌పోజర్‌ తగ్గనుండటంతో 2021–22 ఆర్థిక సంవత్సరంలో డీ/ఈ నిష్పత్తి 1 కంటే తక్కువగానే నమోదు కావచ్చు. ఫ్యాన్లు, వాటర్‌ గీజర్‌ విభాగాల మార్కెట్‌ వాటా పెరగనున్నది. కన్సూమర్‌ డ్యూరబుల్‌ విభాగం ఆదాయం రెండేళ్లలో 12 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలదని భావిస్తున్నాం. ఫలితంగా రెండేళ్లలో ఆదాయం 7 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలదని అంచనా వేస్తున్నాం.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్‌ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## నేటి నుంచి ఎస్‌బీఐ కార్డ్స్‌ ఐపీఓ

- ప్రైస్‌బాండ్‌ రూ.750–755
- ఇష్యూ సైజు రూ.10,000 కోట్లు
- మార్చి 16న లిస్టింగ్‌



**న్యూఢిల్లీ:** కోవిడ్‌–19(కరోనా) వైరస్‌ కల్లోలంతో స్టాక్‌ మార్కెట్‌ నష్టాల్లో ఉన్న నేపథ్యంలో ఎస్‌బీఐ కార్డ్స్‌ అండ్‌ పేమెంట్‌ సర్వీసెస్‌ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్‌ పబ్లిక్‌ ఆఫర్‌)కు వస్తోంది. ఈ ఐపీఓ నేడు (సోమవారం) మొదలై మార్చి 5న ముగుస్తుంది. ఈ ఐపీఓ ప్రైస్‌బాండ్‌ను రూ.750–755గా నిర్ణయించారు. కనీసం 19 షేర్లకు(మార్కెట్‌ లాట్‌) దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ ఐపీఓలో భాగంగా రూ.500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. ఆఫర్‌ ఫర్‌ సేల్‌(ఓఎఫ్‌ఎస్‌) విధానంలో 13 కోట్లకు పైగా షేర్లను విక్రయిస్తారు. మొత్తం ఇష్యూ సైజు రూ.10,000 కోట్ల రేంజ్‌లో ఉంటుందని అంచనా. మార్చి 16న స్టాక్‌ మార్కెట్లో ఈ కంపెనీ షేర్‌ లిస్టవుతుంది.

# ఆటో రంగానికి వైరస్‌ కాటు...!

- 42 శాతం పడిపోయిన ఎం అండ్‌ ఎం ఫిబ్రవరి అమ్మకాలు
- మారుతి సుజుకీ, టాటా మోటార్స్‌ విక్రయాలు డౌన్‌



**న్యూఢిల్లీ:** దేశీ ఆటో పరిశ్రమకు కోవిడ్‌–19 (కరోనా) వైరస్‌ కుంగదీసింది. గతేడాదిలో భారీ పతనాన్ని నమోదుచేసి.. ఈ ఏడాది ప్రారంభంలో కాస్త పర్వాలేదు అనిపించిన ఈ రంగాన్ని తాజాగా కరోనా వైరస్‌ మళ్లీ పడేసింది. దిగ్గజ ఆటో సంస్థ మారుతి సుజుకీ దేశీయ వాహన విక్రయాలు ఫిబ్రవరి నెలలో 1.6 శాతం పడిపోయాయి. గత నెల్లో 1,36,849 యూనిట్లకు పరిమితమయ్యాయి. మహీంద్ర అండ్‌ మహీంద్ర (ఎం అండ్‌ ఎం) అమ్మకాలు ఏకంగా 42 శాతం క్షీణించాయి. కరోనా వైరస్‌ కారణంగా చైనా నుంచి సప్లై తగ్గడం వల్ల ఈ స్థాయి పతనం నమోదైందని సంస్థ చీఫ్‌ సేల్స్‌ అండ్‌ మార్కెటింగ్‌ (ఆటోమోటివ్‌ డివిజన్‌) వీజయ్‌ రామ్‌ నక్రా వెల్లడించారు. వైరస్‌ కారణంగానే తమ కంపెనీ ఫిబ్రవరి విక్రయాలు తగ్గాయని టాటా మోటార్స్‌ ప్యాసెంజర్‌ వెహికిల్స్‌ బిజినెస్‌ యూనిట్‌ ప్రెసిడెంట్‌ మయాంక్‌ పరీక్‌ తెలిపారు.

**ఫిబ్రవరి వాహన విక్రయాలు (దేశీయ)**

| కంపెనీ | 2020 | 2019 | వృ/క్షీ.(%) |
|---|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,36,849 | 1,39,100 | -1.6 |
| టాటా మోటార్స్‌ | 38,002 | 57,221 | -34 |
| హోండా కార్స్‌ | 7,269 | 13,527 | -46 |
| మహీంద్రా | 30,637 | 52,915 | -42 |
| హ్యుందాయ్‌ | 40,010 | 43,110 | -7.2 |
| ఎంజీ మోటార్స్‌ | 1,376 | - | - |

## బ్యాంకుల్లో తగ్గుముఖం పట్టిన రుణ వృద్ధి

**జనవరిలో 8.5 శాతంగా నమోదు**



**ముంబై:** బ్యాంకుల్లో రుణాల వృద్ధి జనవరిలో 8.5 శాతంగానే నమోదు అయింది. క్రితం ఏడాది ఇదే కాలంలో (2019 జనవరి) ఉన్న 13.5 శాతం రుణ వృద్ధితో పోలిస్తే 5 శాతం తగ్గినట్టు ఆర్‌బీఐ గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. సేవల రంగానికి రుణ వితరణ చాలా వరకు తగ్గింది. క్రితం ఏడాది ఇదే కాలంలో రుణ వితరణలో 23.9 శాతం వృద్ధి నమోదు కాగా, ఈ ఏడాది జనవరిలో ఇది 8.9 శాతానికి పరిమితమైంది. ఎన్‌బీఎఫ్‌సీ రంగ కంపెనీలకు ఇచ్చిన రుణాల వృద్ధి కూడా 48.3 శాతం నుంచి 32.2 శాతానికి తగ్గింది. అయితే, వ్యక్తిగత రుణాల్లో మాత్రం 16.9 శాతం వృద్ధి నమోదైంది. వ్యక్తులకు ఇచ్చే రుణాల్లో హౌసింగ్‌ 17.5 శాతం, విద్యా రుణాలు 3.1 శాతం చొప్పున నమోదయ్యాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రుణ వితరణ 7.6 శాతం వృద్ధి నుంచి 6.5 శాతానికి తగ్గింది.

## సెన్సెక్స్‌కు కీలక స్థాయి 37,415

**మార్కెట్‌ పంచాంగం**

కరోనావైరస్‌ పలు ప్రపంచదేశాల్లో తీవ్రంగా వ్యాప్తిచెందడంతో 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ఒకేవారంలో ఎన్నడూ చూడనంత పెద్ద పతనం అంతర్జాతీయ మార్కెట్లలో సంభవించింది. అమెరికా కేంద్ర బ్యాంక్‌ ఫెడరల్‌ రిజర్వ్‌...వడ్డీ రేట్ల కోత, ఇతర ఉద్దీపన చర్యలకు సిద్ధంగా వున్నట్లు గత శుక్రవారం ప్రకటించడంతో ఆరోజున అమెరికా స్టాక్‌ సూచీలు కనిష్టస్థాయి నుంచి చాలావరకూ కోలుకున్నప్పటికీ, ఈ ఉద్దీపన ప్రకటన ఇన్వెస్టర్లను సమీప భవిష్యత్తులో శాంతింపచేస్తుందా అన్నది అనుమానమే. చైనా కేంద్ర బ్యాంకు గత పదిరోజుల్లో ఇటువంటి ఎన్నో ఉపశమన చర్యలు తీసుకున్నప్పటికీ, ఆ దేశపు సూచీలు ఇంకా పతనబాటలోనే వున్నాయన్నది గమనార్హం. వ్యాధివ్యాప్తి తగ్గుముఖం పట్టి, ఉత్పత్తి, విక్రయాలు తిరిగి సాధారణస్థాయికి చేరుకుంటున్న సంకేతాలు కన్పిస్తేనే ఈక్విటీ మార్కెట్లు స్థిరపడగలుగుతాయన్నది అత్యధిక విశ్లేషకుల భావన. ఇక మన సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి.....

**సెన్సెక్స్‌ సాంకేతికాంశాలు...**




ఫిబ్రవరి 28తో ముగిసినవారంలో 38,220 పాయింట్ల కనిష్టస్థాయివరకూ పతనమైన బీఎస్‌ఈ సెన్సెక్స్‌ చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 2,873 పాయింట్ల భారీ నష్టంతో 38,297పాయింట్ల వద్ద ముగిసింది. గతవారపు భారీ కదలికల రీత్యా, ఈ వారం సైతం సెన్సెక్స్‌ ఎటువైపైనా వేగంగా ప్రయాణించవచ్చు. గతేడాది అక్టోబర్‌ 9నాటి 'స్వింగ్‌ లో' అయిన 37,415 స్థాయి ఈ వారం సెన్సెక్స్‌కు ముఖ్యమైన తక్షణ మద్దతు. ఈ మద్దతుస్థాయిని పరిరక్షించుకోగలిగినా, గ్యాప్‌అప్‌తో మొదలైనా.... క్రితంవారపు భారీ కరెక్షన్‌కు కౌంటర్‌ట్రెండ్‌ ర్యాలీ జరిగి 39,090 పాయింట్ల వద్దకు వెంటనే చేరగలదు. అటుపై 39,420 పాయింట్ల వరకూ ఎగిసే అవకాశం వుంటుంది. ఈ స్థాయిని సైతం అధిగమిస్తే 39,950–40,255 పాయింట్ల శ్రేణిని సైతం చేరే ఛాన్స్‌ వుంటుంది. అయితే తొలి మద్దతు స్థాయిని వదులుకుంటే డౌన్‌ట్రెండ్‌ మరింత వేగవంతమై 36,720 పాయింట్ల వరకూ క్షీణించవచ్చు. ఈ లోపున ముగిస్తే 35,990 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

**11,090 వద్ద మద్దతు పొందితే నిఫ్టీ సేఫ్‌...**




గతవారం ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 11,175 పాయింట్ల వరకూ పతనమై చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 879 పాయింట్ల భారీనష్టంతో 11,202పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లానే నిఫ్టీకి సైతం గతేడాది అక్టోబర్‌9 నాటి 'స్వింగ్‌ లో' అయిన 11,090 పాయింట్ల స్థాయి కీలకమైనది. ఈ స్థాయిని పరిరక్షించుకున్నా, గ్యాప్‌అప్‌తో మొదలైనా వేగంగా 11,385 పాయింట్ల స్థాయిని అందుకునే వీలుంటుంది. ఈ స్థాయిని అధిగమిస్తే 11,535 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపై 11,660–11.780 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. తొలి మద్దతుస్థాయిని కోల్పోతే వేగంగా 10,930 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. 2018 అక్టోబర్‌ 23నాటి 10,004 పాయింట్ల నుంచి ఈ ఏడాది జనవరి 20 నాటి 12,430 పాయింట్ల రికార్డుస్థాయివరకూ జరిగిన ర్యాలీకి ఈ 10,930 పాయింట్లు...61.8 శాతం ఫిబోనకి రిట్రేస్‌మెంట్‌ స్థాయి. ఈ స్థాయిని సైతం వదులుకుంటే ప్రస్తుత కరెక్షన్‌ మరెన్నో వారాలు కొనసాగే ప్రమాదం వుంటుంది. ఈ వారం ఈ స్థాయిని ముగింపులో కోల్పోతే 10,670 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్‌

## పీఎఫ్‌పై 8.65 శాతం వడ్డీ రేటు కొనసాగింపు!!



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–20)లో ప్రావిడెంట్‌ ఫండ్‌ డిపాజిట్లపై 8.65 శాతం వడ్డీ రేటునే కొనసాగించాలని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) భావిస్తున్నట్లు తెలుస్తోంది. మార్చి 5న జరిగే ట్రస్టీల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2018–19లో కూడా ఇదే రేటు ఉంది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరంలో దీన్ని 8.5 శాతానికి తగ్గించవచ్చన్న అంచనాలు ఉన్నాయి. పోస్టాఫీస్‌ పొదుపు పథకాలు, పబ్లిక్‌ ప్రావిడెంట్‌ ఫండ్‌ మొదలైన ఇతరత్రా చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్ల స్థాయికి ఈపీఎఫ్‌ వడ్డీ రేటును కూడా సవరించాలంటూ కార్మిక శాఖపై ఆర్థిక శాఖ ఒత్తిడి తెస్తుండటమే ఇందుకు కారణం. సాధారణంగా ప్రతీ ఆర్థిక సంవత్సరం వడ్డీ రేట్లను నిర్ణయించే విషయంలో ఆర్థిక శాఖ అభిప్రాయాలను కూడా కార్మిక శాఖ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్‌ -నెక్‌ /100కు రూ.ల్లో) 2-3-2020

| | |
|---|---|
| విశాఖ | 350–00 |
| చిత్తూరు | 368–00 |
| వరంగల్‌ | 319–00 |
| విజయవాడ | 340–00 |
| గోదావరి | 340–00 |
| 1–3–2020 ఫామ్‌ ధర... | |
| హైదరాబాద్‌ | 316–00 |

# రిటైరైన వాళ్లు ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయవచ్చా?

**ప్ర: నాకు ఇటీవలనే కొంత మొత్తంలో బోనస్‌ వచ్చింది. ప్రస్తుతం ఈ డబ్బులను ఖర్చు చేయకుండా మూడేళ్ల తర్వాత వాడుకుందామనుకుంటున్నాను. మూడేళ్ల కాలానికైతే డెట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయమని స్నేహితులు సలహా ఇస్తున్నారు. ఏ తరహా డెట్‌ ఫండ్‌లో ఇన్వెస్ట్‌ చేస్తే మంచిది ?**
*–శ్రావణి, విజయవాడ*

డెట్‌ ఫండ్స్‌ గత ఏడాది మిశ్రమ ఫలితాలనిచ్చాయి. డెట్‌ ఫండ్స్‌కు కూడా రిస్క్‌ ఉంటుందని గుర్తించాలి. అయితే గతంలో ఎప్పుడు ఆ రిస్క్‌ డెట్‌ ఫండ్స్‌పై ప్రభావం చూపలేదు. కానీ 2019లో మాత్రం డెట్‌ ఫండ్స్‌ ఆశించిన రాబడులను ఇవ్వలేకపోయాయి. అందుకని డెట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేసేటప్పుడు ఇప్పుడు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. షార్ట్‌–డ్యురేషన్‌ డెట్‌ ఫండ్స్‌లో మినహా మరే ఇతర డెట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయకపోవడమే మంచిది. డెట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేసేటప్పుడు ప్రయోగాలు చేయకండి. 1 లేదా 2 శాతం అదనపు రాబడుల కోసం ఇతర ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేస్తే మీ పెట్టుబడి విషయంలో అసలుకే ఎసరు రావచ్చు. ఏతావాతా మూడేళ్ల కాలానికి ఇన్వెస్ట్‌ చేయడానికి షార్ట్‌–డ్యురేషన్‌ డెట్‌ ఫండ్స్‌నే పరిగణనలోకి తీసుకోండి.

**ప్ర: నేను ప్రతినెలా కొంత మొత్తం మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేద్దామనుకుంటున్నాను. మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయడం నాకు ఇదే మొదటిసారి. స్వల్ప కాలిక ఆర్థిక లక్ష్యాలు, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలు సాధించడం కోసం ఏ తరహా ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్‌ చేయాలో సూచించండి.**
*–దీపక్‌, విశాఖపట్టణం*

మ్యూచువల్‌ ఫండ్స్‌లో కొత్తగా ఇన్వెస్ట్‌ చేసే మీ లాంటి వాళ్లు దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం హైబ్రిడ్‌ ఫండ్స్‌ను ఎంచుకోవాలి. కనీసం మూడేళ్లపాటు ఇన్వెస్ట్‌ చేయదల్చుకుంటేనే ఈ ఫండ్స్‌లో మదుపు చేయాలి. ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగిస్తే, మీరు మంచి రాబడులు పొందగలుగుతారు. ఈ ఫండ్స్‌ తమ మొత్తం నిధులు 65 శాతం ఈక్విటీలోనూ. 35 శాతం డెట్‌లోనూ ఇన్వెస్ట్‌ చేస్తాయి. స్టాక్‌ మార్కెట్‌ పతనసమయంలో మీ పెట్టుబడి దెబ్బతినకుండా ఈ డెట్‌ విభాగం రక్షణనిస్తుంది. మార్కెట్‌ బాగా పెరుగుతున్నప్పుడు ఈక్విటీ విభాగం మంచి రాబడులనిస్తుంది. మీరు మ్యూచువల్‌ ఫండ్స్‌కు కొత్త కాబట్టి, ముందే ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయకండి. మార్కెట్‌ గమనాన్ని బట్టి ఈక్విటీ ఫండ్స్‌ తీవ్రమైన ఒడిదుడుకులకు గురవుతాయి. ఆరంభంలోనే ఇలాంటి ఆటుపోట్లు ఎదుర్కోకుండా ఉండాలంటే, ఈక్విటీ ఫండ్స్‌ కంటే హైబ్రిడ్‌ ఈక్విటీ ఫండ్స్‌ను ఎంచుకోవడమే మంచిది. ఎస్‌బీఐ ఈక్విటీ హైబ్రిడ్‌ ఫండ్‌, మిరా అసెట్‌ హైబ్రిడ్‌ ఈక్విటీ ఫండ్‌లను పరిశీలించవచ్చు. ఇక స్వల్ప కాలిక ఆర్థిక లక్ష్యాల కోసం షార్ట్‌–డ్యురేషన్‌ ఫండ్స్‌ను ఎంచుకోండి. మరే ఇతర ఫండ్స్‌ వద్దు. స్వల్ప కాలిక ఆర్థిక లక్ష్యాల కోసం ఈక్విటీ ఫండ్‌లో ఎప్పుడూ ఇన్వెస్ట్‌ చేయకండి. ఇక మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఎప్పుడూ పెద్ద మొత్తంలో ఒకేసారి ఇన్వెస్ట్‌ చేయవద్దు. నెలకు కొంత మొత్తం చొప్పున సిస్టమేటిక్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ప్లాన్‌(సిప్‌) విధానంలో ఇన్వెస్ట్‌ చేయండి. ఇలా చేస్తే, మార్కెట్‌ పతన బాటలో ఉన్నప్పుడు మీకు యావరేజింగ్‌ ప్రయోజనాలు లభిస్తాయి. ఇక ప్రతి ఏడాది మీ సిప్‌మొత్తాలను కనీసం 10 శాతం మేర పెంచే ప్రయత్నాలు చేయండి. ఏడాదికి ఒక్కసారైనా, మీ ఫండ్స్‌ పనితీరును సమీక్షించండి.

**Q & A**



ధీరేంద్ర కుమార్‌
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్‌

**ప్ర: నేను ఇటీవలనే రిటైరయ్యాను. రిటైరైన వ్యక్తులు మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయడం సురక్షితమేనా ?**
*–బాబూమియా, హైదరాబాద్‌*

మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయడం సురక్షితమే కాకుండా అత్యంత ముఖ్యమైనది కూడా. మ్యూచువల్‌ ఫండ్స్‌ ఆస్తి కాదు. ఈక్విటీల్లోనూ, స్థిరాదాయ సాధనాల్లోనూ ఒక క్రమపద్ధతిలో ఇన్వెస్ట్‌ చేయడానికి మ్యూచువల్‌ ఫండ్స్‌ ఒక సాధనం. మీరు ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేశారనుకోండి. ఈ ఫండ్‌ పోర్ట్‌ఫోలియోలో వివిధ రంగాలకు చెందిన కంపెనీల షేర్లు ఉంటాయి. ఫలితంగా మీరు డైవర్సిఫికేషన్‌ ప్రయోజనాలు పొందవచ్చు. అంతే కాకుండా ఈ ఫండ్‌ను ఎంతో అనుభవం, నైపుణ్యం ఉన్న ఫండ్‌ మేనేజర్‌ నిర్వహిస్తాడు కాబట్టి, మంచి రాబడులే వచ్చే అవకాశాలుంటాయి. ఎక్కడెక్కడి నుంచో, ఎంతెంతో సమాచారం సేకరించి, శోధించి ఏ కంపెనీల్లో ఇన్వెస్ట్‌ చేయాలో, ఏ కంపెనీని విస్మరించాలో... ఇలాంటి ఎలాంటి తలనొప్పులు మీకు లేకుండా ఫండ్‌ మేనేజర్లు సరైన నిర్ణయాలు తీసుకుంటారు. ఇక స్థిరాదాయం వచ్చే ఫిక్స్‌డ్‌–ఇన్‌కమ్‌ ఫండ్స్‌ను తీసుకుంటే, వీటికి పన్ను ప్రయోజనాలు, లిక్విడిటీ అధికంగా ఉంటాయి. సాధారణంగా వ్యక్తులు ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులు పెట్టలేరు. కానీ ఓవర్‌నైట్‌, లిక్విడ్‌ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్‌ చేయడం ద్వారా ఈ ప్రయోజనాలు పొందవచ్చు. అందుకని రిటైరైన వాళ్లైనా, ఇప్పుడు సంపాదనలో ఉన్న వాళ్లైనా, ఎవరైనా సరే, మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మిస్‌ చేసుకోకూడదు. ఇది అత్యంత ముఖ్యమైన, సమంజసమైన ఇన్వెస్ట్‌మెంట్‌ సాధనం.






## ట్వీట్ కార్నర్

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిపై చేసిన 'స్ట్రీట్‌ఫుడ్' త్వరలో నగరంలో ప్రారంభం కాబోతుండటంపై సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. అదే విధంగా విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న మొజంజాహీ మార్కెట్ ఫొటోలను మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. *- సాక్షి, హైదరాబాద్*

# మూవీరూల్స్ @ రూ.100 కోట్లు!

**గూగుల్ నిషేధిత యాడ్స్‌తో కోట్లు గడిస్తున్న వెబ్‌సైట్**

**పైరసీ సినిమాలతో ఏడాదికి దాదాపు రూ.100 కోట్ల ఆదాయం**

**రోజుకు రూ.25 లక్షల వరకు సొమ్ము చేసుకుంటున్న వైనం**

**బెట్టింగ్, రమ్మీ, పోర్న్ తదితర యాడ్స్‌తో కాసుల పంట..**

**సాక్షి, హైదరాబాద్:** పైరసీ సినిమాలతో ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వెబ్‌సైట్ మూవీరూల్స్. ఎన్నిసార్లు నిషేధించినా.. ఈ వెబ్ సైట్ కొత్తరూపంలో పుట్టగొడుగులా పుట్టుకొస్తూనే ఉంది. ఇలా చేస్తే ఈ వెబ్‌సైట్‌కి ఏం లాభం అనుకుంటున్నారా? అక్కడికే వస్తున్నాం.. ఈ వెబ్‌సైట్ పైరసీ సినిమాలు ప్రసారం చేయడం వల్ల ప్రతీ రోజూ దాదాపు రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూర్చుకుంటుందని సమాచారం. నెలకు దాదాపుగా రూ.7.50 కోట్లు ఆదాయం అంటే ఏడాదికి దాదాపుగా రూ.100 కోట్ల ఆదాయం గడిస్తోంది. 'శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు'అన్న సామెతను వీరు ఫాలో అవుతున్నారు. ఎవరూ ప్లే చేయని, నిషేధిత, వివాదాస్పద, అసభ్యకర వాణిజ్య ప్రకటనల (యాడ్స్)ను మేం ప్రసారం చేస్తామంటూ ముందుకొస్తున్నారు. ఫలితంగా రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు.

**ఆదాయం ఎలా వస్తోందంటే..?**

సాధారణంగా వీరు కొత్త సినిమాలను విడుదలైన కొన్ని గంటల్లోనే రకరకాలుగా పైరసీ చేస్తారు. ఇందుకోసం మనదేశం, విదేశాల్లోనూ వీరికి మనుషులుంటారు. సినిమా రిలీజ్ రోజు మనదేశంలో అంతగా నిఘాలేని థియేటర్లను ఎంచుకుంటారు. ఇక విదేశాల్లో అయితే, కొన్ని థియేటర్లు వీరికి సినిమాను నేరుగా కాపీ చేసి ఇస్తాయి. దీని వల్ల ఈ వెబ్‌సైట్‌కి రేటింగ్ పెరుగుతుంది. సినిమా ఉచితంగా వస్తుండటంతో అన్ని వర్గాల వారు ఇందులో సినిమాలు చూస్తున్నారు. మిలియన్ల కొద్దీ ప్రేక్షకులు వచ్చారు. కానీ, సినిమాలు, యూట్యూబ్‌లు, టీవీల్లో కనిపించే వాణిజ్య ప్రకటనలు వీరికి రావు. వీరికి వచ్చే వాటిలో పోర్న్, బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ తది తర నిషేధిత వాణిజ్య ప్రకటనలు. వీటిపై నిషేధం ఉండటంతో వీరి యాడ్స్‌ను గూగుల్ ప్లే చేయదు. వాటిని ప్లే చేస్తే కేసులు నమోదవుతాయి. కనుక అలాంటివారు తమ వ్యాపార ప్రచారం కోసం మూవీరూల్స్‌ను ఆశ్రయిస్తారు. అందుకే, ఈ వెబ్ సైట్‌లో ఒక సినిమా లింక్ ఓపెన్ చేయగానే.. దాని విండో వెనకాలే నాలుగైదు యాడ్ పేజీలు




(పాప్‌అప్స్) మనకు తెలియకుండానే ఓపెన్ అవుతాయి. అలా మూవీరూల్స్ తన కస్టమర్ల వ్యాపారానికి ప్రచారం చేసి పెడుతోంది. ఎంతలేదన్నా.. రోజుకు రూ.25 లక్షలకుపైగానే దీని వ్యాపారం సాగుతోందని సమాచారం. వాస్తవానికి భారత ప్రభుత్వం ఈ సైట్‌ను ఎప్పుడో నిషేధించింది. నిషేధిస్తూనే ఉంది. కానీ, దీని డొమైన్‌లో స్పెల్లింగ్‌ను మార్చుకుంటూ పలు విదేశాల నుంచి ఆపరేట్ చేస్తుండటంతో ఈ సైట్ ఆపరేటర్లు పట్టుబడటం లేదు.

**భారతే ఎందుకు?**

ప్రపంచంలోనే జనాభా పరంగా మనదేశం రెండో అతిపెద్ద దేశం. ఇక్కడ అనేక భాషల్లో సినిమాల వ్యాపారం రూ.వందల కోట్లల్లో జరుగుతుంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ, పంజాబీ, గుజరాతీ, హిందీ, తెలుగు ప్రజలు ప్రపంచ నలుమూలలా ఉన్నారు. వీరిలో చాలా మంది నేరుగా థియేటర్లకి వెళ్లకుండా ఇలాంటి పైరసీ వెబ్‌సైట్లనే ఆశ్రయిస్తారు. పైగా మొబైల్స్ నుంచి ఈ వెబ్‌సైట్ల నుంచి సిని మాలు డౌన్‌లోడ్ చేయడం మరింత సులువు. అందుకే, ఈసైట్‌ను ఆశ్రయించేవారి సంఖ్య కోట్లలో ఉండటంతో మూవీరూల్స్ భారత్‌లో ఎన్నిసార్లు నిషేధించినా.. డొమైన్ స్పెల్లింగ్‌లో స్వల్పమార్పులతో వస్తూనే ఉంది. తన వ్యాపారాన్ని మూడు సినిమాలు.. ఆరు యాడ్లుగా చేసుకుంటూ కోట్లు గడిస్తోంది.

# నిమ్స్ ఖాళీ!

- నిపుణులు లేక గుండె, కాలేయ, కిడ్నీ మార్పిడి చికిత్సలు ప్రశ్నార్థకం
- ప్రస్తుతం నిమ్స్‌లో 133 పోస్టులు ఖాళీ.. కీలక విభాగాలకు జూనియర్లే దిక్కు

## పెరగని పదవీ విరమణ వయసు.. 60 ఏళ్లకే వైద్య నిపుణుల రిటైర్డ్ బాట

దేశంలోని ఎయిమ్స్ సహా పలు జాతీయ వైద్య కళాశాలల్లో వైద్యుల పదవీ విరమణ వయసు 67 నుంచి 70 ఏళ్లు..

ఉస్మానియా, గాంధీ సహా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్యుల పదవీ విరమణ వయసు 60 నుంచి 65 ఏళ్లు..

కానీ.. ఎయిమ్స్‌కు అనుబంధంగా కొనసాగుతున్న ప్రతిష్టాత్మక నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్యుల పదవీ విరమణ వయసు మాత్రం 60 ఏళ్లే..



దీంతో ఈ ఆస్పత్రిలో మంచి హస్తవాసి, పేరున్న వైద్య నిపుణుల సేవలు రోగులకు అందడంలేదు. వీరి పదవీ విరమణ వయసు పెంపుపై నిర్ణయం తీసుకోకపోవడంతో కీలకమైన కిడ్నీ, గుండె, కాలేయ మార్పిడి చికిత్సలు ప్రశ్నార్థకమవుతున్నాయి. ఈ వైద్యసంస్థలో వచ్చే జూలై చివరి నాటికి 12 మంది, 2022 నాటికి మరో 30 మంది సీనియర్ వైద్యులు రిటైర్డ్ కానున్నారు.

**సాక్షి, హైదరాబాద్:** నిమ్స్‌లో వైద్యుల పోస్టులు ఒక్కొక్కటే ఖాళీ అవుతున్నాయి. నెలకు సగటున ఇద్దరు వైద్యులు పదవీ విరమణ చేస్తున్నారు. అంతర్గత కుమ్ములాటలకు తోడు కార్పొరేట్ ఆస్పత్రులతో పోలిస్తే ఇక్కడ వేతనాలు తక్కువగా ఉండటంతో మరికొందరు వైద్యులు బయటి వేతనాలకు ఆశపడి ఆస్పత్రిని వీడుతున్నారు. ఎప్పటికప్పుడు ఖాళీల భర్తీకి ఆస్పత్రి యాజమాన్యం నోటిఫికేషన్లు ఇస్తున్నా.. ఇక్కడ పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావట్లేదు. వచ్చిన వారు కూడా రెండు మూడేళ్లకే వెళ్లిపోతున్నారు. ఉన్నతాధికారులు కూడా వీరిని ఆపే ప్రయత్నం చేయడం లేదు. ఫలితంగా 311 పోస్టులకు 133 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్, అడిషనల్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భారీగా ఖాళీ ఉండటంతో సూపర్ స్పెషాలిటీ వైద్యవిద్యపైనే కాదు.. రోగుల చికిత్సపైనా ప్రభావం చూపుతోంది. సీనియర్ వైద్యులు లేకపోవడంతో ఆ భారమంతా రెసిడెంట్లపై పడుతుంది. చికిత్సల్లో వారికి సరైన అనుభవం లేక, కీలక సమయంలో చేతులెత్తేస్తున్నారు. పదవీ విరమణ చేసిన కొందరు సీనియర్ వైద్యులు ఆ తర్వాత కూడా ఇక్కడ పనిచేసేందుకు సుముఖంగా ఉన్నా.. యాజమాన్యం విముఖత చూపుతోంది.

**జూనియర్లే పెద్దదిక్కు**

అంతర్గత విభేధాలకు తోడు కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి వచ్చిన ఆఫర్లతో ఇప్పటికే చాలామంది వైద్యులు నిమ్స్‌ను వీడిపోయారు. 60 ఏళ్లకే పదవీ విరమణ చేయాల్సి రావడంతో కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శేషగిరిరావు, మాజీ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రనాథ్, డయాబెటిక్ నిపుణుడు వెంకటేశ్వరరావు, డాక్టర్ నరేందర్, డాక్టర్ సుభాష్‌కౌల్, డాక్టర్ జీఎస్ఎన్ రాజు సహా ప్రముఖ అనస్తీషియన్ డాక్టర్ గోపీనాథ్, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ పెండ్యాల రామకృష్ణ, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ముకుందరెడ్డి సహా పలువురు ఆస్పత్రికి దూరమయ్యారు. న్యూరో ఫిజీషియన్ విభాగాధిపతి డాక్టర్ వీణా కుమారి ఇటీవల లండన్‌లో జరిగిన సదస్సులో ప్రసంగిస్తూ గుండెపోటుతో మృతి చెందారు. జూలై చివరి నాటికి యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాంరెడ్డి సహా సీటీ సర్జన్ ఆర్వీకుమార్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ బీరప్ప, డాక్టర్లు జోత్స్న, ఉషారాణి, నాగేశ్వరరావు, రాంమూర్తి, రూపం తదితర నిపుణులు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆయా విభాగాలకు జూనియర్లే పెద్దదిక్కు కానున్నారు.

### పేరు గొప్ప.. అన్నింటా తీసికట్టు

- నిమ్స్.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో పనిచేస్తున్న స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. ముఖ్యమంత్రే దీనికి ఛాన్సలర్‌గా ఉంటారు.
- ఎయిమ్స్ నిబంధనల ప్రకారం ఇక్కడ నియామకాలు, పదోన్నతులు ఉంటా యి. ఉస్మానియా, గాంధీలో త్రిటైర్ విధానం అమల్లో ఉండగా, నిమ్స్‌లో ఫోర్‌టైర్ విధానం అమల్లో ఉంది.
- ఉస్మానియాలో అసిస్టెంట్ కేడర్‌లో చేరిన ఓ వైద్యుడు ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫె సర్, చివరకు ప్రొఫెసర్ కేడర్‌కు చేరుకుంటారు. ఇందుకు తొమ్మిదేళ్లు పడుతుంది.
- నిమ్స్‌లో అసిస్టెంట్ కేడర్‌లోని వైద్యుడు అసోసియేట్, అడిషనల్ ప్రొఫెసర్ కేడర్లను దాటుకుని ప్రొఫెసర్ కేడర్‌కు చేరుకోవాల్సి వస్తుంది. ఇక్కడ ప్రొఫెసర్ కేడర్ రావడానికి 12 నుంచి 14 ఏళ్లు పడుతోంది.
- ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు ప్రైవేటు ప్రాక్టీసు చేసుకునే అవకాశముంది. ఆరోగ్యశ్రీ ఇంటెన్సివ్స్ కూడా వీరికి అందుతాయి. కానీ నిమ్స్ వైద్యుల బయటి ప్రాక్టీస్ నిషేధం. ఆరోగ్యశ్రీ ఇంటెన్సివ్స్ కూడా వీరికి అందవు. కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులతో పోలిస్తే వీరి వేతనాలు చాలా తక్కువ.

### నిమ్స్‌లో ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలు

| పోస్టు పేరు | పోస్టులు | ఖాళీలు |
|---|---|---|
| ప్రొఫెసర్ | 64 | 30 |
| అడిషనల్/అసోసియేట్ | 86 | 11 |
| అసిస్టెంట్ ప్రొఫెసర్ | 161 | 92 |
| మొత్తం | 311 | 133 |

ఇప్పటికే సీనియర్లు లేకపోవడంతో రుమటాలజీ, హెమటాలజీ, ఎండోక్రైనాలజీ, ప్లాస్టిక్ సర్జరీ సహా పలు విభాగాల్లో చికిత్సలు గగనమయ్యాయి. ఆయా విభాగాలపై ఆధారపడిన రోగులతో పాటు సూపర్ స్పెషాలిటీ కోర్సులు చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది.

**రెసిడెంట్లపైనే భారమంతా..**

పోస్టు గ్రాడ్యుయేషన్ మెడికల్ ట్రైనింగ్ సెంటర్లలో నిమ్స్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైంది. 1986లో దీని పడకల సామర్థ్యం 500 కాగా, ప్రస్తుతం 1,500కి చేరింది. ప్రస్తుతం ఇక్కడ వివిధ విభాగాల్లో 423 మంది రెసిడెంట్ డాక్టర్లు చదువుతున్నారు. రోగుల తాకిడి పెరగడం, వారి నిష్పత్తికి తగిన వైద్యులు లేకపోవడంతో రెసిడెంట్లపై భారం పడుతోంది. 'నిమ్స్‌లో రోగులకు ఇంకా సేవచేసే ఓపిక ఉంది! మరికొంత కాలం పనిచేసే అవకాశమివ్వండి' అని పలువురు నిపుణులు నిమ్స్ పాలకమండలికి మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకపోతోంది. దీనిపై నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ.. 'ఒకటి రెండు రోజుల్లో పాలకమండలి సమావేశం ఉంది. వైద్యుల పదవీ విరమణ వయసు పెంపుపై ఇందులో చర్చించి నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com